కిషన్‌చందర్ రచనలు-1
రూ॥ 200/-
పేజీలు: 220



ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ, హిమాయత్‌నగర్ (హైదరాబాద్) హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



బిహార్‌లో ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా.. ఇండియా కూటమి ఎంపిలు నిరసన

అంతర్జాతీయ వ్యవహారాల్లో కొత్త ధృవాలు

ఎస్ఎల్‌బిసి ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు

లోపలి పేజీల్లో



సంపుటి 28, సంచిక: 50 | శనివారం | 9-08-2025 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00




## మీరు తప్పించుకోలేరు...

'మీరు కప్పిపుచ్చలేరు, దాచలేరు. మీరు ఒక రోజు ప్రతిపక్షాలను ఎదుర్కోవలసి ఉంటుంది. ప్రతి అధికారి, ఎన్నికల కమిషనర్ ఈ విషయాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. గత ఎన్నికలలో, మోదీ, బిజెపి నాయకులు రాజ్యాంగంపై దాడి చేశారు. భారతీయ వ్యవస్థను నాశనం చేశారు.లోక్‌సభ ఎన్నికలు కూడా దొంగిలించబడ్డాయని నేను మీకు విశ్వాసంతో, ఆధారాలతో చెబుతున్నాను. తాము రాజ్యాంగంపై దాడి చేసి తప్పించుకోగలమని ఎవరైనా అధికారులు అనుకుంటే, వారు పునరాలోచించాలి. వారిపై చర్యలు తీసుకోవడానికి సమయం పట్టవచ్చు, కానీ వారు ఒక్కొక్కరుగా పట్టుబడతారు.నా మాటలు గుర్తుంచుకోండి, ఎందుకంటే మీరు రాజ్యాంగంపై దాడి చేస్తే, మేము మీపై దాడి చేస్తాం.'

—ఇసిపై రాహుల్‌గాంధీ ధ్వజం

# దొంగతనంగా ప్రధాని అయ్యారు

## ఓటర్ల ఎలక్ట్రానిక్ డేటా ఇస్తే నిరూపిస్తా

## ఎన్నికల కమిషన్‌కు ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సవాల్

- ఇవ్వకపోతే తక్కువ మెజారిటీ వచ్చిన సీట్లలో మేమే శోధిస్తాం
- ఓటర్ల జాబితా అడిగితే ఇసి వెబ్‌సైట్‌లను మూసేసింది
- ఇసి, బిజెపిలు కలిసి లోక్‌సభ ఎన్నికలను దొంగిలించాయి
- మహాదేవపురలో నిరూపించాం
- దీనిపై కర్నాటక ప్రభుత్వం విచారణ చేయాలి
- బెంగళూరులో 'ఓట్ అధికార్ ర్యాలీ'లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



**బెంగళూరు :** ప్రధాని నరేంద్ర మోదీ 25 లోక్‌సభ సీట్ల తేడాతో ప్రధానమంత్రి అయ్యారని,దేశవ్యాప్తంగా ఓటర్ల ఎలక్ట్రానిక్ డేటా తమకు లభిస్తే, భారత ప్రధాన మంత్రి దొంగతనం ద్వారా ప్రధాని అయ్యారని తాము నిరూపిస్తామని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతి పక్ష నాయకుడు రాహుల్‌గాంధీ సవాలు విసిరారు. డేటా ఇవ్వకపోతే, కర్ణాటకలోని మహాదేవపుర అసెంబ్లీ నియోజకవర్గంలో నిర్వహించినట్లుగానే లోక్‌సభ ఎన్నికలలో కేవలం 35,000 లేదా అంతకంటే తక్కువ మెజారిటీ వచ్చిన 15 నుంచి 25 సీట్లలో తామే లోతైన పరిశీలన చేస్తామని ఇసిని హెచ్చరించారు.ఎన్నికల సంఘం, బిజెపి కలిసి ప్రజల నుంచి లోక్‌సభ ఎన్నికలను దొంగిలించాయని ఆరోపించారు. దీనిపై అఫిడవిట్ దాఖలు తరువాయి 2లో



## భారీ వర్షాలకు తట్టుకునేలా వ్యవస్థల ప్రక్షాళన

### లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షితంగా ఉండేలా అత్యంత పకడ్బందీ విధానం అమలు చేయాలి

### మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును వెంటనే చేపట్టాలి

### అధికారులకు సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ మహా నగరంలో భారీ వర్షాలు కురిసినప్పటికీ తట్టుకునేందుకు వీలుగా వ్యవస్థలన్నింటినీ ప్రక్షాళన చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎంత వర్షం పడినా వర్షం నీరు నిల్వ ఉండకుండా, వరద నీటితో ముంపు గురవ్వకుండా, లోతట్టు ప్రాంతాల ప్రజలు కూడా సురక్షితంగా ఉండేలా అత్యంత పకడ్బందీ విధానాన్ని అమలు చేయాలని, అందుకు వీలుగా రూపొందిస్తున్న మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును వెంటనే చేపట్టాలన్నారు. చెరువులను, కుంటలను, నాలాలను,ఎస్‌టిపిల ద్వారా మూసీకి అనుసంధానం చేయాలన్నారు. తాగునీరు, వరద నీరు, డ్రైనేజీలు, ట్రాఫిక్ వ్యవస్థలను మరో వందేళ్ల భవిష్యత్తు అవసరాలను అంచనా వేసుకొని కొత్త ప్రణాళిక తరువాయి 2లో

## రాహుల్ ప్రమాణపూర్వకంగా అఫిడవిట్ ఇవ్వాలి

ఎన్నికల కమిషన్

పార్లమెంటులోనే ప్రమాణం చేశా : రాహుల్‌గాంధీ

05

## పార్లమెంటు నుంచి ఇసి వరకు 11న 'ఇండియా' మార్చ్

### ఓటు హక్కును పరిరక్షిస్తాం : డి.రాజా



**న్యూఢిల్లీ:** స్వాతంత్ర్య పోరాటం ద్వారా సాధించుకున్న ఓటు హక్కుకు ఎట్టిపరిస్థితుల్లోనూ విఘాతం కలగనివ్వమని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా తేల్చిచెప్పారు. ఓటు హక్కును హరించే ప్రసక్తే లేదని, అలా ఎప్పటికీ జరగనివ్వమని అన్నారు. ఓటర్ ఎమ్యునరేషన్, బిహార్ ఎస్ఐఆర్‌తో పాటు ఎన్నికల మోసాలపై ఎన్నికల సంఘం నుంచి స్పష్టత డిమాండ్ చేస్తూ ఈనెల 11న పార్లమెంటు నుంచి తరువాయి 2లో

## అమెరికా సుంకాలపై మౌనమెందుకు?



### కేంద్రాన్ని నిలదీసిన వామపక్ష ఎంపిలు : పార్లమెంటు వద్ద నిరసన

**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్యాన్ని అడ్డుపెట్టుకొని, భారీ సుంకాలు, అదనపు జరిమానాలు విధిస్తూ భారత్‌ను ఆటాడుకుంటున్నారని సీపీఐ ఎంపీలు పి.సందోశ్ కుమార్, వి.సెల్వరాజ్, పీపీ సునీర్ విమర్శించారు. అమెరికా వేధిస్తుంటే కేంద్రం ఎందుకు మౌనంగా ఉంటోందని నిలదీశారు. ప్రధాని, కేంద్ర మంత్రులు దీటుగా సమాధానం ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. అమెరికా సామ్రాజ్య వాదాన్ని, ఒడిశాలో నన్స్‌పై దాడిని సిపిఎం, తరువాయి 2లో

## అమెరికా కపట విధానాన్ని తిప్పికొట్టాలి

### సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ



**న్యూఢిల్లీ:** వాణిజ్యాన్ని అస్త్రంగా మలుచుకొని సుంకాల పేరిట భారత్‌పై అమెరికా తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తున్నాగానీ రష్యా నుంచి చమురు కొనుగోళ్లు కొనసాగిస్తుండటం స్వాగతించదగ్గ అంశమని సిపిఐ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. ఇలా కొనుగోలు చేసిన చమురును ఇతర దేశాలకు ఎగుమతి చేస్తూ, వచ్చే లాభాలను ప్రజలతో ప్రభుత్వం పంచుకోవాలన్నారు. ఇందుకు భిన్నంగా డీజిల్, పెట్రోల్ వంటి పెట్రోలియం ఉత్పత్తులను సొంత ప్రజలకు తక్కువ ధరలకు కేంద్రం ఇవ్వడం లేదని శుక్రవారం ఒక ప్రకటనలో తరువాయి 2లో



## 13న 'ట్రంప్' దిష్టిబొమ్మల దహనం

### తెలంగాణ రైతు సంఘం పిలుపు

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశంలో ఉన్న పబ్లిక్ సెక్టార్ కంపెనీలను, ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మిక హక్కులను కాలరాస్తూ, రైతు వ్యతిరేక నల్ల చట్టాలను పూర్తిగా రద్దు చేయాలని ఈ నెల 13న హైదరాబాదులోని నారాయణగూడ ఫ్లైఓవర్ వద్ద 'కేంద్ర ప్రభుత్వ' సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్' దిష్టిబొమ్మలను దహనం చేయాలని తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశపద్మ, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు పిలుపునిచ్చారు. హైదరాబాద్, హిమాయత్ నగర్ లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో 'కేంద్ర కార్మిక, రైతు సంఘాల' రౌండ్ టేబుల్ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు అధ్యక్షత వహించగా పశ్యదప్మతో పాటు ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ, తరువాయి 2లో

### ప్రభాకర్‌రావు రీ అపాయింట్‌మెంట్‌పై

## చర్చనీయాంశంగా 'ప్రజాపక్షం' వార్త

ప్రజాపక్షం/హైదరాబాద్



ఆల్ ఇండియా సర్వీస్ రూల్స్‌ను ఉల్లంఘించి..మాజీ ఐజి ప్రభాకర్‌రావును ఆనాటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఎస్ఐబి ఐజిగా తిరిగి నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను ''రిటైర్డ్ అయ్యాక ఐపిఎస్ హోదానా?'' అనే శీర్షికతో వెలుగులోకి తెచ్చిన 'ప్రజాపక్షం' కథనంపై అటు ఐపిఎస్ వర్గాల్లో ఇటు ప్రభుత్వ వర్గాల్లో చర్చకు దారి తీసింది.

రిటైర్డ్ అయిన ఐపిఎస్ అధికారికి తిరిగి ఐపిఎస్ హోదాతో పాటు ఐజి (క్యాడర్ పోస్టు)గా నియమించడంపై ఐపిఎస్ అధికారులు చర్చించుకుంటున్నారు. గతంలో రిటైర్డ్ అయిన ఐపిఎస్ అధికారులకు నాన్ క్యాడర్ పోస్టుల్లో మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఐపిఎస్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో డిజిపిగా పనిచేసిన ఐపిఎస్ అధికారి అనురాగ్ శర్మను అప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వం సలహాదరు (నాన్ క్యాడర్ పోస్టులో)గా నియమించింది. ఈ ఉత్తర్వులో ఆల్ ఇండియా సర్వీస్ రూల్స్‌ను అనుగుణంగానే అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం నడుచుకుంది. అలాగే ఇటీవల ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా ఈ ఏడాది ఎప్రిల్ 30న ఐజి కమలాసన్‌రెడ్డి పదవీ విరమణ పొందారు. అదే రోజు అతనికి నాన్ క్యాడర్ పోస్టులో నియమిస్తూ ప్రస్తుత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ప్రభాకర్‌రావు విషయంలోనే అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం క్యాడర్ పోస్టులో నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వులు మాత్రమే గందరగోళం సృష్టించింది. మరో పక్క ఫోన్ ట్యాపింగ్ కేసును దర్యాప్తు చేస్తున్న సిట్ అధికారులు ప్రభాకర్‌రావుకు తిరిగి పోస్టింగ్ ఇవ్వడాన్ని సవాలు చేసేందుకు ఏ విధంగా ముందుకు పోవాలనే విషయంపై సిట్ అధికారులు తర్జనభర్జన పడుతున్నారు.

### దేశ వ్యాప్తంగా

## 586 ఐపిఎస్ పోస్టులు ఖాళీ

- 5,055 పోస్టులకు గాను భర్తీ చేసినవి 4,469
- సిబిఐలో ఏకంగా 50 శాతం.. ఐబిలో 40 శాతం కొరత
- కేంద్ర సంస్థల్లో 31 శాతం ఐపిఎస్‌ల కొరత



ప్రజాపక్షం/హైదరాబాద్

దేశవ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పోలీసు సంస్థలలో 586 ఐపిఎష్ పోస్టులు నేటికి భర్తీ కాకుండా ఖాళీగా ఉన్నాయి. ఈ ఖాళీలలో 209 డైరెక్ట్ నియామకాలు ఉండగా, 377 ప్రమోషన్ పోస్ట్‌ల్లో ఉన్నాయి . మొత్తం 5,055 ఐపిఎస్ పోస్టులకు గాను 4,469 మందినే నియమించారు. ఇక కీలక విభాగాలైన సిబిఐలో 50 శాతం, ఐబి సంస్థల్లో ఏకంగా 40 శాతం వరకు ఐపిఎస్‌ల కొరత ఉంది. ఇక కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో నడిచే 17 వివిధ పోలీసు విభాగాలలో సుమారు 32 శాతం మంది ఐపిఎస్‌ల కొరత ఉంది. కేంద్ర ప్రభుత్వ హోంమంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం ఈ 17 విభాగాలలో డైరెక్టర్ ఆఫ్ జనరల్ (డిజి) స్థాయి నుంచి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు (ఎస్‌పి) స్థాయి ఐపిఎస్ అధికారులు 681 మంది ఉండాలి. అయితే ప్రస్తుతం 466 మంది మాత్రమే ఉన్నారు. ఈ లెక్కన మరో 215 ఐపిఎస్ పోస్టులు డిజి స్థాయి నుంచి ఎస్‌పి స్థాయి వరకు ఖాళీలు ఉన్నాయి. ఈ లెక్కన 32 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వందలు, వేలాది కోట్లను దోచుకున్న పెద్ద పెద్ద రాజకీయ నేతలు, పారిశ్రామిక వేతలు, ప్రముఖుల కేసులు చూసే కీలక విభాగమైన సిబిఐలో 130 ఐపిఎస్ పోస్టులు మంజూరు కాగా కేవలం 69 మంది మాత్రమే ఉన్నారు. సిబిఐలో సుమారు 50 శాతం వరకు ఐపిఎస్ పోస్టులు భర్తీ కాకుండా ఖాళీగా ఉన్నాయి. గత ఏడాది కూడా దాదాపు ఇదే పరిస్థితి దాపురించి ఉంది. ఇక ఉగ్రవాదులు, మావోయిస్టులు కేసులను దర్యాప్తు చేసే జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ)లో ఐపిఎస్ పోస్టులు 66 మంజూరు ఉండగా 52 మంది ఉన్నారు. ఇంకా 14 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఈ లెక్కన ఎన్ఐఎలో 20 శాతం ఐపిఎస్‌ల కొరత ఉంది. ఇక కేంద్ర ప్రభుత్వానికి గుండెకాయగా చెప్పుకునే నిఘా సంస్థ అయిన ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబి)లో ఐపిఎస్ పోస్టులు 194 ఉండగా 106 మంది మాతమే తరువాయి 2లో

### ఎమ్మెల్యే కూనంనేనిపై

## పిటిషన్‌ను 'సుప్రీం' డిస్మిస్

**న్యూఢిల్లీ :** కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ఎన్నికపై మాజీ ఎం ఎల్ ఏ జలగం వెంకట్రావు వేసిన కేసును సుప్రీం కోర్టు డిస్మిస్ చేసింది. సుప్రీంకోర్టులో జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ ధర్మాసనం పిటిషన్‌ను గురువారం అడ్మిషన్ సమయంలోనే కొట్టివేసింది. గతంలో ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావుపై తెలంగాణ హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలైంది. జస్టిస్ కె.లక్ష్మ ణ్ ఎదుట కేసులో సీనియర్ న్యాయవాది విద్యాసాగర్ వాదనలు వినిపించారు. ఉభయ పక్షాల వాదనలు విన్న ఏకసభ్య ధర్మాసనం జూన్ 9న ఎన్నికల పిటిషన్‌ను కొట్టివేసింది. ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు ఎన్నిక విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ మాజీ ఎంఎల్‌ఏ జలగం వెంకట్రావు సుప్రీం కోర్టులో అప్పీలు చేశారు. దీనిపై గురువారం సుప్రీం కోర్టు ద్విసభ్య ధర్మాసనం ఎదుట రాగా, అడ్మిషన్ స్థాయిలోనే అప్పీల్‌ను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్య బాగ్చీలు తిరస్కరించారు.



## స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐకి గణనీయమైన సీట్లు

### కమ్యూనిస్టు పార్టీ పేదల పక్షాన నిలబడి పోరాడుతుంది

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి

ప్రజాపక్షం/కరీంనగర్

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ జడ్పిటిసి, ఎంపిపిలు, సర్పంచ్‌ల స్థానాలను గణనీయమైన సంఖ్యలో గెలుస్తుందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి విశ్వాసం వ్యక్తంచేశారు. కరీంనగర్‌లోని సిపిఐ కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్ లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు సాధ్యమైనంత తరువాయి 12లో

## గాజా ఆక్రమణకు సన్నాహాలు!

### ఇజ్రాయెలీ సెక్యూరిటీ కేబినెట్ ఆమోదం

**జెరుసలేం:** పాలస్తీనాను ప్రపంచ పటం నుంచి లేకుండా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహుకు సెక్యూరిటీ కేబినెట్ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది. దీనితో, గాజాలో పరిస్థితి ఏ విధంగా మారనుందనే విషయం ఆందోళన కలిగిస్తున్నది. ఇప్పటికే అక్కడ లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. కనీస అవసరాలు కూడా తీరడం లేదు. అంతర్జాతీయ మానవతా సాయాన్ని కూడా ఇజ్రాయెల్ అడ్డుకుంటున్నది. చివరికి సహాయక కేంద్రాల వద్ద కూడా దాడులు జరుపుతూ ఇజ్రాయెలీ సైనికులు మారణహోమం కొనసాగిస్తున్నారు. ఇప్పుడు సెక్యూరిటీ కేబినెట్ నుంచి ఆమోదం లభించడంతో, గాజాను పూర్తిగా స్వాధీనం చేసుకోవడమే ధ్యేయంగా నెతన్యాహు పావులను కదిపే అవకాశం ఉంది. పాలస్తీనియన్ల నుంచి ప్రతిఘటన ఎదురైతే, అక్కడి పరిస్థితులు



అత్యంత దారుణంగా మారడం ఖాయంగా కనిపిస్తున్నది. కేబినెట్‌లో కొంత మంది ఈ ప్రణాళికపై అనుమానాలు వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. గాజాలో హమాస్‌ను ఓడించడం అనుకున్నంత సులభం కాదని, అదే విధంగా వారి వద్ద బందీలుగా ఉన్న తమవారిని విడిపించుకోవడంలోనూ సమస్యలు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, సుదీర్ఘ చర్చల అనంతరం, గాజాను పూర్తిగా స్వాధీనం చేసుకోవడానికి సెక్యూరిటీ కేబినెట్ తరువాయి 12లో

### ఎస్ఐబి వ్యవస్థను కెసిఆర్

## భ్రష్టు పట్టించారు

### కేసును సిబిఐకి అప్పగించండి

### కేంద్ర మంత్రి బండి సంజయ్

ప్రజాపక్షం / హైదరాబాద్



కెసిఆర్ ప్రభుత్వం ఎస్ఐబి వ్యవస్థను భ్రష్టు పట్టించిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. 6 వేల 500 మంది ఫోన్లను కెసిఆర్ ప్రభుత్వం ట్యాప్ చేసిందని ఆయన స్పష్టం చేశారు. తమకు కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం లేదని ఈ కేసును సిబిఐకి అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు వెస్ట్‌జోన్ డిసిపి విజయ్‌కుమార్ దిల్‌కుషా గెస్ట్‌హౌస్‌లో బండి సంజయ్‌ను విచారించారు. ఫోన్ ట్యాపింగ్ తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## అతిగా ఆధారపడ్డ భారత్

అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారతదేశంపై విధించిన టారిఫ్ పెంపులు, రష్యాతో వ్యాపార సంబంధాలను ఛేదించమన్న డిమాండ్లు కేవలం ఆర్థిక విధానాలే కాదు, భారత సార్వభౌమత్వంపై సవాల్లు. ట్రంప్ ప్రభుత్వం భారతీయ ఎగుమతులపై 50 శాతం సుంకాలు విధించి, రష్యాతో క్రూడ్ ఆయిల్ ఒప్పందాలను నిషేధించడానికి ప్రయత్నించిన సందర్భంలో, భారత ప్రభుత్వం యొక్క నిశ్శబ్దం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ట్రంప్తో సన్నిహిత సంబంధాలు ప్రచారం చేసినా, ఆయన భారత ప్రయోజనాలను సమర్థవంతంగా పరిరక్షించలేకపోయారు. ఈ పరిస్థితి భారత ఆర్థిక విధానాలలోని దౌర్బల్యాన్ని, అమెరికాపై ఉన్న అతిగా ఆధారపడటాన్ని బహిర్గతం చేస్తుంది. రష్యా భారతదేశానికి కేవలం వాణిజ్య భాగస్వామి మాత్రమే కాదు, సామరస్యపూర్వకమైన జియోపొలిటికల్ మిత్రుడు. 1971లో బాంగ్లాదేశ్ యుద్ధంలో రష్యా భారతానికి అండగా నిలిచింది. కాశ్మీర్ విషయంలో ఐక్యరాజ్యసమితిలో మద్దతు ఇచ్చింది. ఇప్పటికీ భారత రక్షణ వ్యవస్థలో 60 శాతం సైనిక సామగ్రి రష్యాదే. సోవియట్ యూనియన్ సహాయంతో బాంబే హైలో భారీ నిల్వలు కనుగొనబడ్డాయి. ఇది అమెరికా విశ్వసనీయతపై ప్రశ్నార్థకాలను ఎత్తుతుంది.

# భారత్—పాక్ యుద్ధాన్ని ఆపింది మేమే...

### అమెరికా పునరుద్ఘాటన

**న్యూయార్క్:** ఆసియాలోని రెండు 'అణు దేశాలు' భారత్, పాకిస్తాన్ ఇటీవల యుద్ధానికి సిద్ధమయ్యాయని, అయితే, సకాలంలో జోక్యం చేసుకొని, ఆ ప్రమాదాన్ని నిలువరించామని అమెరికాలో మరోసారి ప్రకటించుకుంది. ఈ ఏడాది మే మాసం నుంచి ఇప్పటి వరకూ అనేక సందర్భాల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇదే అంశాన్ని ప్రస్తావిస్తునే ఉన్నారు.

అమెరికా జోక్యం ఏమీ లేదని, పరస్పర చర్చలతోనే కాల్పుల విరమణ సాధ్యమైందని భారత్ కూడా పలుమార్లు స్పష్టం చేసింది. పాక్తో యుద్ధం రాకపోవడంలో ట్రంప్ ప్రమేయం లేదని పేర్కొంటున్నది. అయితే, అమెరికా మత్రం పాత విషయాన్నే పదేపదే చెప్తున్నది. తాజాగా అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా భారత్—పాక్ యుద్ధాన్ని ఆపిన ఘనత ట్రంప్కే దక్కుతుందని అన్నారు. 'ఇడబ్ల్యుటిఎన్' నిర్వహించిన 'ది వరల్డ్ ఓవర్' కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడిన రూబియో, అత్యంత ప్రమాదకరమైన యుద్ధా న్ని సకాలంలో స్పందించి, జోక్యం చేసుకొని, రెండు దేశాలతో మాట్లాడి ఆపివేయగలిగామని పునరుద్ఘాటించారు. ఇరు దేశాల డైరెక్టర్స్ జనరల్ ఆఫ్ ఆపరేషన్స్ (డిజిఎంఒ)ల స్థాయి సమావేశాల్లో అంగీకారం కుదిరిందన్న భారత ప్రభుత్వ వాదనకు, అమెరికా చేస్తున్న ప్రకటనలకు ఎక్కడా పొంతన లేదు. 'భారత్, పాకిస్తాన్ దేశాలు యుద్ధాన్ని సిద్ధమవుతున్న సమయంలో మా అధ్యక్షుడు జోక్యం చేసుకున్నారు. శాంతి నెలకొల్పారు' అని రూబిన్ వ్యాఖ్యానించారు. యుద్ధానికి వెళ్లకపోతే, భారీ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటామని కూడా భారత్, పాక్లకు ట్రంప్ సూచించారని అన్నారు. కంబోడియా—థాయిలాండ్, అజర్బైజాన్—ఆర్మేనియా దేశాల మధ్య యుద్ధాలను కూడా 'శాంతి దూత' ట్రంప్ ఆపినట్టు రూబిన్ తెలిపారు. రిపబ్లిక్ ఆఫ్ కాంగో— రువాండా, రష్యా— ఉక్రేన్ యుద్ధా లు నిలిచిపోయే దిశగా ట్రంప్ ప్రయత్నాలు జరుపుతున్నారని అన్నారు. ఏదిఏమైనా భారత్—పాక్ మధ్య యుద్ధ నివారణ తమ ఘనతేనని మరోసారి ప్రకటించిన అమెరికా, ఈ అంశం పై సాగుతున్న చర్చలు.. వాదోపవాదాలకు ఆజ్యం పోసింది.

# గాజా ఆక్రమణను ఆపేయాలి: ఐరాస



**టెల్అవీవ్ :** గాజా స్ట్రిప్ స్వాధీనం దిశగా వేసే అడుగులను ఇజ్రాయిల్ తక్షణమే ఉపసంహరించుకోవాలని ఐక్యరాజ్య సమితి (ఐరాస్) తేల్చిచెప్పింది. తమ సైన్యం గాజాను సంపూర్ణంగా ఆక్రమించుకోవాలనే ఇజ్రాయిల్ ప్రభుత్వ ప్రణాళికను ఇప్పటికప్పుడు ఆపేయాలని ఐరాస మానవ హక్కుల అధినేత వోల్కర్ టర్క్ శుక్రవారం స్పష్టంచేశారు. అంతర్జాతీయ న్యాయ వ్యవస్థ (ఐసీసీ) ఆదేశాలకు విరుద్ధంగా ఇజ్రాయిల్ యోచన ఉన్నదని, దురాక్రమణను ఇజ్రాయిల్ తక్షణమే ఆపేయాలని, టూ స్టేట్ పరిష్కారానికి అంగీకరించాలని, పలస్తీనా సార్వభౌమత్వాన్ని గుర్తించాలని టర్క్ వెల్లడించారు. ప్రపంచ దేశాల అభ్యంతరం గాజా స్వాధీనం దిశగా ఇజ్రాయిల్ అడుగులపై ప్రపంచ దేశాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. గాజా పలస్తీనా ప్రజలకు చెందుతుందని, దానిని మీరెలా స్వాధీనం చేసుకుంటారని చైనా ప్రశ్నించింది. ఇటువంటి ప్రమాదకరమైన చర్యలను తక్షణమే ఆపేయాలని ఇజ్రాయిల్కు సూచించింది. 'గాజా పలస్తీనా ప్రజలకు చెందినది. పలస్తీనా భూభాగంలో విడదీయలేని భూభాగం. గాజాలో మానవతా సంక్షోభాన్ని పరిరక్షించడం, బందీల విడుదలకు సురక్షితమైన మార్గం ఏమైనా ఉందంటే అది తక్షణ కాల్పుల విరమణ' అని చైనా విదేశాంగ శాఖ శుక్రవారం ఒక ప్రకటన చేసింది. అదే విధంగా ఇజ్రాయిల్ ముమ్మాటికీ తప్పు చేస్తోందని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ అన్నారు. ఈ నిర్ణయాన్ని పున: సమీక్షించాలని ఇజ్రాయిల్కు సూచించారు. ఇలాంటి చర్యలతో ఘర్షణలు మరింతగా పెరుగుతాయని హెచ్చరించారు. ఇజ్రాయిల్ తక్షణమే తమ ప్రణాళికను ఉపసంహరించుకొనేలా ప్రపంచ దేశాలు ఒత్తిడి తేవాలని టర్కీ పిలుపునిచ్చింది. ఈ నిర్ణయం అమల్లోకి రాకుండా బాధ్యతాయుతంగా అంతర్జాతీయ సమాజం వ్యవహరించాలని కోరుతున్నామంటూ టర్కీ విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. పలస్తీనా ప్రజలను తమ మాతృభూమి నుంచి బలవంతం గా తరలించేయాలని ఇజ్రాయిల్ రూపొందించుకున్న ప్రణాళికలు ఎట్టిపరిస్థితుల్లో కార్యరూపం దాల్చరాదని పేర్కొం ది. గాజాపై సైనిక చర్యలను మరింత పెంచాలని, మరింతగా వినాశనం చేయాలని, అక్కడి ప్రజల వెతలను పెంచాలని, గాజా భూభాగాన్ని పూర్తిస్థాయిలో ఆక్రమించుకోవాలని ఇజ్రాయిల్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామంటూ స్పెయిన్ విదేశాంగ శాఖ జోసె మాన్యుల్ అల్బేరస్ వెల్లడించారు. శాశ్వత కాల్పుల విరమణ, తక్షణమే మానవతా సాయానికి అనుమతి, ఆపై బందీలందరినీ విడిపించడం తక్షణమే తీసుకోవాల్సిన చర్యలన్నారు. అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘి స్తూ, గాజా ఆక్రమణ దిశగా ముందుకెళ్లే ఇజ్రాయిల్ ప్రయత్నం ఆక్షేపణీయమని స్వీడెన్ విదేశాంగ శాఖ మంత్రి మారియా మల్మార్ స్టీనెగార్డ్ అన్నా రు. 'ఇజ్రాయిల్ ప్రభుత్వ నిర్ణయం తీవ్రస్థాయిలో ఆందోళన కలిగిస్తోంది. మేము తక్షణమే కాల్పుల విరమణ జరగాలని కోరుతున్నాం' అని ఆమె వెల్లడించారు.

# ప్రపంచంలో అతిపెద్ద సస్పెన్షన్ బ్రిడ్జ నిర్మాణానికి రోమ్ ఆమోదం



**రోమ్:** ప్రపంచంలోనే అతిపెద్ద సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణానికి రోమ్ ప్రభుత్వం ఆమోదం తెలియజేసిం ది. భూకంపాలను కూడా తట్టుకుని నిలబడేవిధంగా అత్యంత పగడ్బందీగా కొత్త సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ఈ సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మిస్తారు. ఈ వరల్డ్ క్లాస్ బ్రిడ్జి నిర్మాణం తో రెండు రైల్వే లైన్లు, మూడు వాహన రాకపోక ల లైన్లు అందుబాటులోకి వస్తాయి. ఈ బ్రిడ్జి నిర్మాణంవల్ల ఏడాదికి 1.20 లక్షల కొత్త ఉద్యోగాలు వస్తాయి. ఆర్థిక వనరుల లోటు, పర్యావర ణ అనుమతుల్లో ఆలస్యం కారణంగా అనేక సంవత్సరాలుగా ఈ బ్రిడ్జి నిర్మాణానికి ఆమోదంలో ఇప్పటివరకూ తీవ్ర జాప్యం జరిగింది. ఎట్టకేలకు ఈ వంతెన నిర్మాణానికి ఆమోదం పడటంతో సిసిలీ ద్వీపం నుండి మెయిన్ ల్యాండ్ కలబ్రియా ప్రాంతానికి ప్రజలు సులభంగా రాకపోకలు సాగించడానికి వీలైన ఒక పరిష్కారం లభించే అవకాశం కలిగింది. ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనీ మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు నిర్మాణం అంత తేలికైన విషయం కాదనీ, ఇది వర్తమానానికీ, భవిష్యత్తుకు సంబంధించిన విషయమని అన్నారు. మెడిటెర్రానియన్ ప్రాంతంలో భూప్రకంపనలు అత్యధింకంగా జరిగే చాలా క్రియాశీల ప్రదేశం. ఎట్టకేలకు ఈ ప్రాంతంలో 3.7 కి.మీ నిడివిగల సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణానికి ఆమోదముద్ర లభించింది. టర్కీ వాయువ్య ప్రాంతంలో ఉన్న డార్డనెల్లెస్ జలసంధిపై నిర్మించిన కనక్కల్లే బ్రిడ్జి సృష్టించిన రికార్డును రోమ్లో నిర్మించబోయే సస్పెన్షన్ బ్రిడ్జి అధిగమిస్తుంది. ఇటలీ ఆర్థికమంత్రి మెట్టియో సల్లినీ మాట్లాడుతూ, ఈ వంతెన నిర్మాణం వల్ల ఈ ప్రాంతంలో ఆర్థికవృద్ధి జరుగుతుందని చెప్పారు. యూరప్లో ఉన్న ఈ సిస్లియా, కలబ్రియా ప్రాంతాలు పేదరికంలో ఉన్నాయన్నారు.

## భారత్తో చర్చల్లేవ్: ట్రంప్



**వాషింగ్టన్:**రష్యాతో వాణిజ్యం కారణంతో భారత్పై సుంకా ల భారాన్ని మోపిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్... సుంకాలపై వివాదం పరిష్కారం అయ్యేంత వరకు వాణిజ్యపరంగా ఎలాంటి చర్చలను భారత్తో జరపబోమని వెల్లడించారు. ఓవల్ కార్యాలయంలో ప్రముఖ వార్తా సంస్థతో మాట్లాడిన సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ నుంచి జరిగే దిగుమతులపై సుంకాలను రెట్టింపు చేస్తూ ట్రంప్ ప్రభుత్వం ఇటీవల ప్రకటన చేసింది. దీనిని భారత్ ఖండించింది. దేశ ప్రయోజనాలే తమకు ముఖ్యమని తెలిపింది. ఈ క్రమంలో భారత్పై 50 శాతం సుంకాలు విధించాక వాణిజ్యపరంగా సంప్రదింపులను పెంచే అవకాశం ఉందా అన్న ప్రశ్నకు... లేదంటూ ట్రంప్ బదులిచ్చారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు అందుకు ఎంత మాత్రం ఆస్కారం లేదని ఆయన తేల్చిచెప్పారు. ఇదిలావుంటే, తమ దేశానికి భారత్ వ్యూహాత్మక భాగస్వామి అని అమెరికా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి టామీ పిగోట్ తెలిపారు. సుంకాల నేపథ్యంలో రెండు దేశాల మధ్య ఉద్రిక్తత కొనసాగుతున్నప్పటికీ చర్చలు పూర్తిస్థాయిలో జరుగుతాయని చెప్పారు. వాణిజ్యం, రష్యా నుంచి చమురు కొనుగోలు వంటి విషయాల్లో ట్రంప్ చర్యలు తీసుకున్నారన్నారు. రష్యా నుంచి చమురు కొన వద్దంటే భారత్ పట్టించుకోలేదు కాబట్టే ఆ దేశంపై విధించిన 25 శాతం సుంకాన్ని 50 శాతానికి పెంచారని టామీ వెల్లడించారు. కాగా, సుంకాలు ఈనెల 27 నుంచి అమలవుతాయి.

# గడచిన ఐదేళ్లలో కెనడాలో 1,203 మంది భారతీయ పౌరులు మృతి

### వాటిలో వృద్ధాప్యం, అనారోగ్యం వంటి సహజ మరణాలే అధికమని మంత్రి కీర్తివర్ధన్ లిఖితపూర్వక సమాధానం

**న్యూఢిల్లీ :** ఐదేళ్ల కాలంలో (2020—2024మధ్య) కెనడాలో మొత్తం 1,203మంది భారతీయ పౌరులు మరణించారని ప్రభుత్వం పార్లమెంట్కు తెలిపింది. వారిలో అధిక సంఖ్యలో వృద్ధాప్యం లేదా వైద్య, అనారోగ్యం వంటి సహజ కారణాల వల్ల మరణించారని ప్రభుత్వం గురువారం ఈ విషయాన్ని పార్లమెంట్కు వెల్లడించింది. ఈ ఐదేళ్ల కాలంలో 757మంది భారతీయుల భౌతికకాయాలు లేదా చితాభస్మాన్ని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఇఏ) సహాయంతో కెనడా నుండి భారతదేశానికి విజయవంతంగా తీసుకొచ్చామని విదేశాంగ శాఖ సహాయమంత్రి కీర్తి వర్ధన్ సింగ్ రాజ్యసభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా తెలిపారు.గత ఐదు సంవత్సరాలుగా కెనడాలో మరణించిన భారతీయ పౌరుల సంఖ్య, అధికారిక రికార్డుల ప్రకారం ఈ మరణాలకు గల కారణాలను విదేశాంగ మంత్రిత్వ శాఖ అడిగింది. మంత్రిత్వ శాఖ వద్ద అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం 'మొత్తం 1,203 మంది భారతీయ పౌరులు 2020—2024 మధ్య కాలంలో కెనడాలో మరణించారు. వారిలో అత్యధిక మరణాలు ఓల్డ్ ఏజ్ లేదా వైద్య అనారోగ్యం వంటి సహజ మరణాల వల్ల జరిగాయి. రోడ్డు ప్రమాదాలు, హింస, ఆత్మహత్య, హత్యలు తదితర అసహజ మరణాలు చోటుచేసుకున్నాయి' అని మంత్రి కీర్తి వర్ధన్సింగ్ చెప్పారు. 2020లో 120 మరణాలు సంభవించగా, 2022లో 198, 2023లో 336, 2024లో 389 మరణాలు సంభవించాయని వివరాలు వెల్లడించారు. భారత పౌరుల అవశేషాల రవాణాకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి, భారత ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తున్నదని మంత్రి కీర్తివర్ధన్ తెలియజేశారు. మరణాలు, స్థానిక దహన సంస్కారాలు లేదా ఖననం లేదా భారతదేశంలోని వారి స్వస్థలాలకు వారి మృతదేహాలను రవాణా చేయడం, బీమా లేదా పరిహార క్లెయిమ్ల పరిష్కారం వంటి సందర్భాలలో భారత జాతీయుల దుస్థితికి సహాయం చేయడానికి విదేశాలలోని అన్ని మిషన్లు లేదా పోస్ట్లతో సమన్వయం చేసుకోవడానికి విదేశాంగ మంత్రిత్వ శాఖ బాగా స్థిరపడిన యంత్రాంగం లేదా ఎస్ఓపిలను కలిగి ఉన్నదని మంత్రి కీర్తివర్ధన్సింగ్ చెప్పారు.

# 13న 'ట్రంప్' దిష్టిబొమ్మల దహనం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మారగొని ప్రవీణ్ కుమార్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.వి.రమ, వంగూరు రాములు, టి యుసిఐ నాయకులు వి ప్రవీణ్, కెఎస్ ప్రదీప్, ఐఎఫ్టి యు నాయకులు జి.అనురాధ, అరుణ, హెచ్ఎంఎస్ నాయకులు ఎండి అంజాద్, ఎఐకెఎంఎస్ నాయకులు ఎం వెంకన్న, తెలంగాణ రైతాంగ సమితి నాయకులు జక్కుల వెంకటయ్య, ఏఐఎడబ్ల్యు యు నాయకులు ఆర్.వి. రాములు తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 13న రాష్ట్ర హైదరాబాద్తో పాటు అన్ని జిల్లా కేంద్రాలలో నరేంద్ర మోదీ దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. సెప్టెంబర్ 22వ తేదీన నల్ల బ్యాడ్జీలను ధరించి కార్మికులు, రైతులు తమ సమస్యలను పరిష్కరించాలని ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలను అందజేయాలని, నవంబర్ 26వ తేదీన మరోసారి సార్వత్రిక సమ్మెను కూడా నిర్వహించి కేంద్ర ప్రభుత్వ కళ్లు తెరిపించాలన్నారు. కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేసే వరకు అవసరమైతే ఈ సంవత్సరం పొడుగునా ఢిల్లీ కేంద్రంగా నిరసన కార్యక్రమాలను నిర్వహించేందుకు కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు సన్నద్ధం కావాలని వారు తెలిపారు.

దేశ సార్వభౌమాధికారాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్వద్ద తాకట్టు పెట్టేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తే దేశం భగ్గునమండుతుందని పశ్యపద్మ హెచ్చరించారు. ఇప్పటివరకు జరిగిన స్వేచ్ఛా వాణిజ్య చర్చలను పార్లమెంటులో సమీక్షించాలని, రైతు లు, కార్మికుల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. భారతదేశం 'ప్రత్యక్ష,పరోక్షంగా' 'రష్యా నుండి చమురు' దిగుమతి చేసుకుంటున్నందుకు ప్రతిస్పందనగా భారతదేశం నుండి దిగుమతులపై అమెరికా అదనంగా 25 శాతం సుంకం విధించిందని, తాజా ఉత్తర్వులతో సుంకాలను 50 శాతానికి చేరుకుంటుందని, ఇంత పెద్ద మొత్తంలో సంకాన్ని విధించడం ప్రపంచంలోని ఏ దేశంలోనూ లేదని వివరించారు. సుంకాలను పెంచడం ప్రపంచంలోని ప్రముఖ సామ్రాజ్యవాద దేశంగా ఉన్న భారత ప్రజలపై ఆర్థిక ఆంక్షలుగా భావిస్తుందన్నారు. రష్యా నుండి భారతదేశం చమురు దిగుమతి 1.30 లక్షల మిలియన్ యూరోలు కాగా, ఇది చైనా దేశం రష్యన్ నుంచి దిగుమతి కంటే 1.90 లక్షల మిలియన్ యూరోలు తక్కువ, అని అయినప్పటికీ చైనాపై అమెరికా సుంకాలు కేవలం 30 శాతం మాత్రమే ఉన్నాయని పశ్యపద్మ వివరించారు. భారతదేశంలో యాభై శాతం కంటే ఎక్కువ మంది ప్రజలు వ్యవసాయం ద్వారా జీవనోపాధి పొందుతున్నారని, దేశంలో వ్యవసాయంపై ఆధారపడిన శ్రామిక శక్తి 48 శాతం ఉండగా, అమెరికాలో ఇది కేవలం 2.6 శాతం మాత్రమేనని వివరించారు. అమెరికా ఒత్తిడికి లొంగిపోవద్దని, ఇండోయుకె ఎఫ్టిఎ సిఇటిఎతో సహా ఎఫ్టిఎలపై ఇప్పటి వరకు జరిగిన చర్చలను పార్లమెంటరీ సమీక్ష చేయాలని, రైతులు, కార్మికుల హక్కులను కాపాడాలని కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని పశ్యపద్మ డిమాండ్ చేశారు. భారత ఆర్థిక వ్యవస్థపై విధించిన ఆర్థిక ఆంక్షలకు వ్యతిరేకంగా రైతులు, కార్మికులు, ప్రజలందరూ ర్యాలీ చేపట్టాలని, దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాలలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేయాలని ఆమె రైతులను కోరారు.

# ప్రధాని అయ్యారు

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని, ప్రమాణం చేసి సమాచారం ఇవ్వాలని ఇసి తనను అడుగుతోందని,తాను పార్లమెంట్లో రాజ్యాంగాన్ని పట్టుకుని ప్రమాణం చేశానని ఆయన అన్నారు. కర్నాటక రాజధాని బెంగళూరులో శుక్రవారం 'ఓట్ అధికార్ ర్యాలీ' జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగసభలో రాహుల్గాంధీతో పాటు ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సిఎం డి.కె.శివకుమార్లు పాల్గొన్నారు. సభను ఉద్దేశించి రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ తాను విడుదల చేసిన ఓట్ చోరీ డేటా ఆధారంగా ప్రజలు ఎన్నికల సంఘాన్ని ప్రశ్నిసుంటే, ఇసి తన వెబ్సైట్ను మూసివేసిందని ఆయన విమర్శించారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, బిహార్లలోని ఎన్నికల సంఘం వైబ్ సైట్ను మూసివేశారని అన్నారు. ఎందుకంటే ప్రజలు డేటా ఆధారంగా ప్రశ్నించడం మొదలుపెడితే, మొత్తం వ్యవస్థ కూలిపోతుందని వారికి తెలుసునని ఆయన అన్నారు.

**ఈ ఐదు ప్రశ్నలకు జవాబివ్వండి..**

తాను అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని కోరారు. భారతదేశ ప్రజలకు డిజిటల్ మెషిన్ రీడబుల్ ఫార్మాట్ (డిజిటల్ మిషన్ చదవగలిగే నమూనా)లో ఓటర్ల జాబితాలను ఇసి ఎందుకు ఇవ్వడం లేదు? ఇసి వీడియో ఆధారాలను ఎందుకు నాశనం చేస్తున్నారు? ఓటర్ల జాబితాలో ఇసి భారీ మోసం ఎందుకు చేస్తోంది? తమ ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా ప్రతిపక్షాలను ఇసి ఎందుకు బెదిరిస్తోంది? బిజెపి ఏజెంట్గా ఇసి ఎందుకు వ్యవహరిస్తోంది? అని ఎన్నికల కమిషన్ను ఉద్దేశించి రాహుల్గాంధీ ఐదు ప్రశ్నలను సంధించారు. కర్నాటకలో లోక్సభ ఎన్నికల దొంగతనం జరిగిందని, మహాదేవపురలో ఆధారాలతో నిరూపితమైందని, ఎన్నికల దొంగతనం అనే నేరంపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని కర్ణాటక ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

**మహారాష్ట్రలో కోటి కొత్త ఓట్లు బిజెపికే వెళ్లాయి**

మహారాష్ట్రలో 2024 లోక్సభ ఎన్నికల్లో తమ కూటమి గెలిచిందని, కానీ నాలుగు నెలల తర్వాత, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి గెలిచిందని, ఇది ఆశ్చర్యకరమైన ఎన్నికల ఫలితమని రాహుల్గాంధీ అన్నారు. తాము విషయం తెలుసుకోవడానికి ప్రయత్నించినప్పుడు, కోటి మంది కొత్త ఓటర్లు ఓటు వేశారని తెలిసిందన్నారు. లోక్సభ ఎన్నికలలో ఎప్పుడూ ఓటు వేయని ఒక కోటి కొత్త ఓటర్లు మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో ఓటు వేశారని తెలిపారు. ఆ కొత్త ఓట్లు బిజెపికి పడ్డాయని, ఇది తప్పులను సూచిస్తుందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ కొత్త ఓటర్లు ఎక్కడ ఓటు వేసినా, అక్కడ బిజెపి గెలిచిందన్నారు. మహారాష్ట్రలో తమ కూటమికి ఓట్లు తగ్గలేదని, లోక్సభలో తమకు లభించిన ఓట్లు శాసనసభ ఎన్నికలలో కూడా కచ్చితంగా పడ్డాయని,అసెంబ్లీ ఎన్నికలలో కొత్త ఓటర్లు ఓటు బిజెపికి వెళ్ళిందని చెప్పారు.

**రాజ్యాంగం పునాది 'ఒక మనిషికి ఒక ఓటు'**

రాజ్యాంగంలో వేల సంవత్సరాల చరిత్ర సిద్ధాంతం ఉందని, అందులో మహాత్మాగాంధీ, అంబేద్కర్, నెహ్రూ, సర్దార్ పటేల్ గొంతు ప్రతిధ్వనిస్తుందని రాహుల్గాంధీ అన్నారు. అలాగే బసవన్న, నారాయణ గురు, జ్యోతిబా పూలే వాఖ్యాలు అందులో ఉన్నాయన్నారు. రాజ్యాంగం పునాది 'ఒక మనిషికి ఒక ఓటు' అని' ప్రతి భారతీయ పౌరుడికి ఒక్కో ఓటు హక్కు ఉంది'ని చెప్పారు. బిజెపి సిద్ధాంతం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, కర్ణాటకలో డబ్బులతో గతంలో ప్రభుత్వాన్ని దొంగిలించిందని రాహుల్ ఆరోపించారు.

# ఐపిఎస్ పోస్టులు ఖాళీ

(మొదటి పేజీ తరువాయి)

విధుల్లో ఉన్నారు. మిగతా 88 ఐపిఎస్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో డిఐజి పోస్టులు 37, ఎస్పి పోస్టులు 51 ఉన్నాయి. అంటే ఈ లెక్కన ఐబిలో సుమారు 40 శాతం ఐపిఎస్ పోస్టుల ఖాళీలు ఉన్నాయి. ఉగ్ర మూకలపై ఆకస్మిక దాడులకు తెగబడే నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ (ఎన్ఎస్జి)లో ఆరు ఐపిఎస్ పోస్టులు ఉండగా పూర్తిగా భర్తీ చేశారు. ఆయా కేంద్ర పోలీసు విభాగాలలో ఐపిఎస్ పోస్టుల వివరాలు ఇలా ఉన్నాయి.

| విభాగం పేరు | మంజూరైనవి | భర్తీ చేసినవి | ఖాళీలు |
|---|---|---|---|
| బిపిఆర్ | 24 | 20 | 4 |
| బిఎస్ఎఫ్ | 55 | 43 | 12 |
| సిబిఐ | 130 | 69 | 61 |
| సిఐఎస్ఎఫ్ | 32 | 21 | 11 |
| ఎఫ్ఎస్సిడి | 2 | 2 | 0 |
| ఐబి | 194 | 106 | 88 |
| ఐటిబిపి | 22 | 19 | 3 |
| ఎన్సిఆర్బి | 8 | 6 | 2 |
| ఎన్సిబి | 10 | 10 | 0 |
| ఎన్డిఆర్ఎఫ్ | 2 | 2 | 0 |
| ఎన్ఇపిఎ | 1 | 1 | 0 |
| ఎన్హెచ్ఆర్సి | 6 | 6 | 0 |
| ఎన్ఐఎ | 66 | 52 | 14 |
| ఎన్పిఎ | 22 | 14 | 8 |
| ఎన్ఎస్జి | 6 | 6 | 0 |
| ఎస్ఎస్బి | 32 | 28 | 4 |
| మొత్తం | 681 | 466 | 215 |

# కపట విధానాన్ని తిప్పికొట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ లాభార్జనతో దేశ ప్రజలపై భారం పడుతోందన్నారు. రష్యాతో దీర్ఘకాలిక స్నేహాన్ని కొనసాగిస్తున్నందుకు కేంద్ర విదేశాంగ శాఖకు సీపీఐ తరపున నారాయణ కృతజ్ఞతలు తెలిపారు. కష్ట కాలంలో భారత్కు రష్యా అండగా నిలిచిందని, 1971 బంగ్లాదేశ్ లిబరేషన్ యుద్ధం సమయంలో భారత్ దళాలకు మద్దతుగా సోవియట్ జలాంతర్గాములు వచ్చాయని నారాయణ గుర్తుచేశారు. భారత్లో రిఫైనరీలను సోవియట్ యూనియన్ ఏర్పాటు చేసిందని, మరమ్మతుల కోసం సాంకేతిక నిపుణులను పంపిందని వెల్లడించారు. ప్రస్తుతం రష్యా నుంచి చమురు కొనుగోళ్లతో ఈ వారసత్వం కొనసాగుతోందని నారాయణ అన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయొద్దంటూ భారత్పై నేడు ఒత్తిడి తెస్తున్న అమెరికా గతంలో వీటిని ప్రోత్సహించిందని, తాజా పరిణామాలతో అగ్రరాజ్య కపటత్వం బహిర్గతమైందని నారాయణ వ్యాఖ్యానించారు. ఆర్టిఫిషియల్ ఇన్ఫాంట్ మిల్స్ (ఇన్ఫామిల్) దిగుమతి చేసుకోవాలని భారత్ను అమెరికా తీవ్రస్థాయిలో ఒత్తిడి చేస్తోందని, ఇలాంటి జోక్యాలతో భారత వాణిజ్య సార్వభౌమత్వానికి, ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) సిద్ధాంతాలకు విఘాతం కలుగుతుందని నొక్కిచెప్పారు. రిఫైనింగ్ ద్వారా వచ్చే లాభాలతో దేశ పౌరులకు ప్రయోజనం ఉండేలా ప్రధాని మోదీ చర్యలు తీసుకోవాలని నారాయణ డిమాండ్ చేశారు. వచ్చే లాభాలను ప్రజలతో పంచుకోవాలన్నారు. భారత్ తన సార్వభౌమ హక్కులను పరిరక్షించుకుంటూ... అమెరికా కపట విధానాన్ని తిప్పికొట్టాలని నారాయణ పిలుపునిచ్చారు.

# 11న ఇండియా మార్చ్

(మొదటి పేజీ తరువాయి)

ఈసీ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించాలని ఇండియా ఐక్య సంఘటన నిర్ణయించినట్లు రాజా వెల్లడించారు. లోక్సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నివాసంలో 'ఇండియా' నాయ కుల భేటీలో కీలక అంశాలపై నిశితంగా చర్చించినట్లు తెలిపారు. ఎన్నికల సంఘం పని తీరుపై అనుమానాల దృష్ట్యా రాహుల్ ప్రజెంటేషన్ ఇచ్చారని, ఆరు నెలల విచారణలో వెల్లడైన వివరాలను ఇండియా నాయకులకు వివరించారని చెప్పారు. ప్రాథమిక హక్కుగా ఉన్న ఓటు హక్కు పరిరక్షణకు, దాని తొలగింపు చర్యలకు వ్యతిరేకంగా ఇండియా ఐక్య సంఘటన ఒకే మాటపై ఉందని, కలిసి కట్టుగా ఉమ్మడి కార్యాచరణతో ముందు కెళుతున్నదని రాజా అన్నారు.

# సుంకాలపై మౌనమెందుకు?

(మొదటి పేజీ తరువాయి)

సిపిఐ(ఎంఎల్) ఎంపిలు సిపిఎం, సిపిఐ(ఎంఎల్) ఎంపిలు మార కె.రాధాకష్ణన్, జాన్ బ్రిట్టాస్, ఏఏ రహీం, ఆర్. సచ్చితానందం, సుధామ ప్రసాద్, రాజా రామ్తో కలిసి శుక్రవారం ఖండించారు. పార్లమెంటు ఎదుట నిరసన తెలిపారు. భారత సార్వభౌమతం, స్వయంప్రతిపత్తిపై రాజీ వద్దని కేంద్రానికి హితవు పలికారు. ట్రంప్గానీ ఇతర ఏ శక్తిగానీ దేశ సార్వభౌమత్వానికి సంబంధించిన వ్యవహారాల్లో జోక్యం చేసుకొనే హక్కును కలిగివుండరని ఎంపీలు అన్నారు. భారత్ను బాహ్య ఒత్తిళ్లకు తలొగ్గనివ్వబోమని స్పష్టం చేశారు. చత్తీస్గఢ్, ఒడిశాలో హిందూత్వ మూకలు రెచ్చిపోతుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కులం పేరిట దూషణలు, దాడులను ఆపాలని వామపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు.

# వ్యవస్థల ప్రక్షాళన

(మొదటి పేజీ తరువాయి)

సిద్ధం చేయాలని సిఎం ఆదేశించారు.

ఢిల్లీ నుంచి శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్కు చేరుకున్న ముఖ్యమంత్రి గురువారం రాత్రి హైదరాబాద్లో కురిసిన వర్షం, తలెత్తిన ఇబ్బందులు, అధిగమించేందుకు అనుసరించాల్సిన తక్షణ చర్యలపై అధికారులతో శుక్రవారం అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అన్ని విభాగాల అధికారుల అభిప్రాయాలను తీసుకున్నారు. వరద నీటి ప్రవాహనికి ఉన్న అడ్డంకులను అధిగమించటంతో పాటు భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే అభివృద్ధికి వీలుగా పనులు చేపట్టాలని, వర్షాలతో నగరం అతలాకుతలం కాకుండా ఉండేందుకు, జనజీవనం అస్తవ్యస్తం కాకుండా ఉండాలంటే, అత్యవసరంగానే శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరముందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. భారీ వర్షం ఒకేసారి కురవటంతో విపత్కర పరిస్థితులు తలెత్తుతున్నాయని, తక్కువ వ్యవధిలో ఎక్కువ వర్షం పడటంతో జనజీవనం అస్తవ్యస్తమవుతోందని, సాధారణంగా మూడు నాలుగు నెలల్లో కురిసే వర్షపాతం మొత్తం ఒకే రోజున కుమ్మరించటంతో నగరం అతలాకుతలమవుతోందని ఈ సమావేశంలో చర్చకు వచ్చింది. వాతావరణ మార్పులే అందుకు ప్రధాన కారణమని, అందుకు తగినట్లుగా నగరంలో అన్ని వ్యవస్థలను ఆధునీకరించాల్సిన అవసరముందని సిఎం అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ లో ప్రస్తుతం ఉన్న రోడ్లు, డ్రైనేజీలు అయిదు సెంటీమీటర్ల వర్షం పడితే తట్టుకునే పరిస్థితి లేదని, ఒక్కో సారి 20 సెంటీమీటర్ల వర్షం నమోదవుతోందన్నారు. హైదరాబాద్లో గురువారం రాత్రి కేవలం నాలుగు గంటల వ్యవధిలోనే కొన్ని ప్రాంతాల్లో 15 సెంటీమీటర్ల వర్షపాతం కురిసిందని, జూన్ నుంచి ఇప్పటివరకు జీహెచ్ఎంసి పరిధిలో సాధారణంతో పోలిస్తే 16 శాతం వర్షపాతం ఎక్కువగా నమోదైందని, అందుకే వాతావరణ మార్పులు, భారీ వర్షాలతో తలెత్తే ఈ విపత్కర పరిస్థితులను అధిగమించేందుకు విపత్తుల నివారణ నిర్వహణ ప్రణాళిక సమర్థవంతంగా అనుసరించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్లో 55 కిలోమీటర్ల పొడవునా మూసీని పునరుద్ధరించటం ద్వారా పరివాహక ప్రాంతంతో పాటు నగరంలో ఉన్న అన్ని ప్రాంతాలు, కాలనీలన్నీ సురక్షితంగా ఉంటాయని, లోతట్టు ప్రాంతాలు వరద ముంపునకు గురికాకుండా ఉంటాయని అన్నారు.

**వీలైనంత త్వరగా చెరువుల పునరుద్ధరణ, నాలాల విస్తరణ**

వరదనీటి ప్రవాహానికి అడ్డంకులు ఉన్నందునే హైదరాబాద్ నగరంలో ఈ దుస్థితి తలెత్తుతోందని అధికారులు అభిప్రాయపడ్డారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్లోని వరదనీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా నగరంలోని అన్ని వైపుల నుంచి వరద నీరు మూసీకి చేరేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. నగరంలో ఉన్న హుస్సేన్ సాగర్, దుర్గం చెరువు, మీర్ అలం చెరువులతో పాటు ప్రతీ చెరువు, కుంటలను నాలాల ద్వారా మూసీకి అనుసంధానం చేయాలని సూచించారు. చెరువుల పునరుద్ధరణ, నాలాలను వెడల్పు ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సిఎం ఆదేశించారు. డ్రైనేజీల ద్వారా వచ్చే నీటిని ఎస్టిపి (సీవరేజీ ట్రీట్మెంట్ ప్లాంట్ల) ద్వారా శుద్ధి చేసి మూసీలో స్వచ్ఛమైన నీటి ప్రవాహం ఉండేందుకు వీలుగా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. నగరంలో ఎక్కడ వర్షం పడినా నీరు చెరువుల్లోకి, నాలాల్లోకి, అటు నుంచి మూసీలోకి చేరేలా అనుసంధానం జరగాలన్నారు.

**మూసీలో నీటిశుద్ధికి శాశ్వత ప్రణాళికలు**

మూసీలో స్వచ్ఛమైన నీటి ప్రవాహంతో హైదరాబాద్లో నీటి కష్టాలు తీరుతాయని సిఎం అన్నారు. కలుషితమైన నీటితో మూసీ పరివాహక ప్రాంతంలో రైతులు పంటలు పండిస్తున్నారని, ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ఇకపై ఈ పరిస్థితి తలెత్తకుండా మూసీలో నిరంతరం శుద్ధి చేసిన నీటి ప్రవాహం ఉండేలా శాశ్వత ప్రణాళికలు ఉండాలని సిఎం సూచించారు. శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలు, ఇతర అవసరాలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా వినియోగించుకునే వీలుంటుందని అన్నారు. భవిష్యత్లో వందేళ్ల పాటు మహానగరంలో వరద నీటి సమస్య పునరావృతం కాకుండా ఉండాలంటే మూసీ పునరుజ్జీవనమే అవసరమని అభిప్రాయపడ్డారు. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును వరద నీటి నిర్వహణకు వీలుగా డిజైన్ చేయాలని, ఆ దిశగా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**ట్రాఫిక్ పరిష్కారానికి ప్రణాళికలు**

హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వర్షాలు, వరదల సమయంలో ట్రాఫిక్ సమస్య తీవ్రత మరింత పెరుగుతుండటంతో శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పాతనగరంలో ఈ సమస్యను పరిష్కరించేందుకు పెడెస్ట్రియల్ జోన్ ను ఏర్పాటు చేసి, పార్కింగ్ సమస్యకు చెక్ పెట్టాలని సిఎం సూచించారు. చార్మినార్, సాలార్ జంగ్ మ్యూజియం, హైకోర్టు, ఉస్మానియా ఆసుపత్రి ప్రాంతాల్లో మల్టీ లెవెల్ పార్కింగ్ జోన్లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. మల్టీ లెవెల్ పార్కింగ్ జోన్ల ఏర్పాటుతో రోడ్లపై వాహనాల రద్దీని తగ్గించడంతో పాటు పార్కింగ్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సిఎం సెక్రటరీ మాణిక్ రాజ్, హెచ్ఎండిఏ పరిధిలోని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ కార్యదర్శి ఇలంబర్తి, ఎంఆర్డీసీఎల్ ఎండి ఈవీ నర్సింహారెడ్డి, జెఎండి గౌతమి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## సైబర్ క్రైమ్ నేరాలపై ముగిసిన శిక్షణ



ప్రజాపక్షం/హైదరాబాద్:సైబర్ క్రైమ్ నేరాలు, చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లోయిటేషన్ అండ్ అబ్యూస్ మెటీరియల్ (సిఎస్ఇఎఎం) కేసులను దర్యాప్తు చేసే 151 మంది అధికారులకు బంజారాహిల్స్‌లోని ఐసిసిసి భవనంలోని సైబర్ అకాడమీలో వారంరోజుల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి), ఇండియన్ చైల్డ్ ప్రొటెక్షన్ (ఐసిపి) సంయుక్తంగా ఆగస్టు 1 నుంచి 7 వరకు ఈ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇప్పటివరకు తెలంగాణ పోలీస్‌లు 510 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. మొత్తం 26 పోలీస్ యూనిట్లకు చెందిన 151దర్యాప్తు అధికారులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. శిక్షణ సమయంలో, వారు 204 సైబర్ టిప్లైన్ ఫైళ్ళను సమీక్షించి, కేసుల నిర్వహణపై పరిజ్ఞానాన్ని అందించారు. శిక్షణలో పోస్కో, ఐటి చట్టం, బిఎన్ఎస్, బిఎన్ఎస్ఎస్ సంబంధిత న్యాయ పూర్వపరాలు ఉన్నాయి. ఘటనా స్థలంలో సెర్చ్, సీజ్ పద్ధతులు, డివైస్ స్వాధీనం, కంటెంట్ కాపీ, డిజిటల్ ఆధారాల నిర్వహణపై ఉత్తమ పద్ధతులపై ఇందులో తెలియజేశారు.

### వరద ముంపు నివారణకు

# మల్కం చెరువుకు తూము గేట్లు ఏర్పాటు

హైడ్రా కమిషనర్
ఎవి. రంగనాథ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : మల్కం చెరువు వరద ముంపు తప్పించేందుకు తూము గేట్లు నిర్మించాలని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గచ్చిబౌలి ప్రాంతంలో భారీ వర్షాల కారణంగా మల్కం చెరువు పరిసరాల్లో వరద పోటెత్తడానికి గల కారణాలను రంగనాథ్ శుక్రవారం ఉదయం క్షేత్ర స్థాయిలో పర్యటించి, పరిశీలించారు. వరద ముంచెత్తడానికి, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటానికి ప్రధాన కారణం చెరువులోకి భారీగా నీరు వస్తున్నప్పటికీ, బయటకు వెళ్లే మార్గాలు లేకపోవడమేనని అధికారులు ఆయనకు తెలిపారు. ప్రస్తుతం అలుగు ద్వారా మాత్రమే నీరు బయటకు వెళ్తోందని, తూము గేట్లను ఏర్పాటు చేస్తే వర్షాకాలంలో నీటి మట్టాన్ని నియంత్రించవచ్చని అధికారులు సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే ఈ పనులు చేపట్టాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. చెరువు పరిసరాల్లో రహదారులతో పాటు నివాసాలు కూడా మునిగిపోతున్నందున ఈ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. బయోడైవర్సిటీ పార్కు, షేక్‌పేట ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరంతా మల్కం చెరువులోకి చేరేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ పర్యటనలో సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి, అదనపు పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్ జాయింట్) గజరావు భూపాల్, హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య పాల్గొన్నారు.

**ముంపు ప్రాంతాల్లో నిరంతర సహాయక చర్యలు**

గురువారం సాయంత్రం కురిసిన 15 సెంటీమీటర్ల వర్షపాతానికి గచ్చిబౌలి ప్రాంతం అతలాకుతలమైంది. షేక్‌పేట వంతెన వద్ద నడుము లోతు నీరు నిలిచిపోయింది. ఉస్మానియా కాలనీలోని కొన్ని ప్రాంతాల్లోకి కూడా వరద నీరు చేరింది. సమాచారం అందుకున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్ హుటాహుటిన అక్కడకు చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. అర్ధరాత్రి 12:30 గంటల వరకు వరద నీటిని తొలగించడంతో పాటు, ట్రాఫిక్ క్లియర్ అయ్యేలా చర్యలు తీసుకున్నారు. హైడ్రా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డిఆర్ఎఫ్), వర్షాకాల అత్యవసర బృందాలు రాత్రికి రాత్రే మొత్తం 78 ఫిర్యాదులను పరిష్కరించాయి. అందులో 41 చోట్ల పడిపోయిన చెట్లను తొలగించగా, 36 చోట్ల నిలిచి పోయిన వరద నీటిని తొలగించారు. బంజారాహిల్స్‌లోని ఎస్‌బిఐ ఎగ్జిక్యూటివ్ ఎన్‌క్లేవ్ సమీపంలో వరదలో చిక్కుకున్న ఒక మహిళను కాపాడారు.

### ఎన్‌జిఆర్ఐ ఆధ్వర్యంలో

# ఎస్ఎల్‌బిసి ప్రాజెక్ట్ పునరుద్ధరణ పనులు

నీటిపారుదల శాఖ మంత్రి
కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి




ప్రజాపక్షం/హైదరాబాద్:ఎస్.ఎల్.బి.సి ప్రాజెక్ట్ పునరుద్ధరణ పనులను ప్రణాళికా బద్ధంగా నిర్వహించేందుకు నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(ఎన్‌జిఆర్ఐ) ఆధ్వర్యంలో హెలికాప్టర్ ద్వారా ఎలక్ట్రో మేఘ్నటిక్ సర్వేను నిర్వహిస్తున్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఎస్. ఎల్.బి.సి టన్నెల్ ప్రమాదం అనంతరం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ నివేదికను, ఆ కమిటీ సూచనలను అనుసరించి పునరుద్ధరణ ప్రక్రియను మొదలు పెట్ట బోతున్నామన్నా రు. ఎస్ఎల్‌బిసి ప్రాజెక్ట్‌కు అవసరమైన నిధులను సమకూర్చుకోవడంతో పాటు పాలనా పరమైన అనుమతులను పొందేందుకు త్వరలోనే సిఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తో సమావేశం కానున్నట్లు వివరించారు. ప్రస్తుత వర్షాకాలంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డ్యామ్‌లు, రిజర్వాయర్లతో పాటు ఇతర జలాశయాలను నిత్యం పర్యవేక్షించాలని, ప్రమా దం ఉన్న ప్రాంతాలకు చెందిన అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఉత్తమ్ ఆదేశించారు.

హైదరాబాద్‌లోని సచివాలయంలో శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై మంత్రి చర్చించా రు. ఈ సమావేశంలో నీటి పారుదల శాఖ రాష్ట్ర సలహాదారుడు ఆదిత్యాదాస్‌నాథ్,ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్,ఇఎన్‌సిలు అంజద్ హుస్సేన్, రమేష్ బాబు,ఆర్,ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు,సి.ఇ అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ శ్రీశైలం దిగువ బాగాం నుంచి వచ్చే వరద కాలువ మిగిలిన 9 కిలోమీటర్ల టన్నెల్ తవ్వకానికి ఆటంకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా ఆ నీటిని ఎత్తిపోసేందు ప్రతి సంవత్సరం కేవలం విద్యుత్ చార్జీలకే రూ.750 కోట్లను చెల్లించాల్సి వస్తుందన్నారు.

అత్యంత వెనుకబడిన ప్రాంతాలకు సాగు నీరు, ఫ్లోరోసిస్ రహిత సాగు నీటిని అందించే ఉద్దేశంతో చేపట్టిన ఎస్ఎల్‌బిసి ప్రాజెక్ట్‌ను మరో తొమ్మిది కిలోమీటర్లు సొరంగ మార్గం పూర్తయ్యే సమయంలో ప్రమాదం జరగడం దురదృష్టకర మన్నారు. ఈ ప్రాజెక్ట్ పర్వత భూభాగంలో ఉన్నందున హెలిక్యాప్టర్ సర్వే తప్పనసరిగా మారిందని, పునరుద్ధరణ పనుల ప్రారంభానికి ఈ సర్వే దోహద పడుతుందని ఉత్తమ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందులో జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జిఎస్ఐ)ని కుడా భాగస్వామ్యం చేస్తామన్నారు. పునరుద్ధరణ పనులు ప్రణాళికా బద్ధంగా నిర్వహించేందుకు లిడార్ సర్వేను కుడా నిర్వహించ బోతున్నామని, అదే సమయంలో అంచనా వ్యయం మించకుండా, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూనే పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. సింగూర్ డ్యామ్‌ను పరిశీలించి అత్యవసర భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**సమ్మక్క సారక్క బ్యారేజ్ పై ఐఐటి ఖరగ్ పూర్ నివేదిక**

సమ్మక్క బ్యారేజ్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టుల బ్యాక్ వాటర్ తో ఛత్తీస్ ఘడ్ పై చూపే ప్రభావాలపైన ఐ ఐ టి ఖరగ్ పూర్ జరిపిన అధ్యయనం నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి చేరిందని ఉత్తమ్ కుమార్ అన్నారు. ములుగు జిల్లా ఏటూరునాగరం మండలంలోని తుపాకులగూడెం గ్రామ సమీపంలో నిర్మిస్తున్న సమ్మక్క బ్యారేజ్ నిర్మాణంతో ఛత్తీస్ ఘడ్‌లో సుమారు 40 హెక్టార్లు (కోటూర్, తార్లగూ డ, గంగారాం, కంబల్పేట లతో 10.9చ.కి.మీ భూభాగం) ముంపునకు గురవుతుందని ఐఐటి ఖరగ్ పూర్ నివేదిక స్పష్టం చేసిందని వివరించా రు. అందుకే బ్యారేజ్‌ను పూర్తి చేసేందుకు ఛత్తీస్ ఘడ్ ప్రభుత్వాన్ని సంప్రదించి, అందుకు అవసరమైన అనుమతులు తీసుకుంటామన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 6.94టిఎంసిల నీటితో 16.40 ఎకరాలకు సాగు నీరు అందుతుందని వివరించారు. 2017లో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్ నిర్మా ణం 2022లో పూర్తి కావల్సి ఉండగా, వివిధ కారణాలతోపనులలో జాప్యం జరిగిందని వివరించారు.

**మూడు దశాబ్దాల తరువాత నీటిపారుదల శాఖలో పదోన్నతులు**

మూడు దశాబ్దాల తర్వాత నీటి పారుదల శాఖలో పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేశామని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఎయి.యి ల నుండి సి.ఇల వరకు 47 మంది అసిస్టెంట్ ఇంజినీర్ల నుండి డిప్యూటీ ఇంజినీర్ల వరకు 127 మంది, ఎస్.ఇల నుండి సి.ఇల వరకు 13 మంది ఉన్నారని వివరించారు. అన్ని విభాగాల సిబ్బందికి 33 సంవత్సరాల తరువాత స్కెల్ తో పాటు పదోన్నతులను క్రమబద్దీకరించామని వివరించారు. ప్రతిభ, సీనియారిటీలను ప్రాతిపదికను పరిగణలోకి తీసుకున్నామన్నారు.

పెండింగ్‌లో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేసేందకు అందరూ నిమగ్నం కావాలని ఆదేశించారు.

## త్వరలో టివివిపి అప్‌గ్రేడ్

### మంత్రి దామోదర్ రాజనర్సింహా




ప్రజాపక్షం/హైదరాబాద్:తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను (టివివిపి) 'డెరెక్టర్ సెకండరీ హెల్త్'గా త్వరలోనే అప్‌గ్రేడ్ చేస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా తెలిపారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ లో 1690 డాక్టర్ పోస్టుల భర్తీకి సానుకూలంగా స్పందించిన మంత్రి దామోదర్ రాజనర్సింహా, డాక్టర్ల పోస్టుల భర్తీకి 'తెలంగాణ మెడికల్ బోర్డు' త్వరగా విధి విధానాలను రూపొందించాలని ఆదేశించారు. డాక్టర్ల ఉద్యోగాల భర్తీలో వయో పరిమితి పెంపు విషయంలో నిబంధనలు రూపొందించేందుకు కమిటీని నియమిస్తా మన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్ల అసోసియేషన్ (టిజిజిడిఎ) అధ్యక్షులు డాక్టర్ నరహరి, సెక్రెటరి జనరల్ డాక్టర్ లాలు ప్రసాద్, డాక్టర్ రాహుఫ్, డాక్టర్ వినయ్ కుమార్, డాక్టర్ గోపాల్, డాక్టర్ క్రాంతి, డాక్టర్ అశోక్, డాక్టర్ రామ్‌సింగ్ తదితరు లు మంత్రి దామోదర రాజనర్సింహాతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ల సమస్యలపై అసోసియేషన్ ప్రతినిధులు చేసిన విజ్ఞప్తిపైన మంత్రి దామోదర్ రాజనర్సింహా సానుకూలంగా స్పందించారు. అసోసియేట్ ప్రొఫెసర్ల నుండి ప్రొఫెసర్స్‌గా పదోన్నతులు కల్పించినందుకు ప్రతినిధి బృందం మంత్రి దామోదర్ రాజనర్సింహాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ టివివిపిలో క్యాడర్ స్ట్రెంత్ పెంపు విషయమై కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్‌తో చర్చించారు.




## 'రిటైల్ జ్యువెలర్ ఇండియా అవార్డ్స్ - 2025'లో కీర్తిలాల్స్‌కు ప్రతిష్ఠాత్మక పురస్కారం

ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రముఖ వజ్రా భరణాల సంస్థ కీర్తిలాల్స్‌కు 'రిటైల్ జ్యువెలర్ ఇండియా అవార్డ్స్ 2025'లో ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. ఈ సంస్థకు 'సంవత్సరపు సహజ వజ్ర చెవిపోగులు (నేచురల్ డైమండ్ ఇయర్ రింగ్స్ ఆఫ్ ది ఇయర్)' విభాగంలో ఈ అవార్డు దక్కింది. అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో అతిథులైన ప్రమోద్ మెహతా, పులికిట్ మెహతా చేతుల మీదు గా కీర్తిలాల్స్ బిజినెస్ స్ట్రాటజీ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సూర జ్ శాంతకుమార్ మాట్లాడుతూ జ్యువెలరీ రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డు లభించడం తమకు ప్రత్యేక గౌరవమని తెలిపారు. భారతదేశంలో ప్రధా న ఆభరణాల బ్రాండ్‌గా కీర్తిలాల్స్ కు లభించిన ఈ గుర్తింపు తమ హస్తకళ, ఆవిష్కరణల పట్ల తమకున్న నిబద్ధతకు నిదర్శనమని ఆయన అన్నా రు. ఈ అవార్డు తమ బృందం సమిష్టికృషి, దూరదృష్టికి నిలువుటద్దమన్నారు. కస్టమర్లు ఇష్టపడే, విశ్వసించే సున్నితమైన ఆభరణాలను సృష్టించడం కొనసాగిస్తామని తెలిపారు.

ఈ అవార్డుల కార్యక్రమంలో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన ఆభరణాల పరిశ్రామిక వేత్తలు, డిజైనర్లు, చేతివృత్తులవారు పాల్గొన్నారు.



## 1.904కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాపక్షం/హైదరాబాద్:ఈజీ మనీ వేటలో చాల మంది పక్కదారులు తొక్కుతారు. నిషేధిత మత్తు పదార్థాలు అమ్మడం, వినియోగించడం నేరమని తెలిసినా.. అక్రమార్కులు తప్పుడు మార్గంలో వెళ్లి ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ టీమ్‌లకు పట్టుబడుతారు.ఇలాంటి తప్పిదామే దూల్‌పేట్ హెచ్ టి ఎఫ్ , ఎక్సైజ్ సిబ్బంది కలిసి కేసు నమోదు చేశారు.వివరాల్లోకి వెళితే.. కర్వాన్ నుంచి రహీమ్‌పుర ప్రాంతం లో ఎస్‌టిఎఫ్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో ధబూన్‌రాజ్ సింగ్ అలియాస్ ధబూన్‌రాజ్ అనే వ్యక్తి గంజాయి అమ్మకాలు సాగిస్తు ఉండగా పట్టుకున్నారు. నిందితుడి వద్ద ఉన్న 1.904 కేజీల గంజాయితో పాటు, గంజాయి అమ్మకాలు సాగించిన రూ. 1.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ధన్‌రాజ్ సింగ్‌ను అరెస్టు చేశారు. గంజాయి అమ్మకాలతో సంబంధం ఉన్న బ స్సీ కావల్ సింగ్, కొమల్, ఉత్తరేష్ అలపతి అనే వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ టి ఎఫ్ ఏ టీమ్ లీడర్ అంజి రెడ్డి తెలిపారు.

**బాలజీనగర్‌లో 1.1 కేజీల గంజాయి స్వాధీనం...**

సైఫాబాద్ బాలాజీనగర్ సమీపంలో ఎస్‌టిఎఫ్ సీ టీమ్ సిఐ వెంకటేశ్వర్లు సిబ్బంది నిర్వహించిన దాడుల్లో 1.1 కేజీల గంజాయి పట్టు బడింది .ఈ కేసులో షేక్ ఖాజా పాషా(31)ను అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు.

# ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు వేగవంతం

జిహెచ్ఎంసి కమిషనర్
ఆర్‌వి. కర్ణన్



ప్రజాపక్షం/హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో, వర్షానంతర చర్యలను వేగవంతం చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోయినుద్దీన్‌తో కలిసి శుక్రవారం నగరంలోని వర్ష ప్రభావిత ప్రాంతాలలో పర్యటించారు. కమిషనర్ కర్ణన్ టోలిచౌకి ఎక్స్ రోడ్ హకీంపేట్ కెజిఎన్ నల్లా, మోతీ దర్వాజా, అహ్మద్ కాలనీ, లంగర్‌హౌస్ హుడా చెరువు ప్రాంతాల్లో వర్షం వల్ల ఏర్పడిన పరిస్థితులను పరిశీలించారు. అనంతరం అదన పు పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్ జాయింట్) గజరావ్ భూపాల్‌తో కలిసి మల్కం చెరువును పరిశీలించి, నీటి మట్టాలు, ట్రాఫిక్ పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భం గా, జిహెచ్ఎంసి క్షేత్ర అధికారులు, సిబ్బంది ఇరిగేషన్, ట్రాఫిక్ పోలీసులు, హైడ్రా, జలమండలి, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డిఆర్ఎఫ్) బృందాలతో కలిసి సమన్వయంగా పనిచేయాలని కమిషనర్ సూచించారు. వర్షం నీటిని తొలగించడం, సిల్ట్, చెత్తను శుభ్రం చేయడం, రోడ్ల మరమ్మతులు వంటి చర్య లు తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు. వర్షపు నీరు నిలిచిన ప్రాంతాల్లోకి వెళ్లవద్దని, ప్రత్యామ్నాయ మార్గాల ను ఉపయోగించుకోవాలని కమిషనర్ ప్రజలకు సూచించారు. ఏమైనా సమస్యలు ఎదురైతే వెంట నే జిహెచ్ఎంసి హెల్ప్‌లైన్ నెంబర్ 040 21111111కు తెలియ జేయాలని కోరారు.

**కంట్రోల్ రూమ్ ఆకస్మిక తనిఖీ..**

జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌ను కమిషనర్ కర్ణన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్షాల వల్ల ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై ఓఎస్‌డి అనురాధను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించడంతో పా టు, క్షేత్ర స్థాయి బృందాలకు సమాచారం అందించి, రియల్ టైమ్ పర్యవేక్షణ ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని ఆదేశించారు.



ప్రజలకు ఇబ్బందు లు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో ఈ.ఈ. లాల్ సింగ్, డిప్యూటి కమిషనర్ సైఫుల్లా, ఏఎంఓహెచ్ ఇర్షాద్ ఇక్బాల్ పాల్గొన్నారు.




## దేశంలోని సురక్షిత 10 నగరాల్లో హైదరాబాద్‌కు దక్కని స్థానం

### అత్యంత సురక్షిత నగరంగా మంగళూరు

ప్రజాపక్షం/హైదరాబాద్:ప్రపంచవ్యాప్తంగా ఉన్న సురక్షిత దేశాలు, నగరాలు2025 జాబితాను నంబియో సేఫ్టీ ఇండెక్స్ విడుదల చేసింది. అందులో భారత్ కు చెందిన 10 నగరాలు కూడా ఉన్నాయి. భారత్ కు చెందిన సురక్షిత నగరాల్లో మంగళూరు తొలి స్థానంలో నిలిచింది. అట్టడుగు స్థానాన్ని ఢిల్లీ నగరం దక్కించుకుంది. గుజరాత్ లోని వడోదర, అహ్మదాబాద్, సూరత్ నగరాలు కూడా జాబితాలో స్థానం సంపాదించుకున్నాయి. టాప్ 10 జాబితాలో హైదరాబాద్ కు చోటు దక్కకపోవడం గమనార్హం. ప్రపంచంలోని అత్యంత సురక్షితమైన దేశాల జాబితాలో ఇండియా 67వ స్థానంలో నిలిచింది. ఈ ర్యాంకింగ్స్ లో ఇండియా 55.8 స్కోరును సాధించింది.

**నంబియో సేఫ్టీ ఇండెక్స్ ప్రకారం భారత్‌లోని టాప్ 10 నగరాలు:**

| సిటీ | ఇండియా ర్యాంక్ | ప్రపంచ ర్యాంక్ |
|---|---|---|
| మంగళూరు | 1 | 49 |
| వడోదర | 2 | 85 |
| అహ్మదాబాద్ | 3 | 93 |
| సూరత్ | 4 | 106 |
| జైపూర్ | 5 | 118 |
| నవీ ముంబై | 6 | 128 |
| తిరువనంతపురం | 7 | 149 |
| చెన్నై | 8 | 158 |
| పూణె | 9 | 167 |
| చండీగఢ్ | 10 | 175 |

### క్రీడా స్కూల్స్, అకాడమీలు..

## పతకాలు సాధించే కర్మాగారాలుగా మారాలి

క్రీడలపై సమీక్షా సమావేశంలో
మంత్రి వాకిటి శ్రీహరి



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలలు, అకాడమీలు పతకాలు సాధించే కర్మాగారాలుగా మారాలని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అధికారులను ఆదేశించారు. ఎల్‌బిస్టేడియంలో స్పోర్ట్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి తో కలిసి ఆయన రాష్ట్రంలోని స్పోర్ట్స్ స్కూళ్లు, అకాడమీల పనితీరు, సవాళ్లు, భవిష్యత్ ప్రణాళికపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీహరి మాట్లాడుతూ, 2025–26 విద్యా సంవత్సరానికి పారదర్శకం గా, ప్రతిభ ఆధారంగా విద్యార్థుల ఎంపిక జరగాలనిహకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌తో పాటు కరీంనగర్, ఆదిలాబాద్ స్కూళ్లలో ఆధునిక క్రీడా శిక్షణ, విద్యలో మెరుగుదల సాధించాలని అధికారులకు సూచించారు.హకీంపేట్‌లో తక్షణ మరమ్మతులు, అన్ని స్కూళ్లలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. స్పోర్ట్స్ అథారిటీ అకాడమీల పనితీరు మెరుగుపరిచి విద్యార్థి క్రీడాకారుల్లో స్ఫూర్తిని కలిగించే కార్యక్రమం నిర్వహించాలని కోరారు. స్పోర్ట్స్ స్కూల్లో అకాడమీ లలో త్రైమాసికంగా బ్యాటరీ టెస్టులు నిర్వహించి , కంప్యూటరైజ్డ్ రిపోర్టులు తయారుచేసి విద్యార్థుల తల్లిదండ్రులకు పంపించే విధంగా ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను కోరారు. ప్రతిభ ఆధారంగా విద్యార్థుల వర్గీకరణ (ఎఎఫ్) చేసి క్రీడా ప్రతిభ లేని వారిని ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లకు బదిలీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. స్పోర్ట్స్ స్కూల్లో పనిచేసే అధికారులు సిబ్బంది కోర్సులు అందరూ విద్యార్థుల సంక్షేమం కోసం తమ పిల్లలుగా చూసుకోవాలని వారికి ఇబ్బందులు రాకుండా వారి యోగక్షేమాలు చూడాల్సిన బాధ్యత తీసుకోవాలని కోరారు.

ప్రేరణాత్మక తరగతులు, వ్యక్తిత్వ వికాస అంశాల్లో శిక్షణ యోగ శిక్షణ తప్పనిసరి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. తెలంగాణ విద్యార్థిని విద్యార్థులు సాధించిన విజయాలను ప్రదర్శించేందుకు ప్రతి స్పోర్ట్స్ స్కూల్ అకాడమీల్లో విద్యార్థుల తల్లిదండ్రుల కొరకు విజిటర్స్ హాల్స్ ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. ఎల్‌బి స్టేడియంలో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నిర్మాణం చేసి అన్ని అకాడమీలను స్పోర్ట్స్ స్కూల్ లలో ఏర్పాటు చేసే సిసి కెమెరాలను ఈ కాన్ఫరెన్స్ వాళ్లకు అనుసంధించాలని తెలిపారు.

క్రమం తప్పకుండా క్రీడా శాఖలోని అన్ని విభాగాలపై నిరంతరం సమీక్షలు చేస్తామని తెలిపారు. స్పోర్ట్స్ స్కూల్లో అకాడమీల పనితీరు మెరుగు పరచడమే కాకుండా అన్ని అంశాలపై దృష్టి సారించి ఎప్పటికప్పుడు అందరి అభిప్రాయాలు తీసుకుంటూ సమగ్ర క్రీడాభివృద్ధి కోసం కృషి చేస్తామని ఆయన తెలిపారు. విధుల్లో అలసత్వం వహించే ఎవరిని కూడా ఉపేక్షించమని మంత్రి శ్రీహరి తెలిపారు.

సమీక్ష సమావేశంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె. శివసేన రెడ్డి, తో పాటు హకింపేట స్పోర్ట్స్ స్కూల్ ప్రత్యేక అధికారి టి. మమత, డిప్యూటీ డైరెక్టర్లు జి చంద్ర రెడ్డి జి. రవీందర్, డా. రవి శంకర్ పల్లెల, ఎస్.ఎం. బాషా, జి. అశోక్ కుమార్, పి. సందీప్ కుమార్, సురేష్ కాలేరు పాల్గొన్నారు.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

NIT No. 24, పని పేరు: జిహెచ్ఎంసి, రాజేంద్రనగర్ సర్కిల్-11లో 01 పని కొరకు రాజేంద్రనగర్‌లోని జలాల్‌బాబానగర్ (అటవీ ప్రాంతం) లోని ఇ.నెం. 4-10-44/A/5 నుండి మసీదు-ఇ-అక్సా వరకు సిసి రోడ్డు వేయడం లేదు. **అంచనా వ్యయం/ ఇసివి:** రూ.22.60 లక్షలు, **డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది & సమయం:** 11.08.2025న మ.2.30గం.ల నుండి, **బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 20.08.2025న మ.2.45గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్ డివిజన్ నెం.11, జిహెచ్ఎంసి. సెల్: 9989930608. ఇ-మెయిల్ ఐడి: eec11.ghmc2@gmail.com

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-XI, (ఆర్‌జెఎన్‌ఆర్), జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 6248-PP/CL/ADVT/1/2025-26, Date: 08-08-2025

**హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ**
చీఫ్ ఇంజనీర్ కార్యాలయం, ఈస్ట్ వింగ్, 7వ అంతస్తు,
స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్-500038

NIT No. HMDA/DEV/CE/18/2025-26 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన తేది: 02.08.2025

ఈ క్రింది పనుల కోసం చెల్లుబాటు అయ్యే రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు ఆహ్వానించబడ్డాయి:

| క్ర. సం. | పని పేరు | టెండర్లను ఆహ్వానించే అధికారం | దాఖలుకు ఆఖరి తేది |
|---|---|---|---|
| 1. | రంగారెడ్డి జిల్లా, కందుకూర్ మండలం, లేమూర్ గ్రామం, సర్వే నెం.482లో ప్రతిపాదిత లేఅవుట్ పొడిగింపు కోసం మౌలిక సదుపాయాలను అందించడం. | చీఫ్ ఇంజనీర్, హెచ్ఎండిఎ | 28.08.2025 @ 03:00 PM |
| 2. | రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్ మండలం, పెద్ద అంబర్‌పేట్ గ్రామం, సదాశివ హెవెన్స్‌లో సెంట్రల్ పార్క్ పునరుద్ధరణ మరియు స్పోర్ట్స్ పార్క్, లేక్ వ్యూ పార్క్ మరియు కమ్యూనిటీ పార్క్ అభివృద్ధి. | | |
| 3. | రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 3వ బెటాలియన్ టిజిఎస్‌పి నుండి నాగన్‌పల్లి రోడ్డు వరకు బిటి రోడ్డు నిర్మాణం | సూపరింటెండింగ్ ఇంజనీర్-II, హెచ్ఎండిఎ | |

మరిన్ని వివరాల కోసం https://tender.telangana.gov.in ని సందర్శించండి.

సం/- చీఫ్ ఇంజనీర్, హెచ్ఎండిఎ.

DIPR R.O. No. : 6268-PP/CL/ADVT/1/2025-26, Date: 08-08-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## బండి సంజయ్ బహిరంగ క్షమాపణ చెప్పాలి : కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకుని, బహిరంగ క్షమాపణ చెప్పాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు డిమాండ్ చేశారు. బండి సంజయ్ చేసిన ఆరోపణల్లో ఒక్క శాతం వాస్తవమైనా నిరూపించాలని, లేదంటే తక్షణమే ఆ ఆరోపణలను ఉపసంహరించుకుని, క్షమాపణ చెప్పాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆరోపణలపైన తాను లీగల్ నోటీసు పంపిస్తున్నట్లు కెటిఆర్ తెలిపారు. అప్పటికీ బండి సంజయ్ స్పందించకపోతే 48 గంటల గడువు తర్వాత కోర్టుకు ఈడుస్తానని హెచ్చరించారు. కనీస విజ్ఞత కూడా లేకుండా, వాస్తవాలు తెలుసుకోకుండా, బండి సంజయ్ మాట్లాడారని మండిపడ్డారు. కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్‌కి నిఘా వ్యవస్థల పనితీరు, విధానాలపై కనీస అవగాహన, పరిజ్ఞానం, ఇంగిత జ్ఞానం కూడా లేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ అనే అంశం ఎంత సున్నితమైనదో, చట్టపరంగా ఎంత కఠినమైనదో బండి సంజయ్‌కి తెలవకుండానే కావాలనే వాస్తవాలను వక్రీకరిస్తూ, సాక్ష్యం లేకుండా ఆరోపణలు చేయడం ఆయన రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని తెలిపారు.

## నిండు కుండలా హుస్సేన్ సాగర్..

### 513 మీటర్లకు చేరిన నీటిమట్టం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గురువారం రాత్రి హైదరాబాద్ వ్యాప్తంగా వాన దంచికొట్టిన సంగతి తెలిసిందే. దీంతో హైదరాబాద్ నగరం నలు వైపులా వరద పోటెత్తింది. కూకట్‌పల్లి, ఖైరతాబాద్, బేగంపేట్ వైపు నుంచి వరద నీరు భారీగా హుస్సేన్ సాగర్‌కు వచ్చి చేరింది. దీంతో హుస్సేన్ సాగర్ నిండు కుండలా మారింది. హుస్సేన్ సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 514 మీటర్లు కాగా, శుక్రవారం ఉదయం 11 గంటలకు సాగర్ నీటిమట్టం 513.63 మీటర్లకు చేరుకుంది. ప్రస్తుతం హుస్సేన్ సాగర్‌కు 1234 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. ఔట్ ఫ్లో 1523 క్యూసెక్కులుగా ఉంది. ఈ క్రమంలో హుస్సేన్ సాగర్ దిగువ ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.



## కూలిన పాత ఇల్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారీ వర్షాలకు రామ్ నగర్ లోని శిథిలావస్థకు చేరిన పురాతన ఇల్లు కూలిపోయింది. రాంనగర్, రామాలయం వెనుకవైపు స్ట్రీట్, అడిక్ మెంట్ డివిజన్‌లో ఈ సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. అదృష్టవషత్తు అందులో ఎవరు నివాసం ఉండకపోవడంతో ప్రాణహాని తప్పింది. దీంతో అధికారులు, స్థానిక ప్రజలు ఊపిరిపిల్చుకున్నారు.

## ముమ్మరంగా రోడ్డు భద్రత చర్యలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రహదారి భద్రతను మెరుగుపరచడానికి జిహెచ్ఎంసి ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. వర్షాకాలంలో రోడ్లపై గుంతలు (పాట్ హోల్స్), క్యాచ్ పిట్స్, సెంట్రల్ మీడియన్‌ల వల్ల వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ఈ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు. ఈ డ్రైవ్‌లో భాగంగా ఇప్పటివరకు గుర్తించిన 11,642 రోడ్డు సమస్యలలో, 8,583 సమస్యలను పరిష్కరించినట్లు వెల్లడించారు. రోడ్లను సురక్షితంగా మార్చడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు కమిషనర్ స్పష్టం చేశారు. తాజాగా చేపట్టిన మరమ్మతులలో 423 క్యాచ్ పిట్స్, 225 క్యాచ్ పిట్ కవర్ల రీప్లేస్‌మెంట్, మూడు సెంట్రల్ మీడియన్‌లకు మరమ్మతులు చేశామని చీఫ్ ఇంజనీర్(నిర్వహణ) సహదేవ్ రత్నాకర్ వివరించారు. ప్రజలకు సురక్షితమైన ప్రయాణాన్ని కల్పించేందుకు ఈ ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుందని ఆయన తెలిపారు.



## హుడా పార్క్‌కు పూర్వ కళ

### నాడు దుర్గంధం.. నేడు ఆహ్లాదం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** లంగర్ హౌస్ లేక్, ఒకప్పుడు వ్యర్థాలు, దుర్గంధంతో నిండిపోయి ఉండగా, ఇప్పుడు ఆహ్లాదకరమైన వాతావరణంతో పూర్వ వైభవాన్ని సంతరించుకుంది. హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి ఈ లేక్‌ని దత్తత తీసుకోవడంతో ఈ మార్పు సాధ్యమైంది. ఒకప్పుడు ఈ ప్రాంతం చెత్తాచెదారంతో నిండిపోయి దుర్వాసన వెదజల్లేది. దీనిని గమనించిన మేయర్, ఈ సరస్సును పరిశుభ్రంగా మారుస్తానని హామీ ఇచ్చారు. ఆమె ఇచ్చిన హామీ ప్రకారం, ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్టర్స్ యంత్రాలను ఏర్పాటు చేశారు. యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన పనులతో కేవలం 20 రోజుల్లోనే ఈ చెరువు పూర్తిగా శుభ్రమైంది. ఇప్పుడు సరస్సు స్వచ్ఛమైన నీటితో కళకళలాడుతోంది. దీంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మోదీ ప్రభుత్వానికి ఏజెంట్‌గా పని చేస్తున్న ఇసి : సిపిఐ(ఎం)

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎన్నికల కమిషన్ మోదీ ప్రభుత్వానికి ఏజెంట్‌గా పని చేస్తున్నదని సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య ఆరోపించారు. బిహార్ ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)ను వ్యతిరేకిస్తూ గోల్కొండ చౌరస్తా నుంచి ఆర్‌టిసి క్రాస్‌రోడ్ వరకు శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ బిహార్‌లో అక్రమంగా, అప్రజాస్వామికంగా 62 లక్షల ఓటర్లను రకరకాల పేరుతో తొలగించే ప్రక్రియకు ఎన్నికల కమిషన్ ఒడిగట్టిందని ఆరోపించారు. బిజెపికి ఓట్లు పడబోవని భావించి, ప్రతి చోటా ఏదో ఒక పేరుతో ఓటరు జాబితా నుంచి కొందరు పేర్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. బిజెపి అనుసరిస్తున్న పద్ధతులను పరిశీలిస్తే దేశంలో ఒక భయానక పరిస్థితులు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలకు, ప్రజాస్వామిక వాదులపైన ఉన్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, పాలడుగు భాస్కర్, బండారు రవికుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.వెంకటేష్, ఎం.వి.రమణ, పి.ఆశయ్య, భూపాల్, బాబురావు, హైదరాబాద్ నాయకులు ఎం.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## దక్షిణ తెలంగాణలో 4 రోజులు భారీ వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దక్షిణ తెలంగాణ జిల్లాల్లో మరో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో నాలుగు రోజులు భారీ వర్షాలు కురుస్తాయన్నారు. హైదరాబాద్ మహానగరంలో శుక్రవారం తేలిక పాటి నుంచి మోస్తరు వానలు పడనున్నట్లు చెప్పారు. నల్లగొండ, యాదాద్రి భువనగరి, నాగర్ కర్నూలు, వనపర్తి, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

# ఆదివాసీల హక్కులు కాలరాస్తున్న కేంద్రం

### మూలాలను పెకిలించి కార్పొరేట్లకు అప్పగించే కుట్ర : మంత్రి సీతక్క




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆదివాసీల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని, అనేక విధాలుగా ఆదివాసీల హననం జరుగుతోందని రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ఆదివాసీల మూలాలు సమూలంగా పెకిలించి, కార్పొరేట్ వ్యవస్థ చేతికి అప్పగించేందుకు ఎన్నో కుట్రలకు పాల్పడుతున్నారని,వివిధ రూపాల్లో ఆదివాసీల జీవన విధానాన్ని విధ్వంసం చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆది ధ్వని ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మూలవాసి దినోత్సవం సందర్భంగా ''సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం' లో శుక్రవారం జరిగిన 'మూలవాసి ఉరుములు మెరుపులు' కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరవ్వగా, జస్టిస్ సుదర్శన్ రెడ్డి, అరుణోదయ విమలక్క, ప్రజాకవి జయరాజు, ఆధ్య కళా మ్యూజియం డైరెక్టర్ జయధీర్ తిరుమల రావు, మాజీ ఐఎఎస్ చిరంజీవులు, యువ పురస్కార అవార్డు గ్రహీత పసునూరు రవీందర్, యువ రచయిత అపర్ణ తోట తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో జీవనశైలి వచ్చిన మార్పులతో ప్రాచీన కలలకు ఆదరణ తగ్గుతోందన్నారు. సొరకాయను బుర్రగా చేసుకుని అందులో నీళ్లు పోసుకుని తాను అడవికి వెళ్ళినప్పుడు, ఆ నీటిని తాగడం ద్వారా తాను ఎంతో ఆరోగ్యవంతంగా ఉన్నానని, ఆదివాసీల తిండి సహజత్వంతో కూడుకున్నదని, సహజంగా దొరికే వస్తువుల్లో ఉండే పోషకాలు ఆధునిక వస్తువుల్లో లేవని చెప్పారు. సజ్జలు కొర్రలు జొన్న తిన్నప్పుడు అనాగరికులని అవమానించారని, కానీ ఇప్పుడు ధనికులు మొత్తం అదే తిండి తింటున్నారని గుర్తు చేశారు. ప్రకృతిని ప్రేమించాలని, విరుద్ధంగా వెళ్తే బలి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆద్య కళ మ్యూజియం ఏర్పాటుకు స్థలం కేటాయింపు అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నదన్నారు. ప్రతి జిల్లాలో ఆదివాసీ సమావేశాలను ఏర్పాటు చేసి, వారి హక్కుల కోసం పోరాడుతున్నామని, ఆదివాసీల హక్కులను కాపాడేందుకు చేయాల్సిందంతా చేస్తామని మంత్రి సీతక్క తెలిపారు.

## మహిళలకు సిఎం రేవంత్ రెడ్డి రాఖీ శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాఖీ పండుగ సందర్భంగా రాష్ట్రంలోని మహిళలందరికీ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా, రాష్ట్ర ప్రభుత్వం మహిళల సాధికారతతో పాటు మహిళలను కోటీశ్వరులుగా చేసే సంకల్పంతో వినూత్న కార్యక్రమాలు, పథకాలను అమలు చేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. ముఖ్యంగా గృహజ్యోతి, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరా క్యాంటీన్లు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు వంటి పథకాలలో మహిళలకే పెద్దపీట వేయడం జరిగిందన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో మహిళలు భాగస్వాములు అయ్యేంత వరకు ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని సిఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. మహిళల రక్షణ, భద్రత విషయంలో రాజీపడకుండా తగిన చర్యలు చేపడతామని తెలిపారు. అక్కాచెల్లెళ్లకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ప్రజల దీవెనలతో ప్రజాపాలన విజయవంతంగా కొనసాగుతుందన్నారు.

### ఉప ముఖ్యమంత్రి భట్టి శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అక్కాతమ్ముళ్లు, అన్నాచెల్లెళ్ల ప్రేమ అనురాగం, అప్యాయతకు ప్రతీకగా జరుపుకునే పండుగ రాఖీ పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగు రాష్ట్రాల్లోని సోదరసోదరీమణులు రాఖీ పౌర్ణమిని ఘనంగా జరుపుకోవాలని అన్నారు. తోడపుట్టిన సోదరికి కష్ట సుఖాల్లో ఆ జన్మాంతం తోడుంటానని సోదరుడు ఇచ్చే అభయమే రక్షాబంధ అని, యుగాలు మారినా, తరాలు మారినా రాఖీ పౌర్ణమి ప్రత్యేకత అలాగే నిలిచిపోయింతుదని తెలిపారు. ఆడబిడ్డల ఆత్మగౌరవం, భద్రత, అభివృద్ధికి ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, మహిళలకు అన్నివేళలా, అన్నివిధాలా అండగా ఉంటానని రక్షాబంధన్ సందర్భంగా హామీ ఇస్తున్నానని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు చెప్పారు.

## టిఎస్ఆర్‌టిసి డిఎంపై చర్యలు

### ఇయు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాబు, ఈదురు వెంకన్న డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళా కండక్టర్‌ను దూషించిన మణుగూరు డిపో మేనేజర్ (డి.ఎం.)పై తక్షణమే చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని టిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్. బాబు, ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న డిమాండ్ చేశారు. మహిళా కండక్టర్‌ను డి.ఎం దూషించిన ఘటనను శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో బాబు, వెంకన్న తీవ్రంగా ఖండించారు. టిఎస్ఆర్‌టిసి ఎక్స్‌ప్రెస్ బస్సును స్టేజి లేని చోట ఆపమని ప్రయాణికులు అడగగా, సిబ్బంది నిరాకరించడంతో ఈ వివాదం మొదలైందన్నారు. అయితే వాస్తవాలను తెలుసుకోకుండానే కండక్టర్ తేజస్వినిని డిపో మేనేజర్ దుర్భాషలాడారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయాణికుల ముందు ఆమె మనోభావాలు దెబ్బతినేలా, మానసిక వేదనకు గురి చేసేలా మాట్లాడారని బాబు, వెంకన్న తెలిపారు. ఎక్స్‌ప్రెస్ సర్వీసులను రిక్వెస్ట్ స్టేజ్‌లలో ఆపవద్దని ఎండి ఆదేశాలు ఉన్నప్పటికీ, డి.ఎం. వాటిని విస్మరించారని వారు గుర్తు చేశారు. గత కొంతకాలంగా మణుగూరు డిపో మేనేజర్ సిబ్బందిని కించపరిచే విధంగా మాట్లాడుతూ, వేధింపులకు పాల్పడుతున్నారని డిపో కార్మికులు తెలిపారన్నారు. గతంలో ఎడిసిగా టైర్ సెక్షన్‌లో పని చేస్తున్న ఎన్. అనిల్ ఫోన్‌ను డి.ఎం. లాక్కుని, దుర్భాషలాడి, చాలా సేపు తన దగ్గరే ఉంచుకున్నారని విమర్శించారు. ఇలాంటి చర్యలు దుర్మార్గమని బాబు, వెంకన్న తీవ్రంగా ఖండించారు.

**మహాలక్ష్మి పథకంతో మరింత భారం..**

'మహాలక్ష్మి' పథకం అమలులోకి వచ్చిన తర్వాత కండక్టర్లు, డ్రైవర్లు ప్రయాణికుల దాడులకు, వేధింపులకు గురవుతున్నారని బాబు, వెంకన్న ఆవేదన వ్యక్తం చేశారు. వీటికి తోడు డిపో మేనేజర్ల వేధింపులు కూడా జత కావడంతో కార్మికుల జీవితాలు ముందు గొయ్యి, వెనక నొయ్యి అన్నట్లుగా తయారయ్యాయని తెలిపారు. తమకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించిన వారిని సస్పెండ్ చేయడం, తొలగించడం జరుగుతుందని చెప్పారు. మహిళా కండక్టర్‌ను అకారణంగా దూషించిన మణుగూరు డిపో మేనేజర్‌పై పక్షపాతం చూపకుండా వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్‌టిసి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

## హైదరాబాద్‌లో పాలస్తీనాకు మద్దతుగా.. 'ఐప్సో' సంఘీభావ కార్యక్రమం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐప్సో) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాదులోని హిమాయత్ నగర్ కార్యాలయం వద్ద పాలస్తీనాకు సంఘీభావంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు ప్లకార్డులు పట్టుకుని పాలస్తీనాకు తమ మద్దతును ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఐఎల్ జాతీ య ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్, ఐప్సో అధ్యక్ష వర్గ సభ్యులు డాక్టర్ డి. సుధాకర్, రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కె.వి.ఎల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జి. నాగేశ్వరరావు, డాక్టర్ కాచం సత్యనారాయణ మాట్లాడుతూ పాలస్తీనాలో సుదీర్ఘకాలంగా సాగుతున్న స్వాతం త్ర్య పోరాటానికి తాము మద్దతు ఇస్తున్నామని తెలిపారు. గాజాలో నిరంతరంగా బాంబుల మోత, నరమేధం కొనసాగుతోందని, వేలాదిమంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని, తీవ్రం గా గాయపడిన వారికి కనీస వైద్య సౌకర్యాలు, ఆహారం, మంచినీరు కూడా అందకపోవడం మానవత్వానికి మచ్చ అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అలీన విధానాన్ని కొనసాగించాల్సిన భారత ప్రభుత్వం ఇజ్రాయిల్‌కు మద్దతునివ్వడం, దేశ విదేశాంగ విధానాన్ని పక్కదారి పట్టించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఐక్యరాజ్యసమితిలో పాలస్తీనాకు భారత్ మద్దతు ఇవ్వకపోవడం దేశ పాలసీకి విరుద్ధమన్నారు. ప్రపంచ దేశాలు, కవులు, కళాకారులు, మేధావులు పాలస్తీనాకు మద్దతుగా నిలుస్తున్నారని, కానీ కేంద్ర ప్రభుత్వం ఈ పరిణామాలను పట్టించుకోకపోవడం 'కళ్ళు మూసుకుని పాలు తాగడమే'నని వారు మండిపడ్డారు. కేంద్రం మేల్కొని పాలస్తీనాకు మద్దతుగా నిలబడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐప్సో నాయకులు ఎ. రామరాజ్, జె.కె. శ్రీనివాస్, పోలగాని రవి కిషోర్, సుభాష్ యాదవ్, రామచంద్రారెడ్డి, రామనారాయణ, సుధావన్, శివ నాగేశ్వర రావు, జాంగిర్ రజాక్, వెంకటేశ్వర్లు, వినోద్, సాగర్, ఎస్.ఎన్. మూర్తి, సూర్య ప్రకాష్, రాకేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## చంపేస్తామని ఎంపి రఘునందన్‌కు ఆగంతకుల బెదిరింపు కాల్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిజెపి మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావుకు శుక్రవారం మరోసారి బెదిరింపు కాల్ వచ్చింది. హైదరాబాద్‌లోనే ఉన్నాం.. సాయంత్రం వరకు చంపేస్తామని అంటూ గుర్తు తెలియని వ్యక్తులు కాల్ చేసి హెచ్చరించారు. ఎవరు కాపాడుతారో చూద్దామంటూ వార్నింగ్ ఇచ్చారు. ఇలా రఘునందన్ రావుకు బెదిరింపు కాల్ రావడం ఆరోసారి. తాజా బెదిరింపు కాల్ రావడంతో బిజెపి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలోనే రఘునందన్ రావు మారోసారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలోనూ ఛత్తీస్ గఢ్లో 'ఆపరేషన్ కగార్'ను తక్షణమే నిలిపివేయాలని మావోయిస్టుల పేరుతో హెచ్చరించారు. గతంలోనూ హైదరాబాద్‌లోనే మా టీమ్ ఉందని మరికాసేపట్లోనే నిన్ను చంపేస్తాం అంటూ రెండు వేర్వేరు నంబర్ల నుంచి అగంతకులు కాల్స్ చేశారు. గత కొన్ని రోజులుగా బెదిరింపు కాల్స్ రావడం చూస్తే.. అదును కోసం అగంతకులు ఎదురుచూస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. చాలా సార్లు కాల్ వచ్చింది ఏం కాదులే అని నిర్లక్ష్యం వహించినప్పుడు ఏదైనా చేయాలని చూస్తున్నారా? అనే ప్రశ్న తలెత్తుతోంది. అయితే రఘునందన్‌రావుకు చేసేది తీవ్రవాదులా? ఇంకా ఎవరైనానా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సారి 9404348431 నెంబర్ నుంచి బెదిరింపు కాల్ వచ్చినట్లు సమాచారం.

## బ్రహ్మోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ఆనంద్‌బాగ్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం జరిగిన బ్రహ్మోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, స్థానిక కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు చేసారు. ఆలయ ఈఓ రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు నిరంజన్, లక్ష్మి కాంతరెడ్డి, వెంకటేష్, సంపత్‌గౌడ్, ప్రవీణ్, వినోద్, సత్యమూర్తి, రాందాస్, సత్యనారాయణ, ఆలయ అభివృద్ధి కమిటి సభ్యులు శంకర్ కుమార్, గణేష్ సురేష్‌సింగ్, చారి, ఇస్తారి, దేవేందర్, బ్రహ్మయ్య, రాము, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# అంతూపొంతూ లేని ఆస్తిపన్ను

### వసూళ్లలో అక్రమాలు
### పూర్తి స్థాయిలో బల్దియా ఖజానాకు చేరని పన్నులు
### ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కింది స్థాయి సిబ్బందికి వరం
### క్షేత్ర స్థాయిలో ఇష్టారాజ్యంగా వసూళ్ల పర్వం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహానగర పాలక సంస్థ(జిహెచ్ఎంసి)లో ఆస్తిపన్ను వసూళ్లలో అంతుపొంతు లేకుండా పోతోంది. వసూలు కావాల్సిన మొత్తం ఖజానాకు చేరడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణలోపంతో కిందిస్థాయి సిబ్బందికి వరంగా మారుతోంది. దీంతో క్షేత్ర స్థాయిలో వసూళ్ల పర్వం ఇష్టారాజ్యంగా సాగుతోందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఏడేళ్ల నుంచి ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న జిహెచ్ఎంసిని గట్టెక్కించే ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా ఆస్తి పన్ను వసూళ్లకు సంబంధించి అధికారులు విధించిన లక్ష్యాలు కార్పొరేషన్ ఆర్థిక వ్యవస్థకు శాపంగా మారాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నగరంలో సుమారు 19.50 లక్షల ఆస్తుల నుంచి ప్రతి ఏటా రూ. 2 వేల కోట్ల పన్ను వసూలు చేయాలని జిహెచ్ఎంసి లక్ష్యంగా నిర్థేశించుకుంది. ఈ వసూళ్ల కోసం 300 మంది బిల్ కలెక్టర్లు, 145 మంది పన్ను ఇన్‌స్పెక్టర్లు పనిచేస్తున్నారు. అయితే వీరిలో సగానికిపైగా సిబ్బంది సంస్థకు నష్టం కలిగించేలా అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఈ అక్రమాలు, అవినీతి వల్ల జిహెచ్ఎంసి ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడలేకపోవడం మాత్రమే కాకుండా, ప్రజల నుంచి రావాల్సిన పన్ను నిధులు సంస్థ ఖజానాకు చేరడం లేదని స్పష్టమవుతోంది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి, అవినీతికి పాల్పడుతున్న సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుకుంటున్నారు.

**సెక్షన్ 213 అంటే ఏమిటి?**


తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని దృష్టిలో పెట్టుకుని, సిబ్బంది ఒత్తిడి మేరకు అధికారులు మున్సిపల్ చట్టంలోని సెక్షన్ 213 ను అమల్లోకి తెచ్చారు. ఈ సెక్షన్ ఏంటంటే, పాత పద్ధతిలో కేవలం పన్ను చెల్లింపులను ప్రశ్నించే అధికారం మాత్రమే సిబ్బందికి ఉండేది. కానీ, ఇప్పుడు సెక్షన్ 213 అమల్లోకి వచ్చాక, పన్ను సిబ్బంది నేరుగా ఆస్తి యజమానుల వద్దకు వెళ్లి భవన నిర్మాణ అనుమతి పత్రాలు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు, వినియోగానికి సంబంధించిన ఇతర పత్రాలను తనిఖీ చేసి, వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒకవేళ రెసిడెన్షియల్ (నివాస) భవనాన్ని కమర్షియల్ (వాణిజ్య) అవసరాలకు ఉపయోగిస్తున్నట్లయితే, అలాంటి ఆస్తులకు నూటికి నూరు శాతం పన్ను పెంచే అధికారం సిబ్బందికి ఈ సెక్షన్ కల్పించింది. దీంతో నగరంలోని ప్రతి భవనాన్ని తనిఖీ చేసే అధికారం సిబ్బందికి లభించింది. ఈ అవకాశాన్ని అడ్డుపెట్టుకుని ప్రతి సర్కిల్ లోనూ డిప్యూటీ కమిషనర్, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్, బిల్ కలెక్టర్లు ఒక బృందంగా ఏర్పడి ఇష్టానుసారంగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కొందరు సిబ్బంది అయితే షాపింగ్ మాల్స్‌లో అనేక వ్యాపార సంస్థలు ఉన్నప్పటికీ, భవన యజమానులతో బేరం కుదుర్చుకుని రెసిడెన్షియల్ ట్యాక్స్ మాత్రమే వసూలు చేసి, మిగిలిన పన్నును జేబుల్లో వేసుకుంటున్నారని ఆరోపణలున్నాయి.

**దుర్వినియోగంతో చేతివాటం..**

జిహెచ్ఎంసిని ఆర్థికంగా గట్టెక్కించాల్సింది పోయి, సెక్షన్ 213 ఎక్కువగా దుర్వినియోగం అవుతోందన్న ఆరోపణలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే చాలామంది పన్ను సిబ్బంది పన్ను వసూళ్లలో అవకతవకలకు పాల్పడి భారీగా అక్రమ ఆస్తులు కూడబెట్టుకున్నట్లు సమాచారం. అసెస్‌మెంట్‌లో ఏరియా తక్కువ చూపించడం, వాణిజ్య వినియోగాన్ని నివాస వినియోగంగా నమోదు చేయడం వంటి చర్యల ద్వారా యజమానులకు శాశ్వత లబ్ధి చేకూరుస్తూ, సిబ్బంది పెద్ద మొత్తంలో అక్రమార్జనకు పాల్పడుతున్నారని ఆరోపణలున్నాయి. నగరంలో భూముల ధరలు ఆకాశాన్నంటిన శేరిలింగంపల్లి, గచ్చిబౌలి వంటి ప్రాంతాల్లో డజనుకు పైగా విల్లాలు, అపార్ట్‌మెంట్లు కొనుగోలు చేసి విలాసవంతమైన జీవితాలను గడుపుతున్న పన్ను సిబ్బంది కూడా ఉన్నారని సమాచారం. కొందరు సిబ్బంది అయితే దొరికిపోతామన్న భయంతో వడ్డీ వ్యాపారులుగా మారి అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

**సిబ్బంది దోపిడీ తీరు ఇలా..**

జిహెచ్ఎంసి పరిధిలోని ప్రతి ఆస్తి పన్ను చెల్లించడంతో పాటు, వాణిజ్య సంస్థలు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలనే నిబంధన ఉంది. కానీ కొందరు సిబ్బంది ఈ నిబంధనలను ఉల్లంఘించి అక్రమాలకు పాల్పడుతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఉదాహరణకు, కొత్తపేటలోని ఓ షాపింగ్ మాల్‌లో సుమారు 450 షాపులు ఉన్నాయి. బెంచ్ మార్క్ విధానం ప్రకారం ఈ మాల్ నుంచి జిహెచ్ఎంసికి ఏటా రూ. 13.64 కోట్ల పన్ను రావాలి. కానీ, కేవలం రూ. 2.91 కోట్లు మాత్రమే వసూలు చేస్తున్నారని తెలిసింది. యజమానులకు పన్ను భారాన్ని తగ్గించేందుకు పన్ను సిబ్బంది భారీగా బేరం కుదుర్చుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ విధంగా 30 సర్కిళ్ల పరిధిలోని అనేక షాపింగ్ మాల్స్ నుంచి రావాల్సిన పన్ను ఖజానాకు చేరకపోవడంతో ఏటా జిహెచ్ఎంసికి వందల కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతోందని ఆరోపణలున్నాయి.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఇథనాల్‌తో ఇబ్బంది లేదు : గడ్కరీ

**న్యూఢిల్లీ:** ఇరవై శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ సురక్షితం కాదంటూ కొంతకాలంగా సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. అవన్నీ అవాస్తవమేనని ఇటీవల కేంద్రం స్పష్టత ఇచ్చింది. తాజాగా కేంద్ర రోడ్డు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ దీనిపై స్పందిస్తూ బహిరంగ సవాల్ విసిరారు. ఇథనాల్‌తో మైలేజీ సమస్య వచ్చిన ఒక్క వాహనాన్ని చూపించాలని ఆయన అన్నారు. 'బిజినెస్ టుడే' నిర్వహించిన సదస్సులో నితిన్ గడ్కరీ పాల్గొన్నారు. ఇథనాల్ అంశాన్ని ప్రశ్నించగా 'పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపడం వల్ల వాహనాల మైలేజీ తగ్గుతోందనే వాదనకు ఎలాంటి అర్హత లేదు. కనీసం ఇది చర్చించే అంశం కూడా కాదు. ఈ విషయం నేను చెప్పొచ్చో, లేదో తెలియదు గానీ... ఇవి పెట్రోలియం కంపెనీలు ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ప్రయత్నాలు కావొచ్చని అనుకుంటున్నా. దీనిపై నేను బహిరంగ సవాల్ విసురుతున్నా... ప్రపంచంలో ఎక్కడైనా ఈ పెట్రోల్ వల్ల సమస్య వచ్చిందని చెప్పే ఒక్క వాహనాన్నైనా చూపించండి. ఇథనాల్ కలపడం వల్ల ఎలాంటి సమస్యా లేదు' అని గడ్కరీ చెప్పారు.

### బిహార్‌లో ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా...

# ఇండియా కూటమి ఎంపిలు నిరసన

### పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లోని మకరద్వార్ వద్ద 'నిరసన గళం' – ప్రియాంకగాంధీ, అభిషేక్ బెనర్జీ సహా డిఎంకె, వామపక్ష పార్టీల ఎంపిలు హాజరు



**న్యూఢిల్లీ :** ఎన్నికల సంఘం బిహార్ ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా శుక్రవారం ఇండియా కూటమి పార్టీలకు చెందిన పలువురు పార్లమెంట్ సభ్యులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్ లో ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. పోల్ రిగ్గింగ్‌గా దానిని ఆరోపిస్తూ, ఓట్ల దొంగతనంగా అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి, వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా, తృణమూల్ కాంగ్రెస్ ఎంపి అభిషేక్ బెనర్జీ, ఇతర ప్రతిపక్షపార్టీలైన ద్రవిడ మున్నేట్ర కజగం (డిఎంకె), వామపక్షపార్టీల కు చెందిన పలువురు ఎంపీలు పార్లమెంట్‌లోని మకరద్వార్ వద్ద గుమిగూడారు. వారు పోస్టర్లను పట్టుకుని నినాదాలు చేశారు. ఎస్ఐఆర్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇది నిరసనలో 13వ రోజు అని, అయితే ఒక్క సోమవారం మాత్రమే మాజీ జార్ఖండ్ ముఖ్యమంత్రి శిబూసోరెన్ మృతిని దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని ఆరోజు దాటవేశామని ఇండియా కూటమి ఎంపీలు తెలిపారు. 'మా ఓటు. మా హక్కు. మా పోరాటం' అని రాసి ఉన్న బ్యానర్‌ను అగ్రభాగాన చేతబూని వారు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. 'ఎస్ఐఆర్' అంటే 'సైలెంట్ ఇన్విజిబుల్ రిగ్గింగ్' అని రాసి ఉన్న మరో బ్యానర్‌ను కూడా నిరసన తెలియజేస్తున్న ఎంపీలు చేతపట్టుకున్నారు. అంతేకాకుండా 'ఎస్ఐఆర్‌ను ఆపివేయండి' అనే ప్లకార్డులు సహా ఎన్నికల కమిషన్, ప్రభుత్వం కుమ్మక్కై కుట్ర చేశారని ఆరోపించే పోస్టర్లను కూడా నిరసన కార్యక్రమంలో వారు ప్రదర్శించారు. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పోలింగ్ రిగ్గింగ్ ఆరోపణలను సూచిస్తూ, అధిక సంఖ్యలో ఎంపీలు 'ఓట్ల దొంగతనం' అని ఆరోపించే పోస్టర్లు, ప్లకార్డులను కూడా ప్రదర్శించారు. ఈ సంవత్సరం అసెంబ్లీ ఎన్నికలు బిహార్‌లో జరుగనున్న నేపథ్యంలో ఓటర్లకు ఓటు హక్కు లేకుండా చేయడమే లక్ష్యంగా ఎన్నికల సంఘం చర్య తీసుకుందని ఆరోపించారు. పార్లమెంట్‌లోని ఉభయ సభల్లో ప్రతిపక్షాలు ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్నాయి. ఈఅంశంపై ఉభయ సభల్లోనూ చర్చ జరగాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. బిహార్‌లోని ఎస్ఐఆర్ పై పార్లమెంట్‌లో ప్రతిష్ఠంభన నెలకొన్నది.ఉభయ సభలలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరగడం మినహా జులై 21న వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన నాటి నుంచి పదేపదే వాయిదాలు మినహా ఎస్ఐఆర్ అంశంపై ఎలాంటి చర్చ జరగలేదని ప్రతిపక్ష ఎంపీలు ఆరోపించారు.

### ఓట్ల చోరీపై కాంగ్రెస్ నిరసనలు

**న్యూఢిల్లీ:** ఎన్నికల కమిషన్ సాయంతో అధికార పార్టీ 'ఓట్లను దొంగిలించింది' అని ఆరోపిస్తూ, బీజేపీ, ఎన్నికల కమిషన్ (ఈసీ)పై కాంగ్రెస్ పార్టీ శుక్రవారం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. మహారాష్ట్ర రాజధాని ముంబైలో పార్టీ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు హర్షవర్ధన్ నేతృత్వంలో సక్పల్ కాంగ్రెస్ నాయకులు, శ్రేణులు రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపాయి. ఈసీ, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అంతకుముందు తిలక్ భవన్ వద్ద విలేకరుల సమావేశంలో సక్పల్ మాట్లాడుతూ ఈసీ 'పూర్తిగా విశ్వసనీయత' కోల్పోయిందని, అది బీజేపీకి 'బ్రోకర్ లేదా న్యాయవాది' మాదిరిగా నటిస్తోందన్నారు. పార్లమెంటులో రాహుల్ గాంధీ చేసిన ఆరోపణల గురించి అధికార పార్టీ, ఈసీ ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. కాగా లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ఒక 'వ్యవస్థాగతమైన దొంగతనం'గా అభివర్ణించారు. సక్పల్ మాట్లాడుతూ ఈసీ సహాయంతో బీజేపీ ఎన్నికల్లో ఏ విధంగా అక్రమాలకు పాల్పడిందో డాక్యుమెంటరీ సాక్ష్యంతో సహా రాహుల్ గాంధీ బయటపెట్టారని తెలిపారు. అయితే దీనిపై ఒక ఉన్నత స్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేయడం లేదా సుప్రీం కోర్టు పర్యవేక్షణలో ఒక సిట్ బృందాన్ని నియమించడానికి బదులుగా రాహుల్‌గాంధీపై వ్యక్తిగతంగా దాడి చేస్తోందన్నారు. అధికారిక అభ్యంతరం లేవనెత్తితే తప్పనిసరిగా విచారణ చేసే ఎన్నికల కమిషన్ నిబంధనలు1960కు చెందిన 17, 18, 19 నిబంధనలను ఈసందర్భంగా ఆయన ఎత్తి చూపారు. ఈసీవాటిని ఎందుకు అమలు చేయడం లేదు? మౌనం ఎందుకు? అని సక్పల్ ప్రశ్నించారు.

### రాహుల్ ప్రమాణపూర్వకంగా

# అఫిడవిట్ ఇవ్వాలి : ఇసి

### పార్లమెంటులోనే ప్రమాణం చేశా : రాహుల్



**న్యూఢిల్లీ :** తన విశ్లేషణను నమ్మి, ఎన్నికల కమిషన్‌పై తన ఆరోపణలు నిజమని భావిస్తే, ఓటర్ల జాబితాలో అక్రమంగా చేర్చబడిన లేదా తొలగించబడిన పేర్లను ఎన్నికల నిబంధనల ప్రకారం డిక్లరేషన్‌పై సంతకం చేసి తమకు సమర్పించాలని రాహుల్‌గాంధీని ఉద్దేశించి ఎన్నికల కమిషన్ వర్గాలు పేర్కొన్నాయి. అయితే, రాజ్యాంగాన్ని పరిరక్షిస్తానని పార్లమెంటులో ప్రమాణం చేసిన వ్యక్తినని రాహుల్‌గాంధీ ఇసి వ్యాఖ్యలను తిప్పికొట్టారు. రాహుల్‌గాంధీ డిక్లరేషన్‌పై సంతకం చేయకపోతే, ఆయన తన విశ్లేషణను, దాని ఫలితాలను, అసంబద్ధమైన ఆరోపణలను నమ్మడం లేదని అర్థం అవుతుందని ఇసి వర్గాలు పేర్కొన్నాయి. బిహార్ ముసాయిదా ఓటర్ల జాబితా నుండి పేర్లను చేర్చడం లేదా తొలగించడంపై ఏ రాజకీయ పార్టీ కూడా ఎన్నికల సంఘాన్ని సంప్రదించలేదని, అలాంటప్పుడు కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఇప్పుడు ఎందుకు అభ్యంతరాలు లేవనెత్తుతున్నారని ఎన్నికల సంఘం వర్గాలు ప్రశ్నించాయి. కాంగ్రెస్ నాయకుడు ఎస్ఐఆర్‌పై తన వాదనలను, అభ్యంతరాలను ఇప్పుడు కాకుండా ఎన్నికల తర్వాత మాత్రమే ఇస్తారని వ్యంగ్యంగా ఒక ఇసి అధికారి వ్యాఖ్యానించినట్లు పిటిఐ కథనం పేర్కొంది.

## ముంబైలో అవకతవకలు జరిగాయి : ఎస్‌పి

**ముంబై :** మహారాష్ట్రలో ఓటర్ల జాబితా తారుమారు జరిగిందని అధికార బిజెపి పట్ల ఎన్నికల సంఘం స్పష్టమైన పక్షపాతం చూపుతోందని సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు అబూ అజ్మీ ఆరోపించారు. ఎన్నికలకు కేవలం ఆరు నెలల ముందు మంఖుర్ద్–శివాజీ నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్ల పేర్లను చేర్చారని, అకారణంగా వాటిని తొలగించి, నివాసితులు కాని వారి పేర్లను చేర్చారని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చవాన్, సీనియర్ నేత బాలసాహెబ్ థోరట్‌తో సహా కీలక కాంగ్రెస్ నాయకుల ఓటమి 2024 మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలలో తప్పులకు రుజువు చేస్తుందని ఆయన శుక్రవారం ముంబైలో విలేకరులతో మాట్లాడుతూ అన్నారు.

# చమురు కంపెనీలకు రూ.30 వేల కోట్లు

### నష్టాలకు పరిహారం చెల్లించేందుకు కేంద్ర కేబినెట్ నిర్ణయం



**న్యూఢిల్లీ :** దేశీయ ఎల్‌పిజిలో నష్టాలకు ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలకు పరిహారంగా రూ.30,000 కోట్లను కేబినెట్ ఆమోదించింది. పెట్రోలియం మరియు సహజవాయువు మంత్రిత్వ శాఖ నిర్వహణలో కొనసాగుతున్న ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్లను ఐఒసిఎల్, బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్ సంస్థలు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే వినియోగదారులకు సరఫరా చేస్తున్నాయి. అంతర్జాతీయ విపణిలో ముడి చమురు ధరలు తరచు తీవ్రమైన ఆటుపోట్లను ఎదుర్కొంటూ ఉంటాయి. దీనితో ధరలను కూడా నిత్యం మార్చాల్సి ఉంటుంది. అయితే, ఎల్‌పిజి వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా, సబ్సిడీ ధరలకే చమురు కంపెనీలు గ్యాస్ సరఫరా చేస్తాయి. అయితే, నియంత్రిత ధరల కారణంగా, భారీ నష్టాలను ఎదుర్కొంటున్నాయి. అందుకు పరిహారంగా కేంద్రం సదరు నష్టాన్ని భరించడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ క్రమంలోనే, శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ చమురు కంపెనీలకు పరిహార మొత్తాన్ని ప్రకటించింది.

**'మెరిట్' పథకానికి రూ. 4,200 కోట్లు...**

సాంకేతిక విద్యలో బహుల విభాగ కోర్సు, పరిశోధనల మెరుగుదల (మల్టీడిసిప్లినరీ ఎడ్యుకేషన్ అండ రీసెర్చ్ ఇంప్రూవ్‌మెంట్ ఇన్ టెక్నికల్ ఎడ్యుకేషన్/ ఎంఇఆర్ఐటిఇ/ మెరిట్) పథకానికి రూ.4200 కోట్లతో బడ్జెట్ మద్దతును కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. 175 ఇంజనీరింగ్ సంస్థలు, 100 పాలిటెక్నిక్ కాలేజీలతో కూడిన 275 సాంకేతిక విద్యా సంస్థలలో 'మెరిట్' పథకాన్ని అమలు చేసే ప్రతిపాదనను ఆమోదించింది. జాతీయ విద్యా విధానం 2020 (ఎన్‌ఇపి 2020)కి అనుగుణంగా అన్ని రాష్ట్రాలు/కేంద్ర పాలిటెక్నిక్‌లను కవర్ చేసే సాంకేతిక విద్యలో నాణ్యత, సమానత్వం, మెరుగైన పాలనే ఈ పథకం ముఖ్య లక్ష్యాలు. ఇది 2025–26 నుండి 2029–30 ఆర్థిక సంవత్సరం వరకు మొత్తం రూ. 4200 కోట్ల అంచనా వ్యయంతో కొనసాగుతుంది. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌తోపాటు ఈ పథకానికి ప్రపంచ బ్యాంకు రూ.2100 కోట్ల రుణసాయాన్ని అందిస్తుంది.

**'ఉజ్వల'కు సబ్సిడీ కొనసాగింపు...**

ప్రధాన మంత్రి ఉజ్వల యోజన (పిఎంయువై) కింద వినియోగదారులకు ఇచ్చే సబ్సిడీని 2025–26 సంవత్సరంలోనూ కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం కింద రూ. 12,000 కోట్ల సబ్సిడీకి కేంద్రం ఆమోద ముద్ర వేసింది. దేశవ్యాప్తంగా పేద కుటుంబాలలోని వయోజన మహిళలకు డిపాజిట్ లేని ఎల్‌పిజి కనెక్షన్ అందించే లక్ష్యంతో పిఎంయువై పథకాన్ని 2016, మే మాసంలో ప్రారంభించారు. ఈ ఏడాది జూన్ ఒకటో తేదీనాటికి దేశవ్యాప్తంగా దాదాపు 10.33 కోట్ల పిఎంయువై కనెక్షన్లు ఉన్నాయి. వీరు ఎలాంటి డిపాజిట్ లేకుండానే ఎల్‌పిజి కనెక్షన్‌ను పొందుతారు. ఇందులో సిలిండర్ సెక్యూరిటీ డిపాజిట్, ప్రెజర్ రెగ్యులేటర్, సురక్ష హోస్, డొమెస్టిక్ గ్యాస్ కన్స్యూమర్ కార్డ్ (డిజిసిసి) బుక్‌లెట్, ఇన్‌స్టాలేషన్ ఛార్జీలను ప్రభుత్వమే భరిస్తుంది. ఉజ్వల 2.0 యొక్క ప్రస్తుత పద్ధతుల ప్రకారం, మొదటి రీఫిల్, స్టవ్ కూడా లబ్ధిదారులందరికీ ఉచితంగా అందిస్తారు. కాగా, ఈశాన్య రాష్ట్రాలైన అస్సాం, త్రిపురకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీల పథకం (ఎస్‌డిపి)ల కింద కొత్తగా నాలుగు భాగాలకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీని వ్యయం మొత్తం రూ. 4,250 కోట్లు.

# అంగుళం భూమినీ లాక్కోనివ్వం

### పంజాబ్ ప్రభుత్వానికి దలేవాల్ స్పష్టీకరణ
### లూథియానాలో రైతుల భారీ ప్రదర్శన
### 25న దిల్లీలో కిసాన్ మహా పంచాయత్



**లూథియానా:** తమకు చెందిన అంగుళం భూమిని కూడా ప్రభుత్వం లాక్కునేందుకు వీల్లేదని రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దలేవాల్ తేల్చిచెప్పారు. పంజాబ్‌లో భూ సేకరణ విధానాన్ని తిరస్కరించారు. సారవంతమైన భూములను ఎలా సేకరిస్తారని ప్రశ్నించారు. ఈ విధానానికి వ్యతిరేకంగా దలేవాల్ నాయకత్వంలో లూథియానాలో భారీ నిరసన ప్రదర్శన జరిగింది వేలాది మంది రైతులు పాల్గొన్నారు. పంజాబ్‌లో లాండ్ పూలింగ్ విధానాన్ని వ్యతిరేకించారు. సారవంతమైన భూము లు ప్రతి అంగుళం పరిరక్షణకు దలేవాల్ ప్రతిజ్ఞబూనారు. నాలుగు నెలల కిందట నిరాహార దీక్షను విరమించిన దల్లేవాల్ తన మద్దతుదారులతో కలిసి పంజాబ్ భూసేకరణ విధానానికి వ్యతిరేకంగా పోరాటాన్ని చేపట్టారు. జోధన్‌లోని ధాన్యం మార్కెట్ వద్ద భారీ సభ నిర్వహించారు. రైతుల బల ప్రదర్శనకుతాజా ర్యాలీ నిర్వహించారు. రైతులు వేలాదిగా పాల్గొనడంతో మార్కెట్ వద్ద వెయ్యి మంది పోలీసులు మోహరించారు. ర్యాలీలో కర్నాటక, హర్యానా, రాజస్థాన్, మహారాష్ట్ర నుంచి జాతీయ స్థాయి నాయకులు పాల్గొన్నారు. గ్రామాల మనుగడే ప్రశ్నార్థకమయ్యే విధంగా వినాశకర విధానాలను మానుకోవాలని పంజాబ్ ప్రభుత్వాన్ని దలేవాల్ ఈ సందర్భంగా హెచ్చరించారు. భూసేకరణ విధానం కింద సాగు భూముల్లో ఒక్క అంగుళం కూడా ప్రభుత్వం లాక్కునేందుకు రైతులు ఒప్పుకోరని తేల్చిచెప్పారు. భూసేకరణ విధానానికి వ్యతిరేకంగా ఈనెల 25న దిల్లీలో ఒక రోజు ఆందోళనకు పిలుపునిచ్చారు. ప్రతి అంగుళాన్ని రైతులు కాపాడుకుంటారన్న స్పష్టమైన సందేశం కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలకు ఈ ఆందోళన ద్వారా ఇవ్వనున్నట్ల దల్లేవాల్ వక్కాణించారు. వ్యవసాయం, డెయిరీ, పౌల్ట్రీ, మత్స్య సాగు రంగాల్లో అమెరికా కాలు మోపేందుకు ప్రయత్నిస్తున్న వేళ భారతీయ రైతులపై అన్ని వైపుల నుంచీ దాడులు జరుగుతున్నాయని రైతు నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగాన్ని పరిరక్షించుకోవడం కోసం రైతులంతా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈనెల 27న దిల్లీలో కిసాన్ మహాపంచాయత్ జరగబోతోందని తెలిపారు. 10వ తేదీన ఇస్రానా, పానిపట్‌లో, 11,12 తేదీల్లో రాజస్థాన్ లోని శ్రీగంగానగర్, హనుమాన్‌ఘర్‌లో, 1415 తేదీల్లో మధ్యప్రదేశ్‌లోని ఇటార్సి, అశోక్ నగర్‌లో, 17, 18, 19 తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లోని అలీఘర్, సంబల్, బాఘ్‌పట్‌లో మహా పంచాయత్‌లు నిర్వహిస్తామని రైతు నాయకులు వెల్లడించారు.

## రాహుల్ కూర్చున్న కొమ్మను నరుకుతున్నారు : బిజెపి

**న్యూఢిల్లీ :** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో రిగ్గింగ్ ఆరోపణలకు మద్దతుగా రాహుల్‌గాంధీ చేసిన ప్రకటనను బిజెపి శుక్రవారం ఎద్దేవా చేసింది. ఇది తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కున్నట్లుగా ఉందని, ఓటర్ల సంఖ్య పెరిగిన చోట కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు చాలాసీట్లు గెలుచుకున్నాయని కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ అన్నారు. ప్రతిపక్ష నాయకుడికి తగని భాషను గాంధీ ఉపయోగించారని ఆరోపించారు. ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగ సంస్థ అధికారులను, అధికార బిజెపికి సహాయం చేశాయని రాహుల్ చేసిన ఆరోపణలకు పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుందని ఆయన హెచ్చరించారు.పోలింగ్ ప్రక్రియపై కాంగ్రెస్ నాయకుడికి నిజమైన అభ్యంతరాలు ఉంటే ప్రమాణం పూర్వకంగా ఇసికి ఒక అఫిడవిట్ దాఖలు చేయాలని ఆయన అన్నారు.

### బ్రహ్మపుత్ర నదిపై చైనా మెగా డ్యామ్ నిర్మాణం నివేదికలను...

## ప్రభుత్వం పరిగణనలోనికి తీసుకుంది

### రాజ్యసభకు విదేశాంగ శాఖ సహాయమంత్రి కీర్తివర్ధన్ సింగ్ వెల్లడి



**న్యూఢిల్లీ :** టిబెట్‌లోని యార్లుంగ్ త్సాంగ్పో నది దిగువ ప్రాంతాలలో (బ్రహ్మపుత్ర ఎగువ ప్రాంతాలు) చైనా మెగా ఆనకట్ట నిర్మాణాన్ని ప్రారంభించడంపై వచ్చిన నివేదికలను భారతదేశం గమనించిందని ప్రభుత్వం పార్లమెంట్‌కు తెలియజేసింది. రాజ్యసభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఈ విషయాన్ని వెల్లడించారు. మంత్రి కీర్తివర్ధన్ సింగ్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ గురించి తొలుత 1986లోనే బహిరంగంగా ప్రకటించారని, అప్పటి నుంచి చైనాలో సన్నాహాలు జరుగుతూనే ఉన్నాయని చెప్పారు. 'టిబెట్‌లోని యార్లుంగ్ త్సాంగ్పో నది (బ్రహ్మపుత్రనది ఎగువ ప్రాంతం)దిగువన చైనా మెగా ఆనకట్ట నిర్మాణాన్ని ప్రారంభించినట్లు వచ్చిన నివేదికలను భారత ప్రభుత్వం పరిగణనలోనికి తీసుకుంది' అని మంత్రి రాజ్యసభకు వెల్లడించారు. అయితే బ్రహ్మపుత్రనదికి సంబంధించిన అన్ని పరిణామాలను ప్రభుత్వం 'జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నది' అన్నారు. హైడ్రో ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలనే చైనా ప్రణాళికలు సహా దిగువ ప్రాంతాలలో నివసిస్తున్న భారతీయ పౌరుల జీవితం, జీవనోపాధిని కాపాడటానికి నివారణ, దిద్దుబాటు చర్యలు సహా మన ప్రయోజనాలను కాపాడుకోవటానికి అవసరమైన చర్యలు తీసుకుంటుందని మంత్రి కీర్తివర్ధన్ చెప్పారు. 2006లో స్థాపించబడిన సంస్థాగత నిపుణులస్థాయి యంత్రాంగం పరిధిలో చైనా సరిహద్దు నదులకు సంబంధించిన వివిధ అంశాలను దౌత్యచానెళ్ల ద్వారా చర్చిస్తున్నట్లు సింగ్ తన ప్రతిస్పందనలో చెప్పారు. ట్రాన్స్‌బోర్డ్ నదుల జలాలపై గణనీయమైన స్థిర వినియోగదారు హక్కులతో దిగువ నదీతీర రాష్ట్రంగా, ప్రభుత్వం తన అభిప్రాయాలను, ఆందోళనలను ఎప్పటికప్పుడు చైనా అధికారులకు తెలియజేస్తూనే ఉందని, ఇందులో పారదర్శకత సహా దిగువన ఉన్న దేశాలతో సంప్రదింపుల అవసరం ఉన్నదని, ఎగువ ప్రాంతాలలో జరిగే ఏవైనా కార్యకలాపాల వల్ల దిగువన ఉన్నవారి ప్రయోజనాలకు హాని కలగకుండా చూసుకోవాలని వారిని కోరిందని మంత్రి కీర్తివర్ధన్ సింగ్ జోడించారు. జులై 14 నుంచి 16వరకు ఎస్‌సిఒ విదేశాంగ మంత్రుల సమావేశం కోసం విదేశాంగమంత్రి ఇటీవల చైనాలో పర్యటించిన సమయం సహా ప్రభుత్వం అనేక ద్వైపాక్షిక సంబంధాలలో హైలెట్ చేసిన విషయాలను మంత్రి కీర్తివర్ధన్ సింగ్ ప్రస్తావించారు.

# బోయింగ్ విమానాల ఒప్పందం రద్దు!

### భారత్ నిర్ణయం తీసుకుందని వార్తలు



**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న అదనపు సుంకాలు, పెనాల్టీలకు భారత్ కూడా తీవ్రంగా స్పందించిందని, బోయింగ్ పి8I విమానాలకు సంబంధించిన ఒప్పందాన్ని రద్దు చేసుందని వార్తలు వస్తున్నాయి. అధికారికంగా ఎలాంటి ప్రకటన లేకపోయినప్పటికీ, జాతీయ మీడియా కథనాలను అనుసరించి, భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై అమెరికా 50 శాతం టారిఫ్‌లను విధించడం తీవ్ర చర్చకు కారణమైన విషయం తెలిసిందే. అమెరికా నిర్ణయానికి సమాధానంగా పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నది. రక్షణ శాఖకు అవసరమైన వివిధ కొనుగోళ్లను ప్రభావితం చేసే విధంగా, బోయింగ్ పి8I విమానాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. 2021లో 2.42 బిలియన్ డాలర్లకు ఈ ఒప్పందం కుదిరింది. అయితే, ద్రవ్యోల్బణం, ట్రంప్ విధించిన టారిఫ్‌లు, ఇతర కారణాల వల్ల సుమారు 50 శాతం పెరిగి, 3.6 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ట్రంప్ నిర్ణయాలకు వ్యతిరేకంగా రక్షణ కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేసిందా లేక బోయింగ్ ఉత్పత్తి వ్యయాన్ని టారిఫ్‌లు పెంచుతున్నందుకే ఈ నిర్ణయం తీసుకుందా అన్నది ఇంకా తెలియరాలేదు. ప్రభుత్వ పరంగా ప్రకటన కూడా వెలువడలేదు. కాగా, ఈ పి8I విమానాల సరఫరా గొలుసులో భారత్ నుంచి ఎగుమతి చేసిన లేదా దేశీయంగా ఉత్పత్తి చేసిన భాగాలు ఉన్నాయి. ఇప్పుడు ఈ భాగాలను అమెరికాలోకి దిగుమతి చేసుకున్నప్పుడు కొత్త టారిఫ్‌లు అమలవుతాయి. ఒకవేళ ఒప్పందాన్ని కొనసాగిస్తే, పెరిగిన వ్యయాన్ని భారత్ భరించాల్సి వస్తుంది. అందుకే ఈ ఒప్పందం నుంచి వైదొలగిందనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతున్నది. బోయింగ్‌తో కుదిరిన ఒప్పందాన్ని పునఃసమీక్షించే అవకాశాలు ఉన్నాయని సమాచారం. కాగా, ఎయిర్ ఇండియా సంస్థ తన పాత బోయింగ్ 7878 డ్రీమ్‌లైనర్ విమానాలను అమెరికాలో ఆధునీకరిస్తున్నది. ఈ విధంగా రెట్రోఫిట్టింగ్ చేసిన జెట్ విమానం ఈఏడాది చివరి నాటికి ఎయిర్ ఇండియాకు అందనుంది. ఆ సంస్థలో మొత్తం 33 డ్రీమ్‌లైనర్లు ఉన్నాయి. వీటిలో 26 పాత బోయింగ్ 7878కాగా, 7 బోయింగ్ 7879 విమానాలు. ఆధునీకరించిన ప్రతి విమానంలో 20 బిజినెస్ క్లాస్, 25 ప్రీమియం ఎకనమీ, 205 ఎకనమీ క్లాస్ సీట్లతో కూడిన మూడు తరగతులతో సీటింగ్ ఉంటుంది. ప్రతి నెల రెండు డ్రీమ్‌లైనర్‌లను రెట్రోఫిట్ కోసం పంపాలని ఎయిర్ ఇండియా లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, ప్రస్తుత పరిణామాలు భారత్–అమెరికా రక్షణ సంబంధాలపై, దేశ భవిష్యత్ రక్షణ కొనుగోళ్లపై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు ఉండడంతో, ఎయిర్ ఇండియా ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

## హైకోర్టు జడ్జిపై ఆంక్షలు...

### సుప్రీంకోర్టు ఉపసంహరణ

**న్యూఢిల్లీ:** అలహాబాద్ హైకోర్టు జడ్జిపై ఆంక్షల విషయంలో గతంలో వెలువరించిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు ఉపసంహరించుకుంది. రిటైరయ్యేంతవరకూ హైకోర్టు జడ్జికి క్రిమినల్ కేసులు అప్పగించకూడదని ఆంక్షలు విధిస్తూ ఈనెల 4న వెలువరించిన ఉత్తర్వులను ఉప సంహరించుకుంటున్నట్లు పేర్కొంది. సీజేఐ జస్టిస్ బిఆర్ గవాయ్ అభ్యర్థన మేరకు న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్థివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌తో కూడిన ధర్మాసనం దీనిని వెనక్కి తీసుకున్నది. ఈకేసు విషయంలో తీర్పును పునఃపరిశీలించాలని కోరుతూ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ నుంచి తమకు లేఖ అందిందని ధర్మాసనం పేర్కొంది. సంబంధిత న్యాయమూర్తికి ఇబ్బందులు కలిగించడం తమ ఉద్దేశం కాదని, అయితే కొన్ని విషయాల్లో పరిమితులు దాటినప్పుడు న్యాయవ్యవస్థ గౌరవాన్ని కాపాడటం కోసమే కోర్టు పనిచేస్తుందని జస్టిస్ పార్థివాలా పేర్కొన్నారు. అంతకుముందు ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకున్నప్పటికీ అలహాబాద్ హైకోర్టు తీర్పు చట్టవిరుద్ధమని ఆందోళన వ్యక్తంచేశారు. న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే ఇటువంటి ఆదేశాలను విస్మరించలేమని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశంలోని కొన్ని అంశాలు అమలుకాకుండా నిరోధించేందుకు ఫుల్ కోర్టును సమావేశపరచాలని అలహాబాద్ హైకోర్టుకు చెందిన 13 మంది న్యాయమూర్తులు గురువారం అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. హైకోర్టులపై పాలనాపరమైన పర్యవేక్షణ అధికారం సుప్రీంకోర్టుకు లేదని, అందుకే ఆగస్టు 4నాటి సుప్రీం ఆదేశాల్లో 24వ, 26వ పేరాల్లోని నిర్దేశాలను అమలుచేయరాదని ఫుల్‌కోర్టు తీర్మానించాలని జడ్జీలు కోరారు. ఈ నేపథ్యంలో 'సుప్రీం' తన ఉత్తర్వులను వెనక్కి తీసుకుంది.

## ఇసి కేవలం బిజెపికే బాధ్యత వహిస్తుందా?

### ఓట్ చోరీపై దర్యాప్తు చేయాలి: ప్రియాంక గాంధీ



**న్యూఢిల్లీ :** పోలింగ్ రిగ్గింగ్ ఆరోపణల వివరాలను అఫిడవిట్ ద్వారా ప్రమాణపూర్వకంగా అందజేయాలని రాహుల్‌గాంధీని ఎన్నికల సంఘం అధికారులు కోరడంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా తీవ్రంగా విమర్శించారు. బిజెపి పట్ల మాత్రమే వారి బాధ్యత అని వారు భావిస్తే, వారు పునరాలోచించుకోవాలన్నారు. 'వారు అడుగుతున్న అఫిడవిట్ ఒక చట్టం కింద ఉంది, దీనిలో మీరు 30 రోజులలోపు ఒక పిటిషన్ ఇవ్వాలి, లేకపోతే ఏమీ జరగదు. కాబట్టి వారు అఫిడవిట్ ఎందుకు అడుగుతున్నారు. ఇంత పెద్ద విషయం బయటపడింది. అది అనుకోకుండా జరిగితే, దానిపై దర్యాప్తు చేయండి' అని తనను కలిసిన విలేకరులతో ఆమె అన్నారు. ఎన్నికల సంఘం మెషిన్ రీడబుల్ ఫార్మాట్లో ఓటర్ల జాబితాను ఎందుకు ఇవ్వడం లేదు, దర్యాప్తు ఎందుకు చేయడం లేదు అని ఆమె ప్రశ్నించారు. దానికి బదులుగా రాహుల్‌గాంధీని అఫిడవిట్ మీద సంతకం చేయమంటున్నారని, పార్లమెంట్‌లో తాము తీసుకున్న ప్రమాణం కంటే అది పెద్ద ప్రమాణమా అని, తాము బహిరంగంగా ప్రతిదీ చెబుతున్నామని, ఇసికి ఆధారాలు చూపిస్తున్నామని అన్నారు.

**రాహుల్‌వి గంభీరమైన ప్రశ్నలు : థరూర్**

రాహుల్‌గాంధీ వేసినవి గంభీరమైన ప్రశ్నలు అని, వీటిని అన్ని ఓటర్ల ప్రయోజనాల దృష్ట్యా గంభీరంగా తీసుకొని పరిష్కరించాలని, ఎన్నికల సంఘం వెంటనే చర్య తీసుకోవాలని కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ తన 'ఎక్స్' ఖాతా ద్వారా కోరారు.

ప్రజాపక్షం
శనివారం, 09 ఆగస్టు

## ఇప్పటికైనా భ్రమ తొలగేనా?

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో వ్యక్తిగత స్నేహబంధంతో భారత ప్రధాని నరేంద్రమోదీ దశాబ్దకాలంగా నిర్మిస్తూ వచ్చిన భ్రమల సౌధం, ఒక్కసారిగా కూలిపోయినంత పని జరిగింది. ప్రపంచ దేశాలపై 'సుంకాల యుద్ధం' చేస్తున్న ట్రంప్ తమ మిత్ర దేశం భారత్‌పై మరీ కఠినంగా వ్యవహరించడం మోదీ ఊహించనిది. ట్రంప్ విధించిన–పొడిగించిన గడువులోగా భారత్ అమెరికా షరతులకు తలొగ్గి వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోనందున భారత్ నుంచి దిగుమతులపై ఆగస్టు 6న 25 శాతం సుంకాలు విధించాడు. పశ్చిమ ఆంక్షలు ధిక్కరించి రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తూ ఉక్రేన్‌పై దాని యుద్ధానికి పరోక్షంగా ఊతమిస్తున్న దేశాలపై కొద్దిరోజుల్లో పెనాల్టీలు విధిస్తానని ఆరోజున చెప్పినట్లే ట్రంప్ భారత్ దిగుమతులపై పెనాల్టీగా మరో 25శాతం సుంకాలు విధించి–మొత్తం సుంకాల శాతాన్ని 50 శాతానికి పెంచారు. ఈ పెంపుదల ఆగస్టు 27 నుంచి అమలులోకి వస్తుంది.

ఇది భారత విదేశాంగ విధానం వైఫల్యం మాత్రమే గాక వ్యక్తిగతంగా ప్రధాని మోదీకి షాక్. ఎందుకంటే, మోదీ–ట్రంప్ మైత్రిని వృద్ధి చెందుతున్న భారత్ దౌత్య ప్రభావానికి నమూనాగా ప్రచారం చేశారు. అది ఎంత గాఢమైనదంటే అమెరికాలో ''హౌడీ మోదీ'' అభినందన సభకు ట్రంప్ హాజరై మోదీ నాయకత్వంపై ప్రశంసలు కురిపించారు. ''మరోసారి ట్రంప్ పాలన'' అంటూ మోదీ అమెరికన్లకు విజ్ఞప్తి చేశారు. నరేంద్రమోదీ అహ్మదాబాద్‌లో లక్షల మందిని సమీకరించి ''నమస్తే ట్రంప్'' అభినందన సభను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించారు. రెండు అతిపెద్ద ప్రపంచ ప్రజాస్వామ్యాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం పేరుతో అనేక అంతర్జాతీయ సదస్సుల్లో మోదీ భారత్‌ను అమెరికా అనుకూల బాట పట్టించారు. ఏమైనా, అమెరికాకు ఏ దేశంతోనైనా సంబంధాలు తాత్కాలికం తప్ప పరివర్తనాత్మకం కావని తాజా సుంకాల యుద్ధం రుజువు చేస్తున్నది.

పహల్గాం తదుపరి భారత్–పాకిస్తాన్ యుద్ధాన్ని వాణిజ్యంతో తానే ఆపానని ట్రంప్ అదే పనిగా చెప్పుకుంటున్నా దాన్ని ఖండించలేని మోదీ ప్రభుత్వ నిస్సహాయ స్థితి దాని బలహీనతను బహిర్గతం చేసింది. అమెరికా వ్యవసాయోత్పత్తులకు–ముఖ్యంగా జన్యు మార్పిడి ఉత్పత్తులకు భారత్ మార్కెట్లను తెరవాలని, పాడి పరిశ్రమలోకి అమెరికాను అనుమతించాలని ట్రంప్ ప్రభుత్వం చేస్తున్న ఒత్తిడికి తలొగ్గడానికి భారత్ అంగీకరించకపోవడం వల్లనే వాణిజ్య ఒప్పందం చర్చలు అసంపూర్తిగా ఉన్నాయి. చర్చల కొనసాగింపునకు అమెరికా అధికార బృందం ఆగస్టు 25 తదుపరి ఢిల్లీ రానుంది. ట్రంప్ పెనాల్టీ సుంకం అమలు తేదీ కూడా ఆగస్టు 27. వాణిజ్య ఒప్పందాన్ని తమకు సానుకూలం చేసుకునే వ్యూహంతోనే ఈ పెనాల్టీ విధించారని అర్థమవుతుంది. ట్రంప్ ఇటువంటి బ్లాక్ మెయిల్ ఎత్తుగడలు అన్ని దేశాలపైన ప్రయోగిస్తున్నారు.


భారత్ ఎగుమతులకు అమెరికా మార్కెట్ ప్రధాన క్షేత్రంగా ఉంది. 25 శాతం సుంకమే అధికం– భారత్ ఎగుమతులను దెబ్బతీస్తుంది. దానిపై మరో 25 శాతం పెనాల్టీ అంటే ఎగుమతి వ్యాపారులు లబోదిబోమంటున్నారు. లక్షలాది మంది కార్మికుల ఉద్యోగ భవిష్యత్ ప్రమాదంలో పడుతుంది. ఈ ఆందోళనకర పరిస్థితిపై ప్రభుత్వం నుంచి ఎవరైనా సమగ్రమైన ప్రకటన ఆశిస్తారు. కానీ ప్రధాని మోదీ గురువారం ఢిల్లీలో ఒక సభలో సమస్యను పక్కదారి పట్టించే త్యాగపూరితమైన ప్రకటన చేశారు. ''నేను వ్యక్తిగతంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని నాకు తెలుసు. కానీ మాకు రైతుల ప్రయోజనాలు అధిక ప్రాధాన్యం. రైతులు, పాడి పరిశ్రమ, మత్స్యకారుల ప్రయోజనాల విషయంలో భారత్ ఎన్నడూ రాజీపడదు'' అని అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి చిక్కుల నేపథ్యాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ శతజయంతి అంతర్జాతీయ మహాసభలో మోదీజీ ఈ ప్రకటన చేశారు. దౌత్యపరంగా తీవ్రమైన ఎదురు దెబ్బను భారత రైతుల్లో తన ప్రతిష్టను పెంచుకునేందుకు ఉద్దేశించిన గంభీర వ్యక్తీకరణగా మార్చుకున్నారు మోదీ. రైతుల పట్ల ఆయన ప్రేమ లోక విదితం. మూడు రైతు వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా రైతులు దేశవ్యాప్తంగా, ప్రత్యేకించి ఢిల్లీ సరిహద్దులో సంవత్సరం పైగా ఆందోళన చేస్తే, వందలాది మంది చనిపోగా, యుపి ఎన్నికల కోసం ఆ చట్టాలు ఉపసంహరించుకున్నారు. కానీ ఎంఎస్‌పికి లీగల్ గ్యారెంటీ, మృతి చెందిన రైతులకు పరిహారం వగైరా వాగ్దానాలను మర్చిపోయారు. రైతులు మళ్లీ ఆందోళన బాట పట్టినా నిర్లక్ష్యం, నిర్బంధం ఎదురైంది. వచ్చే 7–8 మాసాల్లో బీహార్, అస్సాం, కేరళ, పశ్చిమబెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా మోదీజీ తాను రైతు రక్షకుడినన్న సందేశం పంపారు. కావలసింది గిమ్మిక్కులు కాదు, వ్యూహాత్మకమైన కార్యాచరణ.

# అంతర్జాతీయ వ్యవహారాల్లో కొత్త ధృవాలు

ప్రపంచ భౌగోళిక, రాజకీయాల్లో వేగంగా మార్పులు వస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వాణిజ్య సుంకాల పెంపుదల బెదిరింపుల ద్వారా ఏకపక్ష ఆధిపత్యం కోసం తపిస్తున్నాడు. అందుకోసమే అనుంగు మిత్రులైన బ్రిటన్, యూరప్ రాజ్యాలతో, నాటోతో ఘర్షణకు దిగాడు. ముందు తలాయించినా యూరోపియన్ యూనియన్ నేతలు తమ స్వతంత్రతను చాటుకునే ప్రయత్నం చేస్తూనే, నెమ్మదిగా ట్రంప్‌తో సుంకాల పెంపుదల ఒప్పందాలకు, తమ జాతీయ రక్షణ వ్యయం పెంపుదలకు నాటోకు తమ కంట్రిబ్యూషన్ పెంపుదలకై ముందుకు వస్తున్నారు. రష్యా, చైనా సరేసరి, బ్రిక్స్‌లాంటి ఆర్థిక సహకార కూటములపై కత్తిదూస్తున్నాడు. డాలర్ ఆధిపత్యాన్ని కాదని బ్రిక్స్ దేశాలు తమ సొంత కరెన్సీలతో వ్యాపారం చేసుకోవటాన్ని కూడా సహించలేకపోతున్నాడు. అధికారం చేబట్టిన వారం రోజుల్లోనే గాజాపై ఇజ్రాయిల్, ఉక్రేన్–రష్యా యుద్ధాలను పరిసమాప్తం చేసి ప్రపంచ శాంతిదూత బిరుదును ఆశించిన ట్రంప్ గాజా విషయంలో సామ్రాజ్యవాద విస్తరణ ఆకాంక్షలతో ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణహోమాన్ని బలపరుస్తూ అభాసుపాలైనాడు. కాగా ఉక్రేన్–రష్యా యుద్ధం విషయంలో తొలుత ఉక్రేన్‌పై ఉరిమిన ట్రంప్, అరుదైన భూగర్భ ముడిపదార్థాల ఒప్పందం సాధించుకున్నాడు. ఆ తర్వాత కాల్పుల విరమణకు రష్యాపై ఒత్తిడి తెస్తున్నాడు. యుద్ధం ప్రారంభం కావటానికి మూలమైన సమస్యలు పరిష్కారం కాకుండా వెనక్కి తగ్గబోమని రష్యా అధ్యక్షుడు పుతిన్ స్పష్టం చేశాడు. రష్యాను దిగ్బంధించే దీర్ఘకాల వ్యూహంతో ఇయు ఉక్రేన్‌ను ముందుపెట్టి రష్యాపై యుద్ధం సాగిస్తున్న వాస్తవం ట్రంప్ కంటికి కనిపించదు. రష్యా భవిష్యత్‌తో ముడిపడిన ఉక్రేన్ యుద్ధం ట్రంప్ హుకుంలతో, జర్మనీలో అమెరికా అణ్వస్త్రాలు పెట్టే బెదిరింపులతో పరిష్కారమయ్యేది కాదు. పాకిస్థాన్, ఇజ్రాయెల్ నేతలు నోబెల్ శాంతి బహుమతికి డోనాల్డ్ ట్రంప్ పేరు నామినేట్ చేయటం ప్రత్యేకించి చెప్పుకోదగింది.

*ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్‌లు ఆఫ్రికా అభివృద్ధికి భాగస్వాములుగా గాక వనరుల తరలించుకుపోయేవారికి గేటు కాపలాదారుగా ఉన్నాయి. ఇది వలసవాదం అంతం కాలేదు, ఇంకా వృద్ధి చెందుతూ ఉందనే భావన కలుగజేస్తున్నది. రష్యా ఉక్రేన్‌తో యుద్ధం కారణంగా పశ్చిమ దేశాలనుంచి ఆర్థిక ఆంక్షలు, వెలివేత ఎదుర్కొంటున్న నేపథ్యంలో తెలివిగా ఈ మనోభావాల్లోకి ప్రవేశించింది. మెద్వెదేవ్ విజ్ఞప్తి ''వలసవాదం'' సిద్ధాంతకర్తలను, ''సమాన భాగస్వాములను'' ప్రస్తావించింది.*

సుంకాలు, ఉక్రేన్–రష్యా యుద్ధం విషయాల్లో ట్రంప్ ఏకపక్ష ఆదేశాలు, బెదిరింపులు రష్యా–చైనాలను మరింత దగ్గర చేశాయి. అమెరికా డిమాండ్‌లు అంగీకరిస్తూ వాణిజ్య ఒప్పందానికి భారత్ రానందున తన 'మిత్రుడు' నరేంద్రమోదీపై ఆగ్రహిస్తూ ట్రంప్ భారత్‌పై 25 శాతం సుంకాలు పెంచటమే కాకుండా, రష్యా నుంచి ఆయిలు కొంటున్నందుకు అదనపు పెనాల్టీ కింద మరో 25 శాతం వెరసి 50 శాతం సుంకాలు విధించారు. మిత్రరాజ్యాలు, శత్రురాజ్యాలను ఒకేగాటన గట్టి అమెరికా వాణిజ్యలోటును తగ్గించుకోవటమే ట్రంప్ 'అమెరికా గ్రేట్ ఎగైన్' పిలుపు ధ్యేయంగా




కనిపిస్తున్నది. అయితే దిగుమతులపై ఇష్టారాజ్యంగా సుంకాలు పెంచటంవల్ల ఆ భారం అమెరికన్ వినియోగదారులపై పడుతుందని ఆయన గ్రహించటం లేదు. సంపన్నులకు పన్ను రాయితీలు, సామాన్యులపై భారాలు మోపే ఆయన విధానం అమెరికన్ ప్రజల్లో అసంతృప్తి పెంచుతున్నది. అయితే ప్రతిపక్ష డెమొక్రటిక్ పార్టీ నాయకత్వ లేమితో దాన్ని ఉపయోగించుకునే స్థితిలో లేకపోవటం ట్రంప్‌కు కలిసొస్తున్న అంశం.

### ఆఫ్రికాపై రష్యా కన్ను

రష్యా మాజీ అధ్యక్షుడు, ప్రస్తుతం రష్యా భద్రతా మండలి ఉపాధ్యక్షుడు ద్మిత్రీ మెద్వెదేవ్ జులై 27న దక్షిణాఫ్రికాలో విముక్తి ఉద్యమాల అగ్రనాయక సమావేశంలో ప్రసంగించారు. ''నయా వలసవాదానికి వ్యతిరేకంగా పోరాటంలో రష్యా ఆఫ్రికాతో నిలబడుతుంది. బహుళపక్ష ప్రపంచాన్ని కోరుకుంటున్నాం'' అని మెద్వెదేవ్ ప్రకటించారు. దీనివెనుక చారిత్రక సంబంధం, వాస్తవ రాజకీయం ఉంది. ఈ సమ్మిట్ వలసవాద వ్యతిరేక మూలాలున్న పాలక పార్టీలను – దక్షిణాఫ్రికా ఎఎన్‌సి, జింబాబ్వే జను – పిఎఫ్, మొజాంబిక్ ఫ్రిలిమో, నమీబియా స్వాపో, టాంజానియా సిసిఎంలను ఒక వేదికమీదకు తెచ్చింది. విముక్తి యుద్ధాల అగ్నిజ్వాలలనుంచి రాటుదేలిన ఈ పార్టీలకు ఆనాడు సోవియట్ యూనియన్ ఆయుధాలు, భావజాల తోడ్పాటిచ్చింది. మెద్వెదేవ్ ఈ పార్టీలను సార్వభౌమత్వం, అభివృద్ధిలో ప్రగతిశీలతకు సంరక్షకులుగానే గాక, వాటి న్యాయబద్ధత చరిత్రలోనే గాక, భవిష్యత్ ప్రపంచం బహుళత్వంలో కూడా ఉంటుందన్నారు.

ఆఫ్రికాలో వలసపాలన ముగిసిన తదుపరి ఏర్పడ్డ అసంతృప్తిలోకి రష్యా అడుగుపెడుతున్నది. అనేక ఆఫ్రికా దేశాలకు రాజకీయ స్వాతంత్ర్యం ఆర్థిక సార్వభౌమత్వంలోకి మారలేదు. యూరోపియన్‌లు వెళ్లిపోయి దశాబ్దాలు గడిచినా భూగర్భ వనరులు వెలికితీయటంలో పశ్చిమదేశాల బహుళజాతి కార్పొరేషన్‌లదే ఇప్పటికీ ఆధిపత్యం. ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్‌లు ఆఫ్రికా అభివృద్ధికి భాగస్వాములుగా గాక వనరుల తరలించుకుపోయేవారికి గేటు కాపలాదారుగా ఉన్నాయి. ఇది వలసవాదం అంతం కాలేదు, ఇంకా వృద్ధి చెందుతూ ఉందనే భావన కలుగజేస్తున్నది.రష్యా ఉక్రేన్‌తో యుద్ధం కారణంగా పశ్చిమ దేశాలనుంచి ఆర్థిక ఆంక్షలు, వెలివేత ఎదుర్కొంటున్న నేపథ్యంలో తెలివిగా ఈ మనోభావాల్లోకి ప్రవేశించింది. మెద్వెదేవ్ విజ్ఞప్తి ''వలసవాదం'' సిద్ధాంతకర్తలను, ''సమాన భాగస్వాములను'' ప్రస్తావించింది. విదేశాంగ మంత్రి లెవరోవ్ కూడా అదే బాణీలో మాట్లాడుతూ, పశ్చిమ దేశాల ఆర్థిక దోపిడీని విమర్శించారు. ఈ ప్రసంగాలు పశ్చిమ దేశాల నాయకత్వం వహిస్తున్న ఆర్థిక వ్యవస్థ రీతి గూర్చి అసంతృప్తితో ఉన్న ఆఫ్రికన్ నాయకుల మనస్సులను తాకింది.

### ఇయు–చైనా సమ్మిట్

యూరోపియన్ యూనియన్, చైనా ప్రజారిపబ్లిక్ మధ్య 2025 శిఖరాగ్ర సభ జరిగింది. ఈ ప్రకటన దాని అంతిమ నిర్ధారణతో సమానం. వాస్తవంలో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి, సంబంధాలు సజావుగా లేవు. ఈ పరిస్థితుల్లో ఈ సమావేశం జరగటమే విశేషం. ఇది బ్రస్సెల్స్, బీజింగ్ రెండింటికీ ముఖ్యం. ఏదో జరిగిపోతుందని ఏ పక్షమూ ఆశించలేదు. ఇయు అంచనా ప్రకారం గణనీయ ఫలితాలు సాధించటంలో ఈ సమావేశం విఫలమైంది. ''చైనాతో అరమరికలు లేని సంభాషణ అవసరం. దానికి దగ్గరలో ఉన్నట్లు నటించలేము'' అన్నాడు ఇయు విదేశీ వ్యవహారాల ప్రతినిధి జోసెఫ్ బొరెవ్. ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, స్పెయిన్ అభిప్రాయాల్లో చైనాతో భిన్నత్వమే ఎక్కువ. చెక్ రిపబ్లిక్, లిత్వేనియా, ఎస్తోనియా, లాత్వియా భద్రత, రాజకీయ ప్రభావం విషయాల్లో బీజింగ్ ప్రభావం పట్ల సందేహాలు వ్యక్తం చేశారు. డేనిష్ డిఐఐఎస్, స్వీడిష్ యుఐఈ వంటి స్కాండినేవియన్ థింక్ టాంక్‌లు కీలకమైన రంగాల్లో చైనాపై అతిగా ఆధారపడటం మంచిది కాదన్నాయి. బీజింగ్ దృష్టిలో ఈ అగ్రనాయక సమావేశం అమెరికాతో సంబంధం లేకుండా యూరప్‌తో స్వతంత్రమైన కమ్యూనికేషన్ ఛానల్ అస్థిత్వాన్ని ధృవీకరించింది. ఇయు అమెరికా ఒత్తిడి లేకుండా స్వతంత్రమైన విదేశాంగ విధానం అనుసరిస్తున్నట్లు సిన్హువా వార్తా సంస్థ విశ్లేషించింది. 'యూరప్‌కు నిజమైన ప్రమాదాలు చైనా నుండి రావు – దాని ప్రచ్ఛన్నయుద్ధ మనస్తత్వం నుండి వస్తుందని'' హెచ్చరించింది. భిన్నమైన అభివృద్ధి నమూనాల గుర్తింపు, యూరప్–అమెరికా విధానాల మధ్య వ్యత్యాసాలను సమ్మిట్ డిక్లరేషన్‌లో చొప్పించే ప్రయత్నం జరిగింది. ఇది పశ్చిమదేశాలను విభజించే బీజింగ్ వ్యూహం.

### చైనా ఎఐ దౌత్యం

జులై 26న షాంఘైలో అట్టహాసంగా జరిగిన ప్రపంచ ఆర్టిఫిషియల్ మేథస్సు (ఎఐ) మహాసభ, ఎఐ గవర్నెన్స్‌పై ఉన్నతస్థాయి సమావేశంలో, చైనా తమ ఎఐ ప్రణాళికలను వెల్లడించింది. ప్రపంచ ఎఐ సహకార సంస్థను ఆరంభంలో షాంఘైలో నెలకొల్పేందుకు ప్రయత్నించింది. ఈ ప్రతిపాదనలు చైనా ఆత్మవిశ్వాసాన్నేగాక, ప్రపంచ పేద దేశాలకు ప్రయోజనకరంగా ఎఐను ముందుకు గొనిపోయేందుకు దాని సుముఖతను వెల్లడించింది. ప్రధాని లీ క్వియాంగ్ తమ ప్రారంభోపన్యాసంలో, ఇప్పుడు భిన్నమైన నియంత్రణ యంత్రాంగాలతో 'చీలికలుగా' ఉన్న ఎఐ గవర్నెన్స్ స్థానంలో దాన్ని బాధ్యతాయుతంగా అభివృద్ధి చేయటం, వినియోగించటానికి స్థూల ఏకాభిప్రాయం, ఏకీకృత ప్రమాణాలు అవసరమన్నారు. ''సాంకేతిక గుత్తాధిపత్యంతో'' ఎఐ కొన్ని దేశాల, కంపెనీల ప్రత్యేక ఆస్తి కాకూడదన్నారు. చైనా కంపెనీ హువాయి క్లౌడ్ మాట్రిక్స్ 384 సిస్టంను ఆవిష్కరించటంతో ఎఐలో చైనా ఇప్పటికే చాలా ముందు ఉన్నట్లు రుజువైంది. ఇప్పుడున్న ప్రశ్న – ఇతర దేశాలు ప్రపంచ ఎఐ సహకార సంస్థ ప్రతిపాదనను అందుకుంటాయా, ప్రపంచ స్థూల ఏకాభిప్రాయాన్ని నిజంగా ప్రతిబింబించే గవర్నెన్స్ చట్రం నిర్మాణంలో పాల్గొంటాయా? చైనా షాంఘైలో ప్రతిపాదించింది కేవలం విధానం కాదు, ఆహ్వానం. అందులో చేరాలో లేదో ప్రపంచ దేశాలు నిర్ణయించుకోవాలి.

**(ఐపిఎ సర్వీస్)**

# శాలువాలు మహిళా ప్రయాణికులకు, శిక్షలు డ్రైవర్, కండక్టర్లకా?



ఎస్.బాబు
(టిజిఎస్‌ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు)

తెలంగాణ ఆర్టీసిలో మహిళలకు ఉచిత ప్రయాణం అనే మహాలక్ష్మి పథకం 2023 డిసెంబర్ 9న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన ఈ పథకం సూపర్ డూపర్ హిట్ అయింది. ఒకరకంగా చెప్పాలంటే బాలయ్య బాబు నటించిన వీర సింహారెడ్డి సినిమా లాగా ఈ పథకం బ్లాక్ బస్టర్ అయింది. ఆ సినిమా 100 కోట్లు సంపాదిస్తే, ఈ మహాలక్ష్మి పథకం 200 కోట్లు సంపాదించింది. 200 కోట్ల జీరో టికెట్లు ఈ స్కీమ్ ద్వారా జారీ అయ్యాయని ప్రభుత్వం సంబరాలు చేసింది. వీర సింహారెడ్డి సినిమాలో సిస్టర్ సెంటిమెంట్ బాగా పండింది. ఈ పథకం ప్రవేశపెట్టిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మహిళలు మా రేవంతన్న అని పిలుచుకుంటున్నారు. బాలయ్య సినిమాలో లాగా ముఖ్యమంత్రి కూడా సిస్టర్ సెంటిమెంటును బాగానే పండించారు. మహిళా ప్రయాణీకులకు కాంగ్రెస్ ప్రభుత్వం దుశ్శాలువలతో సన్మానం చేసింది. ఆర్టీసిలో డ్రైవర్ కండక్టర్లకు కూడా సన్మానం చేశారు. ఇది స్వాగతించాల్సిన విషయమే. కాని ఇది నాణేనికి ఒక వైపు.


ఇప్పుడు నాణానికి మరోవైపు ఏం జరిగిందో చూద్దాం. మహాలక్ష్మి పథకం విజయవంతం కావడానికి ఆర్టీసి కార్మికుల శ్రమ, కృషి ఎంతో ఉన్నాయి. ముఖ్యంగా చెప్పాలంటే డ్రైవర్, కండక్టర్లు పోషించిన పాత్ర ఎనలేనిది. కొంతమంది మహిళలు బస్సు ప్రయాణంలో చిచ్చరపిడుగుల్లా రెచ్చిపోయి, ఆధార్ కార్డు అడిగినందుకు కండక్టర్లపై పిడిగుద్దులు కురిపించారు. ఇదేమిటని ప్రశ్నిస్తే, ప్రభుత్వం ఉచిత ప్రయాణానికి అనుమతించింది, ఎక్కువ మాట్లాడితే తొక్కి నార తీస్తామంటున్నారు. ఈ మహిళలలో కొందరికి తైక్వాండో, కుంగ్ ఫూ, కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్‌లో ప్రవేశం ఉన్నట్లు కనిపిస్తోంది. ఎందుకంటే, సిటీలో 40 కి.మీల వేగంతో వెళుతున్న బస్సును వారు ఆపమన్న వెంటనే ఆపలేదని, ఒక మహిళా ప్రయాణికురాలు సివంగిలా ఊగిపోతూ డ్రైవర్ మెడ పూసలు విరిగేలా కొడితే ఆ దెబ్బకి అతను మెడికల్ అన్‌ఫిట్ అయ్యాడు. ఆ దెబ్బల భయానికి డ్రైవర్, కండక్టర్లు డ్యూటీ చేయాలంటే పార్కిన్సన్స్ వ్యాధి సోకిన వారిలా గంటకు 100 కిలోమీటర్ల వేగంతో వణికిపోతున్నారు. ఆస్ట్రేలియాలో కంగారు జంతువులుంటాయని మనకు తెలుసు. అవి తమ పిల్లలను ఉదరంలో దాచుకోవటం కూడా చూశాం. దానికి అది ప్రకృతి ఇచ్చిన సౌకర్యం. పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణిస్తున్న కొంతమంది మహిళా ప్రయాణీకులు తమ చిన్నారి కొడుకులను కంగారుల్లా దాచేస్తుంటారు. చెకింగ్ అధికారుల తనిఖీ సమయంలో వారు బుడుంగున కొంగు చాటు నుంచి రాంగ్ ఎంట్రీ ఇస్తుంటారు. వారికి హాఫ్ టికెట్ తీసుకోలేదని కండక్టర్‌పై చెకింగ్ అధికారులు ఎలైటింగ్ పాయింట్‌లో ఫేర్ కలెక్టెడ్ కేసు వ్రాస్తున్నారు. పిల్లవాడి రాంగ్ ఎంట్రీకి, టి.టి.ఐల రాతలకి కండక్టర్ల తలరాతలు మారిపోతాయి. కొంతమంది ప్రయాణీకులు తమ భర్త వెనక ఉన్నాడని, ఆధార్ కార్డు ఆయన వద్దే ఉన్నదని, టికెట్ అక్కడే తీసుకుంటారని చెప్తుంటారు. కండక్టర్ అక్కడికి వెళ్లి మహాలక్ష్మి జీరో టికెట్ మరియు ఫేర్ టికెట్ ఆయనకి ఇస్తాడు. బస్‌స్టాండ్ రాకముందే మధ్యదారిలో ఆవిడ దిగిపోతుంది. బస్‌స్టాండ్ ఎలైటింగ్ పాయింట్ లో చెకింగ్ వారికి ఆ మహిళ భర్త ఫేర్ టికెట్ బదులు జీరో టికెట్ చూపిస్తాడు. ఇంకేంటి? కండక్టర్ ఖేల్ ఖతం, దుకాణం బంద్. డబ్బులు తీసుకుని మహాలక్ష్మి జీరో టికెట్ ఇచ్చాడని కేసు రాస్తున్నారు. ఇలాంటి కేసుల్లో డిపో మేనేజర్లు వాస్తవాన్ని ఆలోచించకుండా వారిని డిపో స్పేర్ పెట్టి, తరువాత సస్పెండ్ చేసి, ఆ తరువాత ఉద్యోగంలోంచి తొలగిస్తున్నారు. ఇందులో కండక్టర్ తప్పిదం ఏముంది? దీనికి ఓ సంవత్సరం పాటు ఆ కండక్టర్ కుటుంబ పరిస్థితి అన్నమో రామచంద్రే. చేయని నేరానికి వారు శిక్షింపబడుతున్నారు. మహాలక్ష్మి టికెట్ అంటే అట్లుంటది. ఈ స్కీములో జరిగిన కేసులపై శిక్షలు చాలా వేగంగా అమలు జరుపుతున్నారు. ఓ భార్య భర్తను చంపి తన ఇంటికే డోర్ డెలివరీ చేసిన విషయాన్ని పత్రికల్లో చదివాం. ఆర్టీసి అధికారులు కూడా డ్రైవర్, కండక్టర్లను జీరో టికెట్ కేసులలో రిమూవల్ ఆర్డర్స్‌ను స్పీడ్ పోస్టులో డోర్ డెలివరీ చేస్తున్నారు. అనిల్ అంబాని 48 వేల కోట్ల రూపాయలు ఎగ్గొట్టి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాని మోసం చేశాడు. విజయ్ మాల్యా 9 వేల కోట్ల రుణాలు ఎగ్గొట్టి లండన్‌లో లలిత్ మోడీతో కలిసి మైఖేల్ జాక్సన్‌లా వెస్ట్రన్ డాన్స్ చేస్తున్నాడు. అటువంటి ఆర్థిక నేరగాళ్ళకు లేని శిక్ష, ఆర్టీసి డ్రైవర్ కండక్టర్లకుంటుంది. అదీ ఆర్థిక నేరమే, ఇదీ ఆర్థిక నేరమే. మహాలక్ష్మి టికెట్ అడగాలన్నా, జారీ చేయాలన్నా డ్రైవర్ కండక్టర్ల పరిస్థితి పురానా హవేలీలో అడుగు పెట్టినట్లుంటుందని వారు వాపోతున్నారు.

టికెట్లు జారీ చేస్తున్న సందర్భంలో టిమ్ మెషిన్‌పై ఉన్న కీబోర్డులో ఫేర్ టికెట్ బటన్, జీరో టికెట్ బటన్ రెండూ జంట నగరాల్లా పక్క పక్కనే ఉంటాయి. బస్సులో ఎక్కే ప్రయాణీకులు 90 శాతం మంది మహిళలే. వారికి జీరో టిక్కెట్లే జారీ చేయాలి. ఆ క్రమంలో ఒకటో అరో ఫేర్ టికెట్ ఇవ్వాల్సి వస్తుంది. అలవాటులో పొరపాటుగా ఫేర్ టికెట్‌కు బదులు జీరో టికెట్ ఇవ్వడం జరుగుతోంది. రెండు కీ బటన్లు పక్క పక్కనే ఉన్నందున ఈ పొరపాట్లు జరుగుతున్నాయని కండక్టర్లు వాపోతున్నారు. శిక్షలు విధించే డిపో మేనేజర్‌కి ఆ టిమ్ మెషిన్ ఇచ్చి 90 జీరో టికెట్లు ఇచ్చిన తరువాత 91వ టికెట్ ఫేర్ టికెట్ ఇవ్వాల్సి వస్తే ఆయన వేళ్ళు కూడా ముందుగా జీరో కీ మీదనే ప్రెస్ చేస్తాయి. ఈ రీజనింగ్ తెలిసినా డ్రైవర్, కండక్టర్లను రిమూవల్ చేస్తూనే ఉన్నారు. ఈ తప్పును నివారించాలంటే టిమ్ మెషిన్‌లో 'కీ' బటన్స్ మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరో సందర్భంలో టిమ్ మెషిన్‌లోని సాంకేతిక లోపం కారణంగా ఫేర్ టికెట్ బటన్స్ ప్రెస్ చేసినా జీరో టికెట్ జారీ అయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని డ్రైవర్, కండక్టర్లు చెబుతున్నారు. సాంకేతిక లోపాలు సవరించండి అని యాజమాన్యానికి చెప్పినా వారు పట్టించుకోకపోవటం వల్ల బలి అయ్యేది డ్రైవర్, కండక్టర్లే. అందుకే టిమ్ మెషీన్ల మెయింటనెన్స్ రెగ్యులర్‌గా జరిగితే ఈ సాంకేతిక లోపాలకు చెక్ పెట్టవచ్చు. ఏ డ్రైవర్, కండక్టర్ కావాలని ఫ్రాడ్ చెయ్యరు. వారి కుటుంబాలను ఆర్థిక ఇబ్బందులలోకి నెట్టు కోరు. నేరం చిన్నదైనా, పెద్దదైనా డ్రైవర్ కండక్టర్లను సస్పెండ్ చేస్తున్నారు, ఉద్యోగాల నుండి తొలగిస్తూనే ఉన్నారు. రీజియన్లలో మహాలక్ష్మి అప్పీల్ కేసులు కూడా రిజెక్ట్ అవుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిలో ఇద్దరు ఇంజనీర్లు 400 కోట్లు ఫ్రాడ్ చేశారు అని ఎసిబి గుర్తించినా ప్రభుత్వం వారిని ఇంతవరకు డిస్మిస్ చేయలేదు. కాని ఆర్టీసి డ్రైవర్, కండక్టర్లను మాత్రం యాజమాన్యం శిక్షిస్తూనే ఉంది. దేశంలో ఇంత వేగంగా క్రమశిక్షణా చర్యలు తీసుకునే డిపార్ట్‌మెంట్ మరొకటి లేదంటే అతిశయోక్తి కాదు. దశాబ్దకాలం గడిచిపోతున్నా లలిత్ మోదీ, నీరవ్ మోదీ, విజయ్ మాల్యా లాంటివారిని కేంద్ర ప్రభుత్వం ఇంతవరకు భారతదేశానికి రప్పించలేకపోయింది. ఎన్‌ఐఎ, ఇడి, మోదీ ఎవరూ కూడా వారిని కదిలించలేకపోయారు. వారిని పట్టుకుని శిక్షించే అధికారం కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ఆర్టీసి అధికారులకు ఇస్తే, 48 గంటలలోపే పల్లెవెలుగు బస్సులను పంపి పట్టుకొచ్చి పనిష్మెంట్ ఇస్తారు. వారేమైనా ఎక్కువగా మాట్లాడితే ఇన్ సబార్డినేషన్ కేసు పెట్టి విచారణ చేయకుండా వారి తలరాత మార్చేస్తారు. ఒక్క అవకాశం ఇచ్చి చూడండి. సెంట్రల్ గవర్నమెంట్ ఇడి చేయలేని పని ఆర్టీసి ఇడిలు చేయగలరు. డ్రైవర్, కండక్టర్లు ఒక్క చిన్న పొరపాటు చేసినా లేక ప్రయాణికులు పొరపాట్లు చేసినా తప్పు డ్రైవర్, కండక్టర్లదే అంటూ ఆర్టీసి అధికారులు శిక్షిస్తారు. అంటే ఇక్కడ మనకి ఆవు గడ్డి మేయును అనే కథ గుర్తుకు వస్తుంది. అంటే ఇక్కడ కామన్ పాయింట్ డ్రైవర్, కండక్టర్లను శిక్షించడం. ప్రధానమంత్రి మోదీ 11 ఏళ్ళలో 33 తప్పులు చేశారు. అయినా ఆయనకి ఏ శిక్షా లేదు. ముఖ్యంగా ఆయన చేయించిన సర్జికల్ స్ట్రైక్ దేశంలో ఎవరికీ తెలియదు. ముందస్తు సమాచారం కూడా లేదు. అదే ఆర్టీసిలో డ్రైవర్ కండక్టర్లు ఇలా సమాచారం లేకుండా ఆబ్సెంట్ అయితే ముందస్తు సమాచారం ఇవ్వలేదని రిమూవల్ ఫ్రం సర్వీస్ చేస్తారు. 2016 లో మోదీ డీమానిటైజేషన్ చేసినప్పుడు దేశంలో 64 మంది ఎటిఎం, బ్యాంకుల వద్ద క్యూలో నిలబడి చనిపోయారు. దీనివల్ల ప్రజలకు అసౌకర్యం కలిగిందని, ఆయనకు ఛార్జిషీట్ కూడా ఇవ్వలేదు. ఈ కేసులో రాష్ట్రపతి ఆయనకు కనీసం పే రిడక్షన్ కూడా చేయలేకపోయారు. అదే ఆర్టీసి అధికారులైతే ఇలా జనాన్ని చంపినందుకు లాక్ ఆఫ్ యాంటిసిపేషన్ అని, ఆర్టీసి ఇమేజ్ డ్యామేజి అయిందని ఉద్యోగం ఊడగొడతారు. మోదీ అదృష్టవంతుడు, ఆర్టీసికి చిక్కలేదు.




కెసిఆర్ రైతుబంధు పథకం పెట్టి రాజు, పేద అనే తేడా లేకుండా అందరికీ అమలు చేశారు. జమీందార్లు, ఎమ్మెల్యేలు, మంత్రు లు అందరూ ఈ పథకం వల్ల లబ్ధి పొందినవారే. దీనివల్ల గవర్నమెంటుకి ఎలాగైతే నష్టం జరిగిందో, అలాగే ఈ మహాలక్ష్మి పథకం వల్ల కూడా ప్రభుత్వానికి నష్టం జరుగుతోంది. ఈ పథకం పేదలకి అమలు చేస్తే బాగుండేది. టీచర్లు, కార్పొరేట్ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులకు కూడా అమలు జరుగుతోంది. కొంతమంది మహిళా టీచర్లు, లెక్చరర్లు మాకొద్దు ఈ మహాలక్ష్మి పథకం అంటూ టికెట్ తీసుకుని ప్రయాణం చేస్తున్నారని కండక్టర్లు చెప్తున్నారు. కాబట్టి రైతుబంధులా కాకుండా ఏ కులమైనా, ఏ మతమైనా ఆర్థికంగా పేదవారికి అమలు చేస్తే బాగుంటుందనే కొందరు ప్రజలు అంటున్నారు. మహాలక్ష్మి జీరో టికెట్‌పై జరుగుతున్న తప్పిదాలు ఆపాలంటే ఉచిత బస్ పాసులు ఇచ్చినట్లుగా ఆ మహిళలకు ఒక స్మార్ట్‌కార్డు ఇస్తే సరిపోతుందని, దానివల్ల మహిళలకు, డ్రైవర్, కండక్టర్లకు గొడవలు జరగవని సిబ్బంది అభిప్రాయపడుతున్నారు. మహాలక్ష్మి పథకంలో జీరో టికెట్ తప్పిదాలపై ప్రతి రీజియన్‌లో సుమారు 10 మంది డ్రైవర్, కండక్టర్లు రిమూవల్ ఫ్రం సర్వీస్ అయ్యారు. ఒకపక్కన ప్రభుత్వం ఈ పథకం విజయవంతం అయిందని సంబరాలు చేసుకుంటుంటే, అదే పథకానికి బలైన ఆర్టీసి డ్రైవర్, కండక్టర్లు ఉద్యోగాలు పోగొట్టుకుని, తిండీ తిప్పలు లేక, బ్రతుకుతెరువు లేని పరిస్థితులలో, నిరాశ నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్నారు. అక్కడేమో సంబరాలు, శాలువలు, ఇక్కడేమో ఉద్యోగాల ఊచకోతలు. ఇదెక్కడి న్యాయమని కార్మికవర్గం వాపోతోంది. మహాలక్ష్మి టికెట్లలో జరిగిన తప్పిదాలపై చర్యలు తీసుకోకుండా, ఆర్టీసి యాజమాన్యం సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తారని వారు కోరుతున్నారు. ఆర్టీసి అధికారులు ఆ దిశగా ఆలోచిస్తారని ఆశిద్దాం.

## తోబుట్టువుల పండుగ 'రాఖీ'



అన్నాచెల్లెలు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పౌర్ణమి. రాఖీ పండుగనే రక్షా బంధన్ అని కూడా పిలుస్తారు. రాఖీ పండుగ శ్రావణ మాసంలో వస్తుంది. దీనినే జంధ్యాల పూర్ణిమ అని కూడా పిలుస్తారు. సోదరి, సోదరుల ప్రేమానురాగాలకు గుర్తుగా ఈ పండుగను ఘనంగా నిర్వహించుకుంటారు. అన్నకు తమ్మునికి తోడ పుట్టిన సోదరిలు, ఆత్మీయ సోదరిలు ప్రేమ ఆప్యాయతలు పంచుతూ రాఖీ కడుతారు. రాఖీ పండుగను దేశ వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటారు. అదే విధంగా ఈ పండుగను జైన మతం పూజారులు భక్తులకు ఉత్సవ దారాలను అందజేస్తారు. సోదర, సోదరీమణుల ప్రేమకు అంకితం చేసింది. సిక్కులు రఖార్ది లేదా రఖారీగా నిర్వహించుకుంటారు. రాఖీ అనగా రక్షణ బంధం గుర్తుకు వస్తుంది. రక్షా బంధన్ అనే పదం సంస్కృతంలో రక్షణ ముడి అని అంటారు. సోదరిలు తన సోదరుడి మణికట్టు చుట్టూ రంగురంగుల పత్తి, కృతిమ పువ్వుల దారాన్ని ప్రేమతో కడుతుంది. సోదరులు తమ సోదరికి వారి ఆర్థిక స్థాయిన్ని బట్టి బహుమతి ఇస్తారు. సోదరుడు ఎంత విలువైన బహుమతి ఇచ్చాడని సోదరి చూడదు తనపై ఎంత ప్రేమానురాగాలు పంచాడనేది ఆమెకు ముఖ్యం. రక్షా బంధన్ పురాతన కాలం నుండి ఉందని పలు ఆధారాలున్నాయి. క్రీస్తుపూర్వం 326 నాటి అలెగ్జాండర్ ది గ్రేట్‌కు సంబంధించిన ఇతిహాసాలు తెలుపుతున్నాయి. ద్రౌపది కృష్ణుడికి రాఖీ కట్టిందని మహా భారతంలో ఉంది. ద్రౌపదిని కష్టకాలంలో ఉన్నప్పుడు కృష్ణుడు తోబుట్టువుగా ధైర్యం ఇచ్చాడని కథలు ఉన్నాయి. మొఘల్ చక్రవర్తి హుమాయున్‌కు మేవార్ రాణి కర్ణావతి రాఖీ పంపి తన రాజ్యాన్ని రక్షించమని కోరగా హుమాయున్ ఆమె విన్నపమును గౌరవించి ఆమెకు యుద్ధములో చేయూతకై సైన్యాన్ని ఇచ్చారని చరిత్ర తెలియజేసింది. రాఖీ పండుగను సోదరి, సోదరుల మధ్య రక్షణ, ప్రేమ బంధానికి ప్రతీకగా జరుపుకుంటారు. రాఖీ పూర్ణిమా సోదర, సోదరులు తీపి పంచుకుంటూ జరుపుకునే పండుగా, చిన్ననాటి జ్ఞాపకములతో ఇంట్లో బంధాలు బలంగా ఉండాలని ఈ పండుగ చేసుకుంటారు. అక్క చెల్లి తన అన్న తమ్ముడు ఆర్థిక, రాజకీయ, సామాజికంగా ఎదగాలని ఆ భగవంతుడిని కోరుకుంటూ రాఖీ కడుతుంది. వర్షాకాలం వరదలతో కొంత ఆస్తి నష్టం కూడా జరుగుతుంది. ప్రకృతి కూడా సహకరించాలని వేడుకుంటూ శుభాలు జరగాలని రాఖీ పౌర్ణమి తెలుపుతుంది. మానవుడు జీవితంతో కొత్త ఆలోచనలతో గెలుపు వైపు ప్రయాణించాలని సూచిస్తుంది. రాఖీ పూర్ణిమను దేశ నలుమూలల ప్రజలు ఘనంగా జరుపుకుంటారు. ముఖ్యంగా గుజరాత్ రాష్ట్రంలో పెద్ద ఎత్తున చేసుకుంటారు. రాఖీ పౌర్ణమి రోజున ప్రతి ఇంట్లో పండుగ వాతావరణంతో బంధాలు చిగురిస్తాయి. పెరిగిన పోటీ ప్రపంచంలో అందరూ బీజీ లైఫ్‌లో ఉన్నారు. ఇలాంటి పండుగ సందర్భాలలో అయినా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలి. కొన్ని అయితే బంధాలు చిన్నపుడు సోదరి, సోదరుల ప్రేమ, అప్యాయతలు చూసే వాళ్ళకి కూడా వీళ్లు ఇంత అన్యోన్యతగా ఉన్నారు ఎంటని అనుకునేల బాల్యంలో గడుపుతారు పెరుగుతున్న క్రమంలో బం ధాలు బలహీనం అవుతున్నాయి. బయటి స్నేహితుల లాగా పలకరింపులకే పరిమితమైతున్నారు. సోదరి, సోదరులు బాగోగులు తెలుసుకోవడం లేదు. తోబుట్టువుల బాధ్యత మనది అని భావించాలి అప్పుడే బంధాలు బలంగా ఉంటాయి. సాధ్యమైనంత వరకు కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా గడపాలి. అన్నాచెల్లెలు, అక్కా తమ్ముడు కష్టసుఖాలలో తోడునీడగా ఉండాలి. నేడు బంధాలు చాలా వరకు చిన్న చిన్న మనస్పర్థలతో విడిపోయి రాఖీ పౌర్ణమికి దూరమైతున్నారు. ఈ సృష్టిలో ఏది శాశ్వతం కాదని తెలుసుకుని ఉన్న అన్ని రోజులు కలిసిమెలిసి జీవిస్తూ బంధాలను బలోపేతం చేయాలి. ప్రతి ఒక సోదరి సాధ్యమైనంత వరకు విభేదాలు పక్కన పెట్టి సోదరులకు రాఖీ కట్టి వారి అండదండలు ఉండాలని కోరుకుంటూ సోదరులకు శుభాలు కలగాలని దీవించాలి.

– మిద్దె సురేష్
9701209355

## మక్తల్ తహసీల్దార్‌కి వినతి

**ప్రజాపక్షం/ మక్తల్ :** ప్రజా సంఘాలు (అంబేద్కర్ యువజన సంఘం, మక్తల్, ఎమ్మార్పీఎస్, కేవీన్ పి ఎస్, బిఎస్‌పి) ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రుద్ర సముద్రం గ్రామంలో రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డా॥ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను అరెస్టు చేసి కేసులు నమోదు చేయాలని మక్తల్ మండల తహసిల్దార్ కి మెమోరాండం అందజేశారు. తహాసిల్దార్ వెంటనే పోలీసులకు , పై అధికారులకు విషయాన్ని తెలియజేసి చర్యలు చేపట్టేలా కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ జన సంఘం, మక్తల్ అధ్యక్షులు పృథ్వీరాజ్, ఎమ్మార్పీఎస్ జీర్గల్ నగేష్ మాదిగ, బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి చంద్రశేఖర్, కేవీన్‌పిఎస్ విజయ్ కుమార్, అంబేద్కర్ యువజన సంఘం మక్తల్ సలహాదారులు డిహెచ్డి పోలప్ప, అంబేద్కర్ యువజన సంఘం ఉప్పరపల్లి అధ్యక్షులు బాలకృష్ణయ్య, అంబేద్కర్ యువజన సంఘం రుద్రసముద్రం అధ్యక్షులు రాములు,రుద్ర సముద్రం అంబేద్కర్ యువజన సంఘం నాయకులు మారుతీ, నరసింహులు, జనార్ధన్, ఆంజనేయులు, రామలింగప్ప, నాగరాజు, శివకుమార్, విష్ణు, రోహిత్, హరీష్, రాజు, శివలింగప్ప, ఆనంద్, రాము, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థినికి ఉత్తమ పురస్కారం అందజేసిన కలెక్టర్



**ప్రజాపక్షం / కొత్తకోట :** కొత్తకోట మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల విద్యార్థిని పల్లెపాగ సౌమ్యకు ఉత్తమ పురస్కారం లభించింది. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కొత్తకోట గురుకుల పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని స్యౌ బుధవారం చేనేత కార్మిక అంశాలపై మాట్లాడారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆమెను గురువారం అభినందించి పాఠశాల ఉపాధ్యాయురాలు, అధికారులతో కలిసి పురస్కారం అందజేశారు. గత కలెక్టర్ తేజస్ నందలాల్, పవార్ చేతుల మీదుగా కూడా పురస్కారం అందుకున్న పల్లెపాగ సౌమ్యను పలువురు కొనియాడుతున్నారు.

## ప్రజాసమస్యలపై వర్గపోరాటాలకు సిద్ధం కావాలి



**ప్రజాపక్షం/ఊర్కొండ :** ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సిపిఐపార్టీ ఆధ్వర్యంలో వర్గపోరాటాలకు సిద్ధంకావాలని సిపిఐ ఊర్కొండ మండలకార్యదర్శి దారదాసు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దారదాసు మాట్లాడుతూ మండలంలోని గ్రామాలలో అనేక ప్రజాసమస్యలు ఉన్నాయని ఎప్పటికప్పుడు తెలుసుకొని సమస్యలపై పోరాటాలు ఉధృతం చేయడానికి ప్రతికార్యకర్త సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వం కేంద్రంలో మూడోసారి అధికారంచేపట్టిన తర్వాత దేశవ్యాప్తంగా ముఖ్యంగా బిజెపిపాలిత రాష్ట్రాలలో దళితులు, మైనార్టీలు, గిరిజనులపైదాడులు తీవ్రంగా పెరిగాయని ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నేటికి పూర్తిస్థాయిలో పథకాలు అమలుకావడంలేదన్నారు. ఆరుగ్యారంటీలను తక్షణమే అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సైదులు, ప్రకాష్, పురుషోత్తం, రాజు, గెలవయ్య పాల్గొన్నారు.

## జెడ్‌పిహెచ్‌ఎస్ హై స్కూల్‌ను సందర్శించిన మానిటరింగ్ కమిటీ



**ప్రజాపక్షం / వనపర్తి :** వనపర్తి మున్సిపాల్టీ పరిధిలోని హరిజన వాడ ప్రాథమిక ఉన్నత పాఠశాలను ఆ పాఠశాల ఉపాధ్యాయులు గత కొంత కాలం నుండి ఎంతో శ్రమతో పాఠశాలను జిల్లాలోని ఒక గుర్తింపుగా తీసుకొని నేడు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల వైపు ఉన్న పాఠశాలను జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ క్రమ శిక్షణకు మీ మార్పుకు కారణాలు ఏమిటి అని కమిటీ సభ్యులు విచారించగా మాగేరి పాఠశాల మా మాస్టరు చంద్రశేఖర్ కృషి నంబర్‌గా విద్యార్థులు కొనియాడారు. పాఠశాల సమస్యలపైన ఉపాధ్యాయ బృందంతో చర్చించగా పాఠశాల గతంలో చాలా సమస్యలతో కూడుకున్న అంశాలను ఆ ప్రాంత ప్రజలు, ప్రత్యేకించి విద్యార్థుల తల్లిదండ్రులు ముఖ్యంగా యువత పాఠశాలకు సహకరించటం వలన ఎంతో సంతోషకరమైన ఆనందాన్ని ఉపాధ్యాయ బృందం పొందుతున్నామని తెలిపారు. తరగతి గదులు లేనందు వలన ఇబ్బందుల్లో ఉన్నామని, ప్రస్తుతానికిలో కాస్ట్ మెటీరియల్ తో షెడ్ నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా కమిటీ సభ్యులను కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు చెప్పు విశ్వం బాబు, ద్వారపోగు వెంకటేష్, మాదారి భోజరాజు, చిన్నమ్మ, థామస్, కె. వెంకట్ గౌడ్ పాల్గొన్నారు.

## ప్రజా పాలనల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ కాపీల అందజేత



**ప్రజాపక్షం / వీపనగండ్ల:** వీపనగండ్ల మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం మహిళా లబ్దిదారులకు ఎంపీడీఓ శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ రాజు, పంచాయతీ కార్యదర్శి రమేష్ రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఇల్లు లేని పేదవారికి ఐదు లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వడం జరుగుతుందని ఇందిరమ్మ ఇంటి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు రవీందర్ రెడ్డి, కావలి మహేష్, ఎత్తం వెంకటేష్, పెద్ద రాముడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు ఎత్తం కృష్ణయ్య, మాజీ సర్పంచ్ గంగిరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు నక్క విష్ణు, బస్వరాజ్ గౌడ్, మునిగొండ గోపి, వైఎస్ వెంకటయ్య, సంగ్యం వెంకటయ్య, సుబ్రహ్మణ్యం చారి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సాయన్న జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/కృష్ణ :** కృష్ణ మండలం ఖాన్ దొడ్డి గ్రామంలో పండుగ సాయన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ ఆ నాటి తెలంగాణ దొరలను, దేశముఖ్‌లను ధైర్యంగా ఎదుర్కొని, ప్రజల సొమ్మును దోచుకున్న వారి నుంచి తిరిగి తెచ్చి ఆ సోమ్మును తిరిగి ప్రజలకే పంచిన ముదిరాజ్ ముద్దుబిడ్డ, బహుజన బందూక్, తెలంగాణ రాబిన్ హుడ్‌గా సుపరిచితుడు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం పోరాడిన మీ త్యాగం, ధైర్యం, సేవలు తరతరాలకు స్ఫూర్తినిస్తాయి. మీ పోరాట చరిత్ర ఎల్లప్పుడూ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తుంది అన్నారు. అదేవిధంగా పండుగ సాయన్న చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ప్రతి గ్రామంలో పండుగ సాయన్న జయంతిని జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, శ్రీనివాసులు, తిప్పయ్య, మల్లికార్జున్, వెంకటేష్, తాయప్ప, దుకాణం వెంకటప్ప, మహాదేవ్, తారేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

కలెక్టర్ బదావత్‌సంతోష్




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ మండలపరిధిలోని పెద్దముద్దునూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ శుక్రవారం పరిశీలించారు. జిల్లాలో ప్రజలకు మెరుగైన ఆరోగ్యసేవలందించాలన్న లక్ష్యంతో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న ఔషదాలు, రికార్డుల నిర్వహణ, శుభ్రత, వైద్యసిబ్బంది హాజరుతదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. చికిత్సకోసం ఆస్పత్రికి వచ్చిన రోగులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సరైన వైద్యసేవలు అందించాల్సిన బాధ్యత ప్రతిప్రభుత్వ వైద్యసంస్థపై ఉందన్నారు. రోగులపట్ల మానవీయదృక్పథంతో వ్యవహరించాలన్నారు.

**ఇవిఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్**

నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని ఇవిఎం గోడౌన్‌ను శుక్రవారం జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన గోడౌన్ కువేసిన సీళ్లను, అదేవిధంగా అక్కడ ఏర్పాటు చేసిన సిసి పుటేజిలను పరిశీలించారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివిప్యాట్లు, ఇతర ఎన్నికల సామాగ్రిని భద్రంగా ఎలా నిల్వచేశారు అనే అంశాలను సమగ్రంగా తనిఖీ చేశారు. గోడౌన్ వద్ద ఏర్పాటు చేసిన పోలీసుబందోబస్తు ఏర్పాట్లనుకూడా గమనించి అవసరమైన సూచనలు చేశారు. అక్కడ నిఘాకోసం నిర్వహిస్తున్న రిజిస్టర్లను పరిశీలించి సంబంధిత నమోదుపత్రాలపై సంతకాలు చేశారు. ఈపరిశీలనలో కలెక్టర్‌వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు రవికుమార్, రాజకీయపార్టీల ప్రతినిధులు బాలకృష్ణ, ఎండి.హుస్సేన్, సంబంధిత అధికారులు హాజరయ్యారు.

**మహిళల భద్రతకు సఖి కేంద్రాల సేవలు కీలకం**

జిల్లా కలెక్టరేట్ సమీపంలో ఉన్న సఖికేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సఖివన్‌స్టాఫ్‌కేంద్రాలద్వారా అందించే సేవలపై విస్తృతంగా మహిళలకు అవగాహన కల్పించడానికి కృషిచేయాలని అన్నారు. సఖికేంద్రాన్ని ఆశ్రయించిన వారి వివరాలను పరిశీలించారు. జూలైచివరినాటికి 2343 కేసులు నమోదుచేశామని, 19కేసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశామని, 16కేసులు విచారణదశలో ఉన్నాయని సఖికో ఆర్డినేటర్ సునిత కలెక్టర్‌కు వివరించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో మహిళలు, బాలికలు వివిధరకాల వేధింపులు, హింసలకు గురవుతున్నారు. కలెక్టర్ వెంట జిల్లాబాలల సంరక్షణచైర్మన్ లక్ష్మణ్‌రావు, సఖి సెంటర్ సిబ్బంది ఉన్నారు.

**డ్రైడే పక్కాగా అమలు చేయాలి**

ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్నిగ్రామాల్లో అత్యంత పకడ్బందిగా నిర్వహించి , సీజన్‌వ్యాధులు ప్రబలకుండా పక్కాగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నారు. నిలువనీరు ఉంచకుండా ప్రజలకుపూర్తిస్థాయిలో ఆశవర్కర్లు అవగాహన కల్పించాలన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ మండలపరిధిలోని శ్రీపురం గ్రామాన్ని సందర్శించారు. ఈసందర్భంగా గ్రామంలోని కాలనీలను పరిశీలించారు. ప్రతి సంవత్సరం డెంగ్యూకేసులు నమోదవుతున్నాయని, ఈసీజన్‌లో ఆరు డెంగ్యూకేసులు నమోదయ్యాయని, పూర్తిస్థాయిలో రికవరీ అయ్యాయని డిఎంహెచ్ఓ రవికుమార్‌నాయక్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సీజనల్‌వ్యాధుల నియంత్రణకు గ్రామంలో చేపడుతున్న చర్యలగురించి ఆరాతీశారు. గ్రామంలో డెంగ్యూ, మలేరియా వంటికేసులు నమోదవ్వకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జ్వరం, జలుబు, ఒళ్లునొప్పులతో బాధపడుతున్న రోగులకు అందరికి రక్తపరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఎవరికైన ర్యాట్‌పరీక్షలో పాజిటివ్‌వస్తే వెంటనే టిహబ్‌కు పంపించాలని ఆదేశించారు.

# విద్యుదాఘాతానికి రైతు బలి

పత్తి పొలంలో కలపు తీసే క్రమంలో విద్యుత్ షాక్

జూరాల ప్రాజెక్టు వెళ్లే రహదారిపై గ్రామస్తుల ధర్నా



**ప్రజాపక్షం/అమరచింత :** 15 రోజుల క్రితం పొలంలో విద్యుత్ పోల్ విరిగి పడినా, దాని వైర్లను తొలగించకపోవడంతో విద్యుత్ ఘాతం సంభవించి ఓ నిండు ప్రాణం బలైన ఘటన గురువారం వనపర్తి జిల్లా అమరచింత మండల పరిధిలోని మస్తీపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామ శివారులోని ఓ రైతు పత్తి పొలంలో కలుపు మొక్కలను తొలగించేందుకు గురువారం ఉదయం 8 గంటల ప్రాంతంలో తిరుపతయ్య (50) అనే కూలి రైతు దున్నేందుకు వెళ్లాడు. పొలంలో విరిగి పడి ఉన్న విద్యుత్ పోల్ వైర్లకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. గత 15 రోజులుగా విద్యుత్ స్తంభం విరిగిపడిందని విద్యుత్ శాఖ అధికారులను తొలగించాలని విన్నపించిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని గ్రామస్తులు ఆరోపించారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల మృతి చెందిన రైతు కుటుంబానికి 25 లక్షల నష్టపరిహారం తో పాటు విద్యుత్ ఏఈ సంబంధిత లైన్మెన్‌ను సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. సంఘటనా స్థలానికి ఆత్మకూర్ ఎస్ఐ నరేందర్ , ట్రైనింగ్ ఎస్ఐ హిమబిందు, ఏఎస్ఐ రాములు ట్రాన్స్కో ఎస్ఐ మదన్‌తో పాటు పలువురు ఆందోళన చేస్తున్న గ్రామస్తులతో చర్చలు జరిపారు. బాధిత కుటుంబానికి డిపార్ట్మెంట్ తరపున ఐదు లక్షలు, అధికారుల నుంచి మరో ఐదు లక్షలు బాధిత కుటుంబానికి ఇప్పించడంతో పాటు మృతికి కారణమైన లైన్మెన్‌ను సస్పెండ్ చేసి చర్యలు తీసుకుంటామని హామీనివ్వడంతో గ్రామస్తులు తమ ఆందోళన విరమించారు. కాగా మృతుడికి భార్య కూతురు కుమారుడు ఉన్నారు. అమరచింత ఇంచార్జీ ఎస్ఐ హిమబిందు, హెడ్ కానిస్టేబుల్ రాములు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# భూములు కోల్పోతున్న రైతులను ఆదుకోవాలి




తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఎఐకెఎస్) జిల్లా అధ్యక్షులు డి.చెన్నయ్య

**ప్రజాపక్షం/నారాయణపేట్:** ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు నారాయణపేట జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం బహిరంగా సభలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేయస్) జిల్లా అధ్యక్షుడు డి చెన్నయ్య డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని తెలంగాణ రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి చెన్నయ్య, ఈ సందర్భంగా మాట్లాడుతూ వెనుబడిన నారాయణపేట జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాంత జిల్లా వాసిగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత రైతాంగానికి సాగునీటి గోస తీర్చేందుకు చేపట్టిన మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ ధరకు అనుగుణంగా రైతులతో చర్చించి అన్ని విధాలుగా మేలు చేసేలా న్యాయమైన పరిహారం ఇవ్వాలని కోరారు. ఈ ప్రాంతం సస్యశ్యామలం కావడం కోసం రైతులు తమ భూములను త్యాగం చేస్తుంటే ప్రభుత్వం సరైన పరిహారం ఇవ్వడంలో మొండి వైఖరి ప్రదర్శించడం ఎంతవరకు సమజంసమని వారి ప్రశ్నించారు. రైతులతో బలవంతంగా భూసేకరణ చేపడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. భూ నిర్వాసితులకు న్యాయం చేసే వరకు తెలంగాణ రైతు సంఘం అండగా ఉంటుందని రైతులు ధైర్యంగా ఉండాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేని పక్షంలో రైతాంగాన్ని ఐక్యం చేసి ఉద్యమిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం నారాయణపేట జిల్లా కార్యవర్గ సభ్యులుగా వెంకటయ్య, హనుమంతు కురుమూర్తి రాములను పాల్గొన్నారు.

# ఉత్సవాలలో డిజెలకు అనుమతి లేదు

డిఎస్పీ నల్లపు లింగయ్య



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** గణేష్ ఉత్సవాలు, ఇతర మత పరమైన పండగల సందర్భంగా డీజేలకు అనుమతి లేదని డీఎస్పీ నల్లపు లింగయ్య ఉత్సవ కమిటీ సభ్యులకు తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశం ప్రకారం నారాయణపేట జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ (లా అండ్ ఆర్డర్) లో భాగంగా మతపరమైన పండుగలు ఊరేగింపుల సమయంలో డిజె సౌండ్ సిస్టమ్స్/ పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్ , బాణసంచా వాడకం పెద్ద శబ్ద కాలుష్యం వచ్చే సిస్టంలను నారాయణపేట జిల్లా పరిధిలో నిషేధించబడిందని, భారతీయ నాగరికత సురక్ష సంహిత బిఎన్‌యస్‌యస్ యు/ఎస్ 163 (గతంలో 144 సిఆర్‌పిసి) ప్రకారం ఆర్డిఓ రామచందర్ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం రోజు ఉట్కూరు మండల కేంద్రం, రైతు వేదికలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు, హిందూ మత పెద్దలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి డీఎస్పీ నల్లపు లింగయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉట్కూరు మండల పరిధిలో అధిక శబ్దం వచ్చే డీజే సౌండ్ సిస్టంల వల్ల పెద్ద వారికి ముఖ్యంగా వృద్ధులు, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగులు, విద్యార్థులు, చిన్న పిల్లలకు, ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి హానికరం కావడంతో పాటు శబ్ద కాలుష్య చట్టాల ఉల్లంఘన, ఉత్సవాలను సాంప్రదాయంగా నిర్వహించుకోవడానికి డీజేలను నిషేధిస్తున్నట్లు జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐపిఎస్ ఆదేశాల మేరకు డీఎస్పీ తెలిపారు. పోలీస్ శాఖకు సహకరించాలని, రాష్ట్రంలో నారాయణపేట జిల్లాకు, ఉట్కూరు మండలానికి మంచి పేరు తీసుకురావాలని డిఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో మక్తల్ సీఐ రామ్ లాల్, ఎస్ఐ, రమేష్, ఉత్సవ కమిటీ పెద్దలు భాస్కర్, సూర్య ప్రకాష్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, గౌతమ్, శెట్టి రమేష్, శివ ప్రసాద్ రెడ్డి, గ్రామల యువకులు, గణేష్ ఉత్సవ ఆర్గనైజర్స్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతిఒక్కరికీ రేషన్‌కార్డులు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** అర్హులైన ప్రతిఒక్కరికి రేషన్‌కార్డులు అందిస్తామని, నూతన రేషన్‌కార్డుల ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ నియోజకవర్గపరిధిలోని నాగర్‌కర్నూల్, తెలకపల్లి, తాడూరు, బిజినేపల్లి, తిమ్మాజిపేట మండలాలకు సంబంధించిన లబ్దిదారులకు నూతన ఆహారభద్రతకార్డులను అందజేశారు. పట్టణంలోని సాయిగార్డెన్‌లో పంపిణీచేశారు. దేశంలో సన్నబియ్యం పంపిణీచేస్తున్న ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. జిల్లాలో అర్హులైన పేదవారికి ఆహారభద్రత కల్పించి, ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రేషన్‌కార్డు ద్వారా ప్రభుత్వ సంక్షేమపథకాల అమలు జరుగుతుందన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తాడూరు, నాగర్‌కర్నూల్, తెలకపల్లి, బిజినేపల్లి, తిమ్మాజిపేట మండలాల్లో 6600 మంది లబ్దిదారులకు నూతన రేషన్‌కార్డులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 16వేలమంది పేర్లను రేషన్‌కార్డుల్లో నూతనంగా నమోదు చేయడం జరిగిందన్నారు. రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతర ప్రక్రియ అని, లబ్దిదారులు ఎవరూరాలేదని అధైర్యపడాల్సిన పనిలేదని, మీసేవలో పేర్లు నమోదుచేసుకుంటే వెంటనే రేషన్ కార్డును మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింహ్మారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, నాగర్‌కర్నూల్ ఆర్‌డిఓ సురేష్ బాబు, తహసీల్దార్లు తబితారాణి, జాకీర్‌ఆలీ, మునిరుద్దిన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఐదు మండలాల లబ్దిదారులు పాల్గొన్నారు.



## హత్యకేసులో నలుగురు రిమాండ్


**ప్రజాపక్షం/వెల్దండ :** ఈనెల 6న హత్యకుగురైన బెల్లంకొండ రాములు హత్య కేసులో నలుగురు వ్యక్తులను రిమాండ్‌కు పంపినట్లు సిఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరుకల కులానికిచెందిన బెల్లకొండ రాములు వృత్తీరీత్యా పందులకాపరి అయితే గత కొన్నిరోజుల క్రితం తన పందులను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని దొంగిలించిన పందులు మండల కేంద్రంలోని మానపటి వెంకటమ్మ పందులవద్ద ఉన్నాయని రాములుతోపాటు తనకులసంఘం నాయకులతో కలిసి వచ్చారు. దీంతో అక్కడ మానపాటి వెంకటమ్మ ఆమె కుమారులు మానపాటి అన్వేష్, మానపాటి పవన్, మానపాటిశివ, మానపాటి పెంటమ్మ కొడవళ్లతోదాడిచేసి హత్యచేశారు. జిల్లా ఎస్‌పి వైభవ్‌గైక్వాడ్ రఘునాథ్ ఆదేశాల మేరకు వెంకటమ్మ, పవన్, శివ, అన్వేష్‌లను రిమాండ్ చేశామని, పెంటమ్మ పరారీలో ఉన్నట్లు తెలిపారు. హత్యజరిగిన రోజే రాములు భార్య నాగమణి ఫిర్యాదుమేరకు ఎనిమిదిమందిపై కేసు నమోదుచేసినట్లు సిఐ వెల్లడించారు. ఈకేసును త్వరగా చేధించినందుకు ఎస్ఐ కురుమూర్తి, ఎఎస్ఐ శ్రీనివాసులు, కానిస్టేబుల్స్ నవీన్, శ్రీనయ్య, ఆంజనేయులు, మురళి, సందీప్, అమర్‌సింగ్‌ను అభినందించారు.

## మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** వట్టెం గ్రామశివారులో గుర్తుతెలియని ఒక వ్యక్తి కెఎల్‌ఐ కాల్వలో పడి మృతి చెంది కాల్వలో కొట్టుకుపోతుండగా బిజినేపల్లి మండల పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ జితేందర్ గమనించి ఎఫ్‌ఐఆర్ రికార్డుచేసి ఆ శవాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం దహనసంస్కారాలు నిర్వహించారు. ఈమేరకు బిజినేపల్లి ఎస్ఐ శ్రీనివాస్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. గుర్తుతెలియని శవం లభించడంతో కానిస్టేబుల్ జితేందర్ తనసొంత డబ్బులతో దహనసంస్కారాలు చేయడంతో ఎస్ఐ అభినందించారు.

## వైభవంగా వరలక్షి దేవీవ్రతాలు



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో శుక్రవారం వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా పెద్ద సంఖ్యలో మహిళలుపాల్గొని పూజలు నిర్వహించారని దేవాలయచైర్మన్ ఫౌండర్‌ట్రస్టు జూలూరిరమేష్‌బాబు తెలిపారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నామని అందులోభాగంగా శుక్రవారం అమ్మవారి ఆలయం ప్రాంగణంలో మహిళలు పాల్గొని పూజలు నిర్వహించారు. శ్రావణ మాసంలో వరలక్ష్మి వ్రతాలు చేయడంవల్ల వారి కుటుంబాలు లక్ష్మీ దేవి ఆశీస్సులతో సుఖసంతోషాలతో ఉంటాయన్నారు. వాసవిక్లబ్ వనితాక్లబ్ ఆధ్వర్యంలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో శ్రావణమాసంలో భాగంగా జైవాసవి నినాదాలతో సారేచీర అమ్మవారికి ఒడిబియ్యం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్స్ బాదం ధనలక్ష్మి రాఘవేందర్, సెక్రటరీ నీలస్రవంతి, కోటేశ్వర్, ట్రెజరర్స్ మాచిపెద్ది కల్పన రవికుమార్, మండలప్రెసిడెంట్ గంధంప్రసాద్, టౌన్‌ప్రెసిడెంట్ వాసశేఖర్, చిగుళ్ల శ్రీధర్, ఆంజనేయులు, యూత్ అధ్యక్షులు సంబుతరుణ్, మహిళా అధ్యక్షులు మౌనిక పాల్గొన్నారు.

## కోళ్లఫారాలు నిర్మించొద్దని ధర్నా

**ప్రజాపక్షం/వెల్దండ :** మండలపరిధిలోని పోతేపల్లి, లింగారెడ్డిపల్లి, కల్వకుర్తి మండలం తాండ్రగ్రామాల సరిహద్దులో నూతనంగా కోళ్లఫారాలు నిర్మిస్తున్నారని ఆయాగ్రామాలప్రజలు రోడ్డుపై బైఠాయించి ధర్నాచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోళ్లఫారాల నిర్మాణంచేపడితే దుర్వాసనతో ప్రజలకు హాని కలుగుతుందని రాస్తారోకో నిర్వహించారు. 60 ఎకరాలభూమిలో కోళ్లఫారం ఏర్పాటు చేయుటకు అనుమతి ఇచ్చిన ప్రత్యేకాధికారి, గ్రామకార్యదర్శిని వెంటనే సస్పెండ్‌చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో మాజీఎంపిపి రాజశేఖర్, వెంకటమ్మ, ఈశ్వరయ్య, సంజీవకుమార్ యాదవ్, కాయితి సాయిరెడ్డి, ఆంజనేయులు, రంగయ్య, మల్లేష్‌తోపాటు ఆయాగ్రామాలప్రజలు,రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు నాణ్యమైన భోజనం



**ప్రజా పక్షం/ హాలియా:** విద్యార్థినీలకు నాణ్యమైన భోజనం అందించాలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయనీలపై ఉందని జిల్లా విద్యాధికారి బొల్లారం బిక్షపతి అన్నారు. హాలియా పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ను నల్గొండ జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన హైజెనిక్ ఆహార పదార్థాలను భోజనాన్ని సరఫరా చేయాలని స్పెషల్ ఆఫీసర్ హైమావతిని ఆదేశించారు. అదేవిధంగా స్టోర్ రూమ్,వంటగది, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పాఠశాల సిబ్బంది తో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల ప్రగతిని సమీక్షిస్తూ గుణాత్మకమైన విద్యను అందించాలని చెప్పారు. పాఠశాల స్పెషల్ ఆఫీసర్ హైమావతి,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## చిట్యాల పిహెచ్‌సి ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్‌రావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ల్యాబ్, ఫార్మసీ రికార్డులను ఆయన పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో ఉద్యోగ సేవలందిస్తున్న సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు వైద్యసేవలను అందించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అనంతరం మున్సిపాలిటి పరిధిలోని శివనేనిగూడెం ప్రాంతంలో నమోదైన డెంగ్యూ కేసు గృహాన్ని సందర్శించి పరిసరాలను పరిశీలించారు. డెంగ్యూ కేసులు తిరిగి రాకుండా కావల్సిన చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ సీజన్‌లో ప్రతి రోజును డ్రైడేగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిబి కంట్రోల్ అధికారి డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, డిఎంఓ ప్రదీప్, మండల వైద్యాధికారి ఈ వెంకటేశం, సామాజిక ఆరోగ్య అధికారి నర్సింగ్‌రావు పాల్గొన్నారు.



## 13న రైతు సంఘం నిరసనలు ర్యాలీలు

**ప్రజాపక్షం/నల్లగొండ (దామరచర):** ఆగస్టు 13వ తేదీన నల్లగొండలో క్విట్ ఇండియా దినోత్సవం పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసనలు ర్యాలీలను జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. దామరచర్ల మండలం బొత్తలపాలెం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం సమావేశం జిల్లా సమితి సభ్యురాలు ధానావత్ శాంత అధ్యక్షతన జరిగింది ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథులుగా హాజరైన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మూడు రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొని వచ్చి వాటిని పూర్తిస్థాయిలో రద్దు చేయకుండా తాత్కాలిక ఉపసహరించుకోవటం దానివలన రైతులకు భవిష్యత్తులో నష్టం జరిగే పరిస్థితి ఉందని వారన్నారు. వాటి పూర్తిస్థాయిలో రద్దు చేయాలని లేని పక్షంలో రైతుల్ని కలుపుకొని కేంద్ర ప్రభుత్వం మీద పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని వారన్నారు. కేంద్ర ప్రభుత్వం పునరా ఆలోచన చేసి స్వామినాథన్ కమిషన్ సిఫారసును అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి బిల్లా కనకయ్య,సిపిఐ మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ కుమార్ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి ధీరావత లింగ నాయక్ ,పార్టీ మండల సమితి సభ్యులు జమ్మల కోటయ్య,పేరుపొంగు లక్ష్మయ్య,పేరుపొంగు సైదులు,పోలేపల్లి ,లక్ష్మయ్య ,పున్నయ్య,దావీదు,సైదమ్మ పాల్గొన్నారు.

నీటి ఉధృతి ఉన్నప్పుడు, నీటి లోతు ఉన్నప్పుడు నదిలోకి దిగవద్దు

## యువత సెల్ఫీలు, రీల్స్ అంటూ ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దు



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** వర్షాకాలం సందర్భంగా ప్రాజెక్టులు, వంతెనల వద్ద పోలీసులు అప్రమత్తంగా ఉన్నారని సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. శుక్రవారం మండల పరిధిలో మూసీ నది ప్రవాహంను పరిశీలించారు. భీమవరం గ్రామం వద్ద వంతెనను పరిశీలించి పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాద హెచ్చరిక సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజలు అధికారుల సూచనలు పాటించాలని కోరారు. ప్రవహించే నీటిలోకి ఎవ్వరూ వెళ్ళవద్దన్నారు. చేపల వేటకు వెళ్ళరాదని తెలిపారు. యువత సెల్ఫీలు, రీల్స్ అంటూ విషాదం చేసుకోవద్దని సూచించారు. సూర్యాపేట రూరల్ పరిధి, పెన్‌పహాడ్, నేరేడుచర్ల, పాలకవీడు పరిధి మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తడం వల్ల కృష్ణానదిలో నీటి ఉధృతి అధికంగా ఉన్నది కావున నాటుపడువలు వెళ్ళవద్దు, నదిలోకి దిగవద్దన్నారు. అత్యవసర సమయాల్లో పోలీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలని డయల్ 100, జిల్లా స్పెషల్ బ్రాంచ్ 8712686026 కు ఫోన్ చేయాలని కోరారు. మూసీ సందర్శించిన ఎస్‌పి వెంట డివిజన్ డిఎస్‌పి ప్రసన్న కుమార్, స్థానిక అధికారులు ఉన్నారు.

## 42శాతం రిజర్వేషన్ల అమలుకు సిపిఐ(ఎం) నిరసనలు



**ప్రజాపక్షం/సూర్యాపేట :** రాష్ట్రంలో బిసిలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఆ పార్టీ జిల్లా స్థాయి విస్తృత సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా ప్రసంగించారు. బీసీలకు సంబంధించిన రిజర్వేషన్లు మైనార్టీలు పొందకూడదని అక్రమ పద్ధతుల్లో బిజెపి నాటకమాడుతుందని అన్నారు. బిజెపి పాలిత ప్రాంతాలైన గుజరాత్, యుపి, ఇతర రాష్ట్రాలలో మైనార్టీలకు రిజర్వేషన్లు అమలు చేస్తూ తెలంగాణలో దానికి వ్యతిరేకంగా మాట్లాడుతుందని ఆరోపించారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ అర్హులైన పేదలందరికి ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి , జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి, నాయకులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరి రావు, కోట గోపి, మట్టిపెల్లి సైదులు, చెరుకు ఏకలక్ష్మి పాల్గొన్నారు.

## ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలని జానారెడ్డికి వినతి

**ప్రజాపక్షం/నందికొండ :** కాంగ్రెస్ పార్టీ శాసనసభఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు పరచాలని నాగార్జునసాగర్ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో ఉద్యమకారులు శుక్రవారం మాజీ సీఎల్పీ నాయకులు కుందూరు జానారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. సందర్భంగా ఉద్యమకారులను ఉద్దేశించి జానారెడ్డి మాట్లాడుతూ నాగార్జునసాగర్ లో ప్రభుత్వ స్థలాలు ఏమైనా ఉంటే ఉద్యమకారులకు ఇవ్వడానికి ఎలాంటి అభ్యంతరం లేదని అవి అందుబాటులో లేకపోతే వేరే మండలంలో నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ఉన్న ఉద్యమకారులకు 250 గజాల స్థలాన్ని తప్పకుండా ఇప్పించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కాయితి జానకి రెడ్డి మాజీ కౌన్సిలర్ హిరే కార్ రమేష్ సభావత్ చంద్రమౌళి సిరికొండ మధు చరక యాదగిరి మంగళగిరి వెంకోజీ తదితరులు పాల్గొన్నారు.



# ఇసుక డంప్‌లను గుర్తించి సీజ్

### స్థానికంగా ఇసుక రీచ్‌లను గుర్తించాలి
### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక ఉచితంగా ప్రభుత్వం అందజేస్తుందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా ఎస్‌పి కె నరసింహతో కలిసి జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. వానాకాలం ప్రారంభమైనందున ఇసుకకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, హౌసింగ్ శాఖ, ఎంపిడిఓలు, తహశీల్దార్‌లతో సమన్వయం చేసుకుంటూ ఏ గ్రామానికి ఎన్ని ఇండ్లు అనుమతి ఇచ్చారో దానికి సరిపోను ఇసుక ఏర్పాటు చేసుకోవాలని, అలాగే మైనింగ్ శాఖ సహాయంతో ఇసుక బజారులను ఏర్పాటు చేసేందుకు ఆర్‌డిఓలు, తహశీల్దార్‌లు స్థలాలను గుర్తించాలని సూచించారు. నాగారం పెరబోయినగూడెం అప్రోచ్ రోడ్డుకు ప్రతిపాదనలు పంపాలని పంచాయితీరాజ్ శాఖ ఇంజనీర్లను ఆదేశించారు. జిల్లాలో చేపడుతున్న జాన్‌పహాడ్, బెట్టతండ, ముత్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్లకు, మున్నేరు వాగు రక్షణ గోడకు ఇరిగేషన్ శాఖకు ఇసుక అనుమతి ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. జిల్లాలో ఎక్కడైనా అక్రమంగా డంపు చేస్తే అలాంటి ప్రాంతాలను గుర్తించి వెంటనే సీజ్ చేసి అట్టి ఇసుకను ఇందిరమ్మ ఇండ్లకి కేటాయించాలని అధికారులను ఆదేశించారు. ఇసుక రీచ్‌లలో ఆధునాతన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, అనుమతి లేని ట్రాక్టర్లు ఇసుక తరలిస్తే మొదటిసారిగా 5000, రెండో సారి 15000, మూడోసారి 25000, నాలుగోసారి గుర్తిస్తే సీజ్ చేయడం జరుగుతుందని, అదేవిధంగా ఆ సాండ్ టాక్సీ నుంచి తొలగించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ఎస్‌పి కె నరసింహ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుండి సూర్యాపేట జిల్లాలోకి ఇసుక రవాణా అనుమతిలేదని, రెవెన్యూ పోలీసు శాఖ అధికారులు సమన్వయంతో ఇసుక అక్రమ రవాణాను ఎప్పటికప్పుడు అరికడుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి రాంబాబు, డిఎఫ్ఓ సతీష్ కుమార్, డిఆర్‌డిఓ పిడి వివి అప్పారావు, ఆర్‌డిఓ వేణుమాధవ్, డిపిఓ యాదగిరి, ట్రాన్స్‌పోర్ట్ అధికారి జయప్రకాశ్ రెడ్డి, సూపరింటిండెంట్ శ్రీనివాసరాజు, తహశీల్దార్‌లు, మైనింగ్ అధికారులు, భూగర్భ జల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా ప్రధాని మోదీ అడ్డు

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా కేంద్రంలో అధికారం ఉన్న ప్రధాని నరేంద్ర మోడీ అడ్డు పడుతున్నారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి ఆరోపించారు. సిపిఐ నల్లగొండ పట్టణ కమిటీ సమావేశం స్థానిక మగ్దూమ్ భవనంలో సహాయ కార్యదర్శి వి లెనిన్ అధ్యక్షత న జరిగింది.సమావేశంలో వీరస్వామి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు 42శాతం అమలు చేస్తు తెలంగాణ అసెంబ్లీ ఆమోదించి కేంద్రానికి పంపితే అడ్డుకోవడని తీవ్రంగా ఖండించారు. తమిళనాడుకు ఇచ్చిన విధంగానే బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ను 9వ షెడ్యూల్లో చేర్చి కేంద్రం తమ చిత్తశుద్ధి తో వ్యవహరించాలన్నారు.పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు ఇస్తున్న ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన పేదలకు ఇవ్వాలన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో ఉపాధి కోసం ఎంతోమంది వివిధ ప్రాంతాల నుంచి వచ్చి సొంత ఇల్లు లేక అద్దె రూమ్‌లో ఉంటూ కిరాయి చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అలాంటి వారిని ప్రభుత్వం గుర్తించి ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. అలాగే అర్హులైన పెన్షన్ దారులకు ఆసరా చేయుత పెన్షన్ వెంటనే మంజూరు చేయాలని కోరారు.ఈ సమావేశంలో పట్టణ కమిటీ సభ్యులు ఎండీ యూసుఫ్, పాండరయ్య, వీరయ్య, పి సుజాత, జె విజయ, ఎం కౌసల్య, చింత ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయండి

### ప్రైమరీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పనులను పరిశీలించిన యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో నూతన ప్రైమరీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పనులను యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు పరిశీలించారు. బిల్డింగ్‌లో ఉన్న రూమ్‌లలో ఇంకా పెండింగ్‌లో ఏం పనులు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. బిల్డింగ్ ముందు ప్లేస్‌లో లెవల్ చేసి, కొత్త గేటు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు తెలిపారు. మిగిలిన పనులు త్వరగా పూర్తిచేసి వారం రోజుల్లోగా ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సదరు కాంట్రాక్టర్‌ని ఆదేశించారు. అనంతరం బీబీనగర్ మండలం కేంద్రంలో ప్రైమరీ హెల్త్ సెంటర్‌ని ఆకస్మికంగా జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించి డాక్టర్, సిబ్బంది ఎంత మంది విధులకు హాజరు అయ్యారా పరిశీలించారు. శుక్రవారం ఓపికి ఎంత మంది పేషెంట్లు వచ్చారని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. గత నెలలో ఎన్ని నార్మల్ డెలివరీలు అయ్యాయని, ఇంకా ఎన్ని ఈడిడిలు ఉన్నాయని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రహీంఖాన్ గూడ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇంటిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో మొత్తం ఎన్ని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని, ఎన్ని ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణాలు జరుగుతున్నాయని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు జరిగిన నిర్మాణ పనులకు డబ్బులు పడ్డాయా లేదా, ఏమి అయినా పెండింగ్ ఉన్నాయా అని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారురాలు అయిన లక్ష్మమ్మ ఇంటి పనులు పరిశీలించారు. మేస్త్రీకి ఇంటి నిర్మాణానికి ఎంత డబ్బులు తీసుకుంటున్నాడని అడగడం జరిగింది. స్కేర్ ఫీట్‌కి రూ.300 కంటే ఎక్కువ ఇవ్వవద్దని కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు ఇటుక, సిమెంట్ తక్కువ ధరకే ఇవ్వాలని ఎంపీడీఓ, ఎంఆర్‌ఓలు షాప్ యజమానులతో మాట్లాడి ధర నిర్ణయించారు అని చెప్పారు. ఇంటి నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేసుకోవాలని లక్ష్మమ్మకి సూచించారు. డబ్బులు విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రతి సోమవారం లబ్ధిదారుల అకౌంట్‌లలో డబ్బులు జమ అవుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎస్కేప్ ఛానల్స్ సక్రమంగా లేకుంటే ప్రమాదాలు



**ప్రజాపక్షం /హాలియా:** ప్రస్తుతం వర్షాకాల నేపథ్యంలో సాగర్ ఎడమ కాలువ కట్టకు ప్రమాదాలు జరగకుండా ఎస్కేప్ చానల్స్‌తో వాటిని నియంత్రించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం సాయంత్రం హాలియా లోని అక్విడెక్ట్ ప్రాంతంలో ఉన్న ఎడమ కాలువ ఎస్ కే ఛానల్ ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సాగర్ ఎడమకాలలో నీటి ప్రవాహం కొనసాగుతున్న సమయంలో ప్రమాదాలు జరిగితే వాటి నుంచి కాల్వను ఎలా కాపాడుకోవాలో సిబ్బందితో చర్చించారు. ఎడమ కాలువకు ప్రమాదాలు జరిగిన సమయంలో ఎస్కేప్ చానల్స్ ద్వారా నీటిని మళ్లించేలా వాటిని సిద్ధంగా ఉంచాలని సూచించారు. కాల్వకు ఉన్న ఈ ఎస్కేప్ ఛానల్స్ సక్రమంగా లేనట్లయితే ప్రమాదాల తీవ్రత మరింతగా ఉంటుందని అందువలన సిబ్బంది ఎప్పటికప్పుడు ఎస్కేప్ ఛానల్స్ ను పర్యవేక్షించాలని సూచించారు. కలెక్టర్ వెంట మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ, హాలియా మున్సిపల్ కమిషనర్ రామ దుర్గారెడ్డి ఉన్నారు.

## గంజాయి రవాణా చేస్తున్న అంతరాష్ట్ర ముఠా అరెస్ట్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అక్రమంగా తెలంగాణ రాష్ట్రం వైపు గంజాయి రవాణా చేస్తున్న పది మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రాజశేఖర్‌రాజ తెలిపారు. శుక్రవారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన భూక్యా హనుమానాయక్, సింగాల కాటంరాజు, నర్సారావుపేట జిల్లా కారంపూడికి చెందిన మద్దూరి చంటి అనే ముగ్గురు గంజాయికి అలవాటు పడి జల్సాల కోసం ఒడిషా రాష్ట్రానికి చెందిన ఆనంద్‌గురు వద్ద నుంచి గంజాయిని కొనుగోలు చేసి అధిక ధరలకు అమ్ముతున్నారు. అయితే వీరికి మిర్యాలగూడకు చెందిన కొందరు పరిచయం కాగా ఒడిషా రాష్ట్రం నుంచి తెచ్చిన గంజాయిని మిర్యాలగూడ యవకులకు సరఫరా చేసేందుకు శుక్రవారం హనుమానాయక్, కాటంరాజు, చంటిలు రెండుగా విడిపోయారన్నారు. చంటి తన బైక్ మీద 5కిలోల గంజాయిని, హనుమానాయక్, కాటంరాజులు కారులో 17కిలోల గంజాయితో మిర్యాలగూడ పట్టణానికి చెందిన యవకులకు అందచేస్తుండగా పోలీసులు దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. మద్దూరి చంటి, షేక్ రియాజ్, మహమ్మద్ హర్షద్అయూబ్, మహ్మద్ సలీంఅక్తర్, మహమ్మద్ జునైద్అలీ, షేక్ అఫ్రోజ్, కుర్ర సందీప్, భూక్యా హనుమానాయక్, సింగాల కాటంరాజులను అరెస్ట్ చేశారు. మరో ప్రధాన నిందితుడు ఒడిషా రాష్ట్రానికి చెందిన ఆనంద్‌గురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరి నుంచి 22కిలోల గంజాయి, ఒక కారు, మూడు బైక్‌లు, పది సెల్‌ఫోన్లు స్వాదీనం చేసుకోని నిందితులను కోర్టులో రిమాండ్ చేసినట్లు తెలిపారు. సీఐ సోమనర్సయ్య, ఎస్ఐలు లక్ష్మయ్య, రాంబాబు, సిబ్బంది ఉన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో పురోగతి పెంచాలి

### ఎమ్మెల్యే బాలునాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో పురోగతి తీసుకురావాలని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలు నాయక్ అన్నారు. శుక్రవారం దేవరకొండ ఆర్డివో కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ఇందిరమ్మ ఇండ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణంలో పురోగతి తక్కువగా ఉన్నచోట పురోగతిని పెంచాలని, లబ్దిదారులకు ఇబ్బంది లేకుండా త్వరితగతిన చెల్లింపులు చేయాలని అన్నారు. ఎల్3 నుండి ఎల్ 1కు పంపించే జాబితాలో ఎలాంటి ఇబ్బంది లేకుండా అర్హులైన వారిని చేర్చాలని చెప్పారు. ఏమైనా సమస్యలుంటే తక్షణమే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ నిర్ధేశించిన లక్ష్యం ప్రకారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి పూర్తి చేయాలని, ఎల్ 3 నుండి ఎల్ 1కు వచ్చే ఇండ్ల లబ్దిదారుల జాబితా పారదర్శకంగా ఉండాలన్నారు. అలాగే ఇల్లు మంజూరై నిర్మించుకునేందుకు ఆర్థిక స్థోమత లేని వారిని గుర్తించి వారికి స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా రుణం ఇప్పించేందుకుగాను ఏపిఎంల ద్వారా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడి రాజ్‌కుమార్, ఆర్డివో రమణారెడ్డి, మండల ఎంపిడిఒలు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

## విజ్ఞాన్ వర్సిటీ- ఐఐటీ హైదరాబాద్ మధ్య అవగాహన ఒప్పందం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి మండలం దేశ్ముఖి గ్రామంలోని విజ్ఞాన్ సంస్థల ప్రధాన యూనివర్సిటీ చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ హైదరాబాద్లోని ఐఐటీ హైదరాబాద్‌ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని శుక్రవారం యూనివర్సిటీ వైస్ చాన్సర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐఐటీ హైదరాబాద్లోని స్పాన్సర్డ్ కన్సల్టెన్సీ అండ్ రీసెర్చ్ డీన్ ప్రొఫెసర్ జీ.నరహరి శాస్త్రితో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఈ ఒప్పందం వలన ఉమ్మడిగా పరిశోధనలు చేయడంతో పాటు డెవలప్మెంట్ ప్రాజెక్టను సులభతరం చేయవచ్చునన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడానికి ఉమ్మడి శిక్షణా కార్యక్రమాలు, వరాప్లు, సెమినార్లు, ఇండస్ట్రీ అకాడెమియా ఇంటరాక్షన్స్ను నిర్వహిస్తామన్నారు. వీటితో పాటు విద్యార్థులకు ఇంటర్న్షిప్ అవకాశాలను అందించడం, ఫ్యాకల్టీ ఎక్చేంజ్, ప్రాక్టికల్ ఇండస్ట్రీ అనుభవాన్ని అందించడంతో పాటు వృత్తిపరమైన వృద్ధిని శాస్త్రీయ విజ్ఞాన నైపుణ్యాలను పెంపొందిస్తామన్నారు. విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థులకు కొన్ని కోర్సులను ఐఐటీ హైదరాబాద్ ఫ్యాకల్టీ బోధిస్తారని వెల్లడించారు. ఐఐటీ హైదరాబాద్లోని స్పాన్సర్డ్ కన్సల్టెన్సీ అండ్ రీసెర్చ్ డీన్ ప్రొఫెసర్ జీ. నరహరి శాస్త్రి మాట్లాడుతూ విజ్ఞాన్స్ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులను సరికొత్త టెక్నాలజీల వైపు ప్రోత్సహించడంతో పాటు వారికి ఆయా రంగాలలో తర్ఫీదునివ్వడమే ఈ ఒప్పందం లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ హైదరాబాద్ బయోటెక్నాలజీ అధ్యాపక బృందం, విజ్ఞాన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, వర్సిటీలోని ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణపై అందరి బాధ్యత



**ప్రజాపక్షం /హాలియా:** రోడ్డు ప్రమాదాలను నివారించడంలో ప్రతి ఒక్కరు బాధ్యతలు కలిగి ఉండాలని హాలియా ఎస్సై బండి సాయి ప్రశాంత్ అన్నారు. శుక్రవారం కొత్తపల్లి గ్రామంలో మిషన్ త్రిబుల్ ఆర్, రోడ్డుసేఫ్టీ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సాయి ప్రశాంత్ మాట్లాడుతూ జాతీయ రహదారులపై, స్థానిక రహదారులపై ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు అత్యంత బాధ్యతగా ప్రయాణం చేయాలని తెలిపారు. రహదారులపై ఏర్పాటు చేసిన సూచికలకు అనుగుణంగా వాహనాలు నడపాలని సూచించారు. జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ ఆదేశాల మేరకు మిషన్ త్రిబుల్ ఆర్, రోడ్ సేఫ్టీ కార్యక్రమాలపై అన్ని గ్రామాలలో ఈ అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అనంతరం సిపిఆర్ కార్డియో పల్మనరి రిససిటేషన్ పద్ధతిని స్థానిక ఎంఎల్ హెచ్ పి మంజుల దానిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాజు, అబ్బోని యాదయ్య, పోలీస్ కళాజాత బృందం తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల దృష్ట్యా కంట్రోల్ రూం ఏర్పాటు

**ప్రజాపక్షం/దేవరకొండ:** భారత వాతావరణ శాఖ, హైదరాబాద్ వాతావరణ శాఖ జారీ చేసిన వాతావరణ సూచన ప్రకారం నల్గొండ జిల్లా పరిధిలో 07/08/2025 నుండి 09/08/2025 వరకు భారీ వర్షాల హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, విద్యుత్, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక సహా అన్ని సంబంధిత శాఖలకు తగు సిద్ధత, సమన్వయం, స్పందన చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినందున ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టేందుకు దేవరకొండ రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో 24/7 పద్ధతిలో డివిజనల్ కంట్రోల్ రూం ఏర్పాటు చేయడం జరిగిందని, భారీ వర్షాల కారణంగా తలెత్తే అత్యవసర పరిస్థితులు, వరదల వల్ల కలిగే ప్రమాదాలు లేదా ఇతర ప్రకృతి వైపరీత్యాల సందర్భంలో, సహాయం మరియు సమాచారం కోసం ఫోన్ నెంబర్ 8179199255ను సంప్రదించాలని తెలిపారు.

## సద్దల చెరువు పరిశీలన



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సద్దల చెరువును జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సద్దల చెరువు కట్టపై మొక్కలు నాటాలను మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. చెరువు కట్టపై ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి, డిఇ శ్రీనాథ్, ఏఈ సత్యారావు పాల్గొన్నారు.

# క్రీడ

# వన్డేలకు సై

## లండన్‌లో ఐపిఎల్ కోచ్‌తో కోహ్లీ



భారత మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ మళ్లీ బ్యాట్ అందుకున్నాడు. ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు తొలి ట్రోఫీ అందించిన విరాట్.. ఇక టీమిండియా జెర్సీలో చెలరేగిపోయేందుకు సిద్ధమవుతున్నాడు. టీ20లకు.. ఈమధ్యే టెస్టులకు వీడ్కోలు పలికిన కింగ్ పరిమిత ఓవర్ల ఫార్మాట్ కోసం ప్రాక్టీస్ మొదలెట్టాడు. లండన్‌లో ఉంటున్న అతడు.. అక్కడే ఐపీఎల్ కోచ్‌తో కలిసి బ్యాటింగ్ సాధనకు ఉపక్రమించాడు. శుక్రవారం కోహ్లీ కోచ్‌తో దిగిన ఫొటో పెట్టాడు.

తన ఆటతో కోట్లాదిమందిని అభిమానులుగా మార్చుకున్న కోహ్లీ మళ్లీ మైదానంలోకి దిగేందుకు ఎదురుచూస్తున్నాడు. వన్డే స్క్వాడ్‌లో చోటు సంపాదించాలనే లక్ష్యంతో ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌కు అసిస్టెంట్ కోచ్‌గా పనిచేస్తున్న నయీం అమిన్ సాయం తీసుకుంటున్నాడు కోహ్లీ. నెరిసిన గడ్డం, బూడిద రంగు టీషర్ట్, బ్లూ షార్ట్‌తో విరాట్.. నవ్వులూ చిందిస్తూ దిగిన ఫొటోను అభిమానులతో పంచుకున్నాడు. 'బ్యాటింగ్ సలహాలు ఇస్తున్నందుకు బ్రదర్ నీకు ధన్యవాదాలు. నిన్ను కలవడం ఎల్లప్పుడూ గొప్పగా ఉంటుంది' అని ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో రాసుకొచ్చాడీ రన్ మెషీన్. లండన్‌లోనే నెట్స్ ప్రాక్టీస్ షురూ చేసిన విరాట్.. నయీం పర్యవేక్షణలో మునపటి లయను అందుకునేందుకు కఠోర సాధన చేయనున్నాడు.

ఐపిఎల్ 18వ సీజన్‌తో తన ట్రోఫీ కలను సాకారం చేసుకున్న విరాట్ అందర్నీ ఆశ్చర్యపరుస్తూ తనకెంతో ఇష్టమైన టెస్టులకు గుడ్ బై చెప్పాడు. ఇంగ్లండ్ పర్యటనకు ముందే రిటైర్మెంట్ బాంబ్ పేల్చిన అతడు.. వన్డేల్లో తళుక్కుమనేందుకు కాచుకొని ఉన్నాడు. అక్టోబర్‌లో భారత జట్టు మూడు వన్డేల సిరీస్ కోసం ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. అక్టోబర్ 19 నుంచి 25 వరకూ జరుగబోయే ఈ సిరీస్‌పై కన్నేసిన కోహ్లీ ఫామ్ చాటుకునేందుకు తహతహలాడుతున్నాడు.

# కాన్వే శతక మోత..

## రెండో టెస్టులో కివీస్‌కు భారీ ఆధిక్యం!



తొలి టెస్టులో ఘోరంగా ఓడిన జింబాబ్వే రెండో టెస్టులోనూ ఓటమిని చవిచూసేలా ఉంది. బ్యాటర్ల వైఫల్యంతో కుప్పకూలిన ఆతిథ్య జట్టుకు షాకిస్తూ న్యూజిలాండ్ మ్యాచ్‌పై పట్టుబిగిస్తోంది. ఓపెనర్ డెవాన్ కాన్వే(153) సూపర్ సెంచరీతో చెలరేగగా.. మిడిలార్డర్ బ్యాటర్లు హెన్రీ నికోలస్(95 నాటౌట్), రచిన్ రవీంద్ర (51 నాటౌట్) అర్ధ శతకాలతో విజృంభించారు. కాన్వే ఒక్కడే ప్రత్యర్థి స్కోర్ కొట్టగా.. ఈ ఇద్దరి విధ్వంసంతో రెండో రోజు రెండో సెషన్‌లోనే కివీస్.. మూడొందల ఆధిక్యానికి చేరుకుంది. టీ బ్రేక్ సమయానికి న్యూజిలాండ్ 3 వికెట్ల నష్టానికి 423 రన్స్ కొట్టింది. క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్‌లో న్యూజిలాండ్ బ్యాటర్లు పరుగుల వరద కొనసాగిస్తున్నారు. జింబాబ్వే బౌలర్లను ఉతికారేస్తూ ఓపెనర్లు డెవాన్ కాన్వే(153 ), విల్ యంగ్(74) భారీ భాగస్వామ్యంతో పెద్ద స్కోర్‌కు బాటలు వేశారు. తొలి వికెట్‌కు 162 పరుగులు జోడించిన వీళ్లను ఎట్టకేలకు ట్రెవొర్ వాండు విడదీశాడు. యంగ్ ఔటయ్యాక వచ్చిన జాకబ్ డఫే(36) త్వరగా ఔటైనా.. కాన్వే తన జోరు చూపాడు. బౌండరీలతో చెలరేగిన ఈ లెఫ్ట్ హ్యాండర్ సెంచరీతో జింబాబ్వే స్కోర్‌ను దాటేసింది కివీస్. కాన్వే వెనుదిరిగే సమయానికి స్కోర్.. 345–3.

ఓపెనర్ దాడి నుంచి బ్రేక్ లభించిందని మురిసిపోయే లోపే హెన్రీ నికోలస్ (95 నాటౌట్), రచిన్ రవీంద్ర(51 నాటౌట్)లు క్రీజులో పాతుకుపోయారు. ప్రత్యర్థి బౌలర్ల సహనాన్ని పరీక్షిస్తూ.. స్కోర్ బోర్డును వేగంగా నడిపించారిద్దరూ. అర్ధ సెంచరీ భాగస్వామ్యంతో జట్టు స్కోర్ 400 దాటించారు. ఈ ఇద్దరినీ ఔట్ చేయలేక నానా తంటాలు పడగా టీ బ్రేక్ సమయానికి కివీస్ 302 పరుగుల ఆధిక్యం సాధించింది. ఇంకా 30 రోజుల ఆట మిగిలి ఉండడంతో అలవోకగా సౌథీ బృందం ఐదొందల మార్క్ అందుకోవడం ఖాయం.

# సిరాజ్‌కు షాక్..


## 'బాల్ ఆఫ్ ది సిరీస్' ఆకాశ్‌కే : సచిన్

అండరన్స్ – టెండూల్కర్ ట్రోఫీలో నిప్పులు చెరిగిన మహ్మద్ సిరాజ్ మాజీ ఆటగాడు సచిన్ టెండూల్కర్ షాకిచ్చాడు. మియా భాయ్‌కు తగిన గుర్తింపు రాలేదని అభిప్రాయపడిన సచిన్.. భారత జట్టు చరిత్రాత్మక విజయంలో కీలక పాత్ర పోషించిన అతడిని కాదని ఆకాశ్ దీప్‌ను ఎంచుకున్నాడు. ఐదు టెస్టుల సిరీస్‌లో 'బాల్ ఆఫ్ ది సిరీస్'గా ఆకాశ్‌కే ఓటేశాడు మాస్టర్ బ్లాస్టర్. జో రూట్‌ను బౌల్డ్ చేసిన బంతినే మాస్టర్ బ్లాస్టర్ బాల్ ఆఫ్ ది సిరీస్ అని చెప్పాడు. అలా అని సిరాజ్‌ను ప్రతిభను తాను తక్కువ చేయడం లేదని సచిన్ తాజాగా ఒక వీడియోలో వెల్లడించాడు. బర్మింగ్‌హమ్‌లో జరిగిన రెండో టెస్టులో గిల్ సేన సూపర్ విక్టరీతో సిరీస్ సమం చేసింది. ఆ మ్యాచ్‌లో ఆకాశ్ దీప్ క్రీజులో పాతుకుపోయిన జో రూట్‌ను అద్భుతమైన బంతితో క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆకాశ్ సంధించిన ఆ బంతినే సచిన్ బాల్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంపిక చేశాడు. 'నా దృష్టిలో జో రూట్‌ను బౌల్డ్ చేసిన ఆకాశ్ దీప్ బంతి అద్భుతం. అతడి వికెట్ తీయడం మ్యాచ్ ఫలితాన్నే మార్చేసింది. ఆకాశ్ విసిరిన బంతిని కాస్త ఆలస్యంగా ఆడాడు రూట్. భీకర ఫామ్‌తో పాటు టన్నుల కొద్దీ పరుగులు బాదిన రూట్‌ను ఔట్ చేయడం ద్వారా భారత జట్టు విజయావకాశాలు పెరిగాయి. అందుకే.. ఆ బంతిని బాల్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంచుకున్నా' అని సచిన్ వివరించాడు.



# షోకేస్

# సైన్స్



కొన్నివేల... లక్షల సంవత్సరాల క్రితమే వలసలు జరిగాయన్నది పరిశోధకుల నిశ్చితాభిప్రాయం. అప్పటి వరకూ లభించిన ఆధారాలు, అత్యాధునిక సైన్స్ విశ్లేషణలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. కేవలం శిలాజాలాలు, తవ్వకాల్లో లభించిన ఆనవాళ్లతో వలసలు జరిగిన క్రమాన్ని ఊహించడం కష్టం. అందుకే, డిఎన్ఎ ఆధారంగా వలస మార్గాలను నిర్ధారించే విధానాన్ని పరిశోధకులు అనుసరిస్తున్నారు. డిఎన్ఎలో ప్రత్యేకమైన జన్యు మార్కర్లు ఆధారంగా, శతాబ్దాల ముందు మన పూర్వీకులు ఏ దిశగా వలస వెళ్లారు, ఎక్కడ జీవించారు అన్నది పసిగట్ట వచ్చు.

# డిఎన్ఎ ఆధారంగా వలసల నిర్ధారణ



ఉదాహరణకు, మిటోకాండ్రియల్ డిఎన్ఎ (మాతృవంశపు లక్షణాలు) ఆధారంగా మనం 'మొదటి తల్లి' (Mitochondrial Eve) ఆఫ్రికాలో నుండే ప్రారంభమైందని గుర్తించగలిగాం. 'వై' క్రోమోసోమ్ ద్వారా పురుషుల వంశం ఎలా ప్రయాణించిందో పసిగట్టగలిగారు. అయితే, ఆఫ్రికా వెలుపల మనుషులు ముందే ఉన్నారని ఇప్పుడు కొన్ని డిఎన్ఎ మార్గాలు సూచిస్తున్నాయి. ఫలితంగా 'అవుట్ ఆఫ్ ఆఫ్రికా' సిద్ధాంతానికి బలమైన ప్రామాణిక ఆధారాలపై తర్జనభర్జనలు సాగుతున్నాయి. ఈ క్రమంలోనే ఎపిజెనెటిక్స్ ప్రభావాన్ని కూడా శాస్త్రవేత్తలు అధ్యయనం చేస్తున్నారు. మనిషి జన్యువులపై వాతావరణం చూపే ప్రభావాన్ని అధ్యయనం చేయడమే ఎపిజెనెటిక్స్. డిఎన్ఎ మాత్రమే కాకుండా, పర్యావరణం, ఆహారం, జీవన శైలి కూడా జన్యు అభివృద్ధిని ప్రభావితం చేస్తుందని ఎపిజెనెటిక్స్ స్పష్టం చేస్తున్నది. ఉదాహరణకు, హిమాలయాల్లో నివసించే ప్రజలలో హై ఆల్టిట్యూడ్ జన్యు లక్షణాలు ఉన్నాయి. వీటి మూలం డెనిసోవన్ డిఎన్ఎగా నిర్ధారించారు. అంటే, ఒక ప్రాచీన మానవ జాతి నుంచి వచ్చిన జన్యు లక్షణం, ప్రస్తుత కాలంలోని జీవన పరిస్థితులకు సరిపోయేలా మారుతుంది. మొత్తం మీద జన్యు విజ్ఞానం మనం ఒకే జాతి లేదా వంశానికి చెందిన వాళ్లం కాదు... అనేక రకాల పూర్వీకుల మిళితంలో ఏర్పడిన మానవ సముదాయం.

# రూపుదిద్దుకుంటున్న కొత్త గ్రహం!

విశ్వంలో ఒక కొత్త గ్రహం రూపుదిద్దుకుంటున్న వైనాన్ని ఖగోళ శాస్త్రవేత్తలు ఇటీవల గుర్తించారు. ఒక యువ నక్షత్రం చుట్టూ ఉన్న ప్రోటోప్లానెటరీ డిస్క్ చిత్రాలను సేకరించి, విశ్లేషించారు. వారి అధ్యయనాన్ని అనుసరించి, మన సౌర కుటుంబానికి కొన్ని లక్షల కాంతి సంవత్సరాల దూరంలో ఈ మార్పు సంభవిస్తున్నట్టు తెలుసుకున్నారు. వెరీ లార్జ్ టెలిస్కోప్ (విఎల్‌టి) మరియు దాని 'ఎరిస్' పరికరాన్ని ఉపయోగించి చేసిన ఈ ఆవిష్కరణ సంభావ్య గ్రహ ఏర్పాటును సూచిస్తున్నది. అక్కడి నక్షత్ర మండలంలో ఒక గ్రహం చురుగ్గా ఏర్పడడాన్ని గుర్తించినట్టు శాస్త్రవేత్తలు అంటున్నారు.



అదే నిజమైతే, ఖగోళ శాస్త్రవేత్తలు ప్రోటోప్లానెటరీ డిస్క్‌లో గ్రహం ఏర్పడటాన్ని ప్రత్యక్షంగా చూడడం బహుశా ఇదే మొదటిసారి కావచ్చు. యువ నక్షత్రాలను చుట్టుముట్టిన వాయువు, ధూళి మేఘాలు. ఇవి గ్రహం ఏర్పడటానికి ముడి పదార్థాలను అందిస్తాయి. హెచ్‌డి 135344బి నక్షత్ర పోటోప్లానెటరీ డిస్క్‌ను నేరుగా చిత్రీకరించడం ద్వారా ఈ ఆవిష్కరణ జరగడం గమనార్హం. శాస్త్రవేత్తలు సేకరించిన చిత్రాలు చిత్రాలు డిస్క్ లోపల ఒక గ్రహ నిర్మాణాన్ని వెల్లడిస్తున్నాయి. వీటిని నిశితంగా పరిశీలించిన శాస్త్రవేత్తలు, ఒక కొత్త గ్రహం ఏర్పడే అవకాశాలు చాలా ఉన్నాయని బలంగా వాదిస్తున్నారు. తన నక్షత్రం నుంచి ఈ సంభావ్య గ్రహం మన సూర్యుని చుట్టూ నెప్ట్యూన్ కక్ష్యలో తిరిగేటంత దూరంలోనే ఉంది. మొత్తం మీద ఈ అధ్యయనం, ఆ గ్రహం డిస్క్‌లోకి మార్గాలను చెక్కుతూ, మరింత పెరగడానికి పదార్థాలను సేకరించడానికి మార్గాలను సుగమమం చేస్తున్నది. ఈ అధ్యయనం, సంభావ్య గ్రహం యొక్క స్థానం గ్రహ నిర్మాణ సిద్ధాంతఅంచనాలకు అనుగుణంగా ఉంటుంది.


# హామీల అమలు బాధ్యత ప్రభుత్వానిదే

## నేదునూరి జ్యోతి



ప్రజాపక్షం/హసన్ పర్తి : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలో ముందు ఇచ్చిన ప్రతి హామీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి డిమాండ్ చేశారు. శుక్రవారం హసన్ పర్తి మండల కేంద్రంలో మెట్టు శ్యాంసుందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా నేదునూరి జ్యోతి హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ సంక్షేమ పథకాల గ్యారెంటీల పేరుతో ఆడబిడ్డ పెళ్లికి తులం బంగారం, బాలికలకు స్కూటీలు, వితంతు, దివ్యాంగుల పెన్షన్లు రెట్టింపు, ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ. 12000, యువతకు నిరుద్యోగ భృతి, వ్యవసాయ కార్మికులకు చేయూత లాంటి హామీలు ఇచ్చిందని, వెంటనే ఆ హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ఆగస్టు 20, 21, 22 తేదీలలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గాజులరామారంలో సిపిఐ తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలు జరగబోతున్నాయని తెలిపారు. మహాసభల్లో వర్తమాన రాజకీయాలని విశ్లేషిస్తూ భవిష్యత్తులో చేయవలసిన పోరాట కార్యక్రమ రూపకల్పన, నిర్మాణం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా హసన్ పర్తి మండల కేంద్రంలో సిపిఐ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు మోతే లింగారెడ్డి, భారత్ బచావో జిల్లా కార్యదర్శి దొమ్మాటి ప్రవీణ్ కుమార్, నిర్మాణ బాధ్యులు నేదునూరి రాజమౌళి, నాంపల్లి లక్ష్మయ్య, దుస్స వెంకటేశ్వర్లు, మూడెం రాజేందర్, ఆటో యూనియన్ నాయకులు లింగాల రాజు, రేణిగుంట పరుశురాములు, తాళ్లపల్లి రాజు, బైకాడి సంపత్, పిట్టల రాజు, ఆర్టీసీ మొగిలి, సంపత్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# క్లరికల్ సిబ్బంది సమస్యలు తక్షణమే పరిష్కరించాలి : ఎఐటియుసి



ప్రజాపక్షం/శ్రీరాంపూర్ : శ్రీరాంపూర్ ఒసిపి పరిధిలో విధులు నిర్వహిస్తున్న క్లరికల్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం గుర్తింపు కార్మిక సంఘం ఎఐటియుసి నాయకులు శుక్రవారం ప్రాజెక్ట్ ఆఫీసర్, మేనేజర్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసిబ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీ సైదా మాట్లాడుతూ వే బ్రిడ్జ్, రైల్వే కరస్పాండెన్సీ బాధ్యతలు నిర్వహిస్తున్న క్లర్కులకు అన్ని గనులు, విభాగాల్లో ఇచ్చినట్లుగా ఇన్సెంటివ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్లరికల్ సిబ్బంది వాహనాల కోసం ప్రాజెక్ట్ ఆఫీసు పరిధిలో పార్కింగ్ షెడ్డు నిర్మించాలన్నారు. ఓపెన్ కాస్ట్ గనిలో అంకితభావంతో పనిచేస్తున్న క్లరికల్ ఉద్యోగులను ఉత్తమ ఉద్యోగులుగా గుర్తించి స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రశంసాపత్రాలతో సన్మానించాలని కోరారు. పనికి తగినన్ని కంప్యూటర్లు, ప్రింటర్లు, అవసరమైన ఫర్నిచర్‌ను సమకూర్చాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, జిఎం కమిటీ చర్చల ప్రతినిధి బద్రి బుచ్చయ్య, క్లరికల్ పిట్ ఇన్చార్జి కట్ల రమేష్, సిబ్బంది బానేష్, సునీల్, శివ శంకర్, సంజయ్, జయబాబు, సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

# ధర్మస్థలి ఘటనలపై న్యాయవిచారణ జరిపించాలి

## కారకులను కఠినంగా శిక్షించాలి

## ఎన్ఎఫ్ఐడబ్ల్యు రౌండ్ టేబుల్ సమావేశం




ప్రజాపక్షం/ఖమ్మం : కర్ణాటక రాష్ట్రంలోని ధర్మస్థలిలో జరిగిన అమానవీయ ఘటనలు, హత్యలపై కేంద్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యు, ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. మతం మాటున మారణహోమం జరుగుతుందని ధర్మస్థలి హత్యలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో రౌండ్ టేండ్ సమావేశం నిర్వహించారు. పోటు కళావతి అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేండ్ సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నేతలు మాట్లాడుతూ ధర్మస్థలిలో అనేక మంది అమాయకుల ప్రాణాలను, మానాలను బలిగొన్నారని వారు ఆరోపించారు. మతం పేరుతో సుదీర్ఘ కాలం పాటు హత్యలు జరిగాయని, ఇందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశంలో మతం పేరుతో ప్రజల మధ్య విభజన తీసుకు రావడమే కాకుండా మతాన్ని అడ్డుపెట్టుకుని ఆగడాలకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. దీని వెనక ఏ స్థాయిలో ఉన్నా వారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా కార్యదర్శి ఏపూరి లతాదేవి, నాయకులు సిహెచ్ సీతామహాలక్ష్మి, ఎఐవైఎఫ్ నాయకులు నానబాల రామకృష్ణ, మద్దోజు శ్రవణ్, ఎఐఎస్ఎఫ్ నాయకులు ఇటికాల రామకృష్ణ, ఎఐటియుసి నాయకులు లక్ష్మి నారాయణ, ఐద్వా బాధ్యులు బండి పద్మ, మెరుగు రమణ, మాచర్ల లక్ష్మి, పిఒడబ్ల్యు బాధ్యులు గోకినేపల్లి లలిత, బి.ఝాన్సీ, లక్ష్మి, పిడిఎస్‌యు నాయకులు వెంకటేష్, యశ్వంత్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్ , నాయకులు చింతల రమేష్, సుభాష్‌రెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరూ స్పందించాలి...

## మహిళా సమాఖ్య సూర్యాపేట జిల్లా కార్యదర్శి దేవరం మల్లీశ్వరీ

హుజూర్‌నగర్ : ధర్మస్థలి ఘటన మానవ సమాజానికి మచ్చ లాంటిదని, ప్రతిఒక్కరూ ఈ ఘటనపై స్పందించాలని మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లీశ్వరీ అన్నారు. శుక్రవారం ధర్మస్థలి ఘటనను తీవ్రంగా ఖండిస్తూ జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో హుజూర్‌నగర్‌లోని మట్టపల్లి బైపాస్‌రోడ్‌పై ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మల్లీశ్వరీ మాట్లాడుతూ మహిళలపై మానవత్వాన్ని కలచివేసే ఘటనలు ఇంకా జరగడం శోచనీయమన్నారు. మహిళల భద్రత కొరకు ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు తెచ్చి వాటిని సక్రమంగా అమలు చేయాలన్నారు. మహిళలను గౌరవించని వారు ఎంతటివారైనా వదిలిపెట్టకుండా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళలపై రోజురోజుకు పెరుగుతున్న దాడులను అరికట్టేందుకు జాతీయ మహిళా సమాఖ్య పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మునగ సామ్రాజ్యం, లింగమ్మ, మంగమ్మ, మల్లమ్మ, మారమ్మ, లక్ష్మి, అరుణ, నరసమ్మ, దుర్గ, రేణుక, సాహితీ, శ్రీలత, వెంకటమ్మ, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.




# కార్మికుల రిటైర్మెంట్ వయస్సు 65 సంవత్సరాలకు పెంచాలి

## ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్

ప్రజాపక్షం/నిజామాబాద్ : కార్మికుల రిటైర్మెంట్ వయస్సు 65 సంవత్సరాలకు పెంచాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి ఆధ్వర్యంలో ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజ్, రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య, వ్యవసాయ మార్కెట్ యార్డువర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ప్రవీన్‌కుమార్‌గౌడ్ సమక్షంలో మార్కెట్ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సును 58నుంచి 61 కి పెంచి అమలు చేస్తున్న పరిస్థితుల్లో వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎలాంటి సౌకర్యాలకు నోచుకోని కార్మికులకు 65 సంవత్సరాలు పని చేసుకునే అవకాశం కల్పించాలని కోరామన్నారు. కార్మికుల శక్తిసామర్థ్యాలున్నంత కాలం పని చేసుకుంటారని వారికి ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని 50 కేజీల బస్తా తూకాన్ని అమలు చేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి వ్యవసాయ మార్కెట్ యార్డు హమాలీ యూనియన్ అధ్యక్షులు ఎం.పరశురాం, కార్యదర్శి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



# అడ్డగూడూరు అభివృద్ధికి పోరాడుదాం



సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి దామోదర్‌రెడ్డి

ప్రజాపక్షం/అడ్డగూడూరు : జిల్లా సమగ్ర అభివృద్ధికి పోరాడుతామని సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో సిపిఐ మండల కౌన్సిల్ ఆధ్వర్యంలో జరిగి సమావేశంలో యానాల మాట్లాడారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో అడ్డగూడూరు చివరి మండలం కావడంతో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. నియోజకవర్గం తుంగతుర్తి సూర్యాపేట జిల్లాలో ఉండడం, ఈ ప్రాంతం నుండి గతంలో అనేకమంది ఎమ్మెల్యేలుగా మంత్రులుగా ప్రాతినిధ్యం వహించినా అభివృద్ధి మాత్రం శూన్యం అన్నారు. ఇప్పటికైనా అడ్డగూడూరు మండలానికి సొంత కార్యాలయాలు ఏర్పాటు చేసి ప్రజల అవస్థలు తీర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై జిల్లా కలెక్టర్ ప్రజా ప్రతినిధుల వద్దకు తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి మండల సమగ్ర అభివృద్ధికి సిపిఐ జిల్లా సమితి పోరాడుతుందని ఆయన తెలిపారు. సమావేశంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఉప్పుల శాంతి కుమార్, మండల కౌన్సిల్ సభ్యులు కందుకూరి వెంకన్న, బొనుగసుదర్శన్ రెడ్డి, బెల్లి శ్రీకాంత్, సోలిపురం నాగిరెడ్డి, చెడే సుందరయ్య, శీలం వెంకన్న, తీగల సైదులు, మార్త వీరయ్య, ఉప్పుల శివచారి పాల్గొన్నారు.



తుర్కపల్లి : ఈనెల 19 నుండి 22 వరకు మేడ్చల్ జిల్లాలో జరిగే సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం తుర్కపల్లి మండల కేంద్రంలో జరిగిన సిపిఐ ముఖ్య నాయకుల సమావేశానికి యానాల ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నిరంతరం పేద ప్రజల పక్షాన నిలబడి పోరాడుతూ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. పేదల పక్షాన నిలబడేది ఎర్ర జెండా పార్టీ మాత్రమే అని ఆయన కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం బిసి బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టడంతో దానికి అన్ని రాజకీయ పార్టీల ఆమోదం తెలిపినా, కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న పార్లమెంట్‌లో ఆ బిల్లును ప్రవేశపెట్టకుండా ఆడుకుంటుందని ఆయన ఆరోపించారు. బిసి బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చి అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్ళెం కృష్ణ, ఎండీ ఇమ్రాన్, సిపిఐ మండల కార్యదర్శి సిలివేరు దుర్గయ్య, సహాయ కార్యదర్శి గుంటిపల్లి సత్తయ్య, నాయకులు కలకుంట్లసత్యనారాయణ, మోత్కూపల్లి రాములమ్మ, ధారావత్ నిమ్మ, రేణుక, సుగుణ, ఐయ్యగల్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ఘనంగా సెరినిటీ పాఠశాలలో రాఖీ పౌర్ణమి



**ప్రజాపక్షం/నాగారం:** అన్నా చెల్లెళ్ల అనుబంధం,అక్కా తమ్ముళ్ల అనురాగానికి ప్రతీక రక్షబంధన్ అని సెరినిటీ పాఠశాల ముఖ్య కార్యదర్శి నోముల వసంత అన్నారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని నాగారం, రాంపల్లి సెరినిటీ పాఠశాలల విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుని నేను నీకు రక్ష, నాకు నీవు రక్ష అని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రక్షాబంధన్ యొక్క విశిష్టతను తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలను పరిశీలించిన డిఇ ఉదయ భాస్కర్



**ప్రజాపక్షం/దుండిగల్ :** కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనెంబర్ 159,179 వెలసిన బహుళ అంతస్తు అక్రమ నిర్మాణంపై శుక్రవారం పలు దినపత్రికలలో వరుస కథనాలు రావడంతో ఇరిగేషన్ డిఇ. ఉదయ్ భాస్కర్ నిర్మాణాలను పరిశీలించారు. ఈ నిర్మాణం మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తనయుడి చామకూర భద్రారెడ్డిది కావడం విశేషం. ఈ నిర్మాణాలు పూర్తిగా ఫాక్స్ సాగర్ ఎఫ్.టీ.ఎల్ బఫర్ జోన్లలో నిర్మించడం హెచ్ఎండిఎ, మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం పట్ల పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో ఉన్నత అధికారులు పరిశీలించారు. హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ చర్యలు తీసుకోవాలని సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. సామాన్యుడు చిన్నపాటి నిర్మాణం చేపడితే నే హడావిడి చేసి కూల్చివేతలు చేపట్టే అధికారులు ఈ భారీ నిర్మాణంపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

## ఇందిరమ్మ ఇండ్లు నిరుపేదలకు వరం

### కాంగ్రెస్ 'బి'బ్లాక్ అధ్యక్షుడు మహేష్ గౌడ్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ఇందిరమ్మ ఇండ్లు నిరుపేదలకు ఒక వరం లాంటివని మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ లింగాపూర్ గ్రామంలో నిర్మాణం అవుతున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భగా వేముల మహేష్ గౌడ్ మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతికోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చిందని గుర్తు చేశారు. అర్హులైన పేదలందరికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు గుర్జకుంట నర్సింహ్మా, బర్ల అనిత, మాజీ వార్డు సభ్యులు నానావత్ సురేష్ నాయక్, మీసాల శ్రీను, మీసాల హేమలత, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత బ్రెస్ట్ కాన్సర్ క్యాంపు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడతాయని ఆర్మీ డెంటల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మమతా కౌశిక్ అన్నారు. గురువారం కాప్రా, జవహర్‌నగర్ ఆర్మీ డెంటల్ కాలేజ్ ఆధ్వర్యంలో ఉచిత బ్రెస్ట్ కాన్సర్ క్యాంప్‌ను కాప్రా, ఏఎస్ రావు నగర్ లయన్స్ క్లబ్ ఉచిత క్యాంపును నిర్వహించారు. మహిళలకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరం మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుందని లయన్స్ క్లబ్ సేవలను ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో బంజారాహిల్స్ సియాన్ క్లినిక్ డాక్టర్లు, లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు లయన్ శ్రీదేవి, కార్యదర్శి డాక్టర్ దినేష్, వరప్రసాద్, విజయకుమార్, పురుషోత్తంరెడ్డి, డాక్టర్లు మృణాళిని, ఇష్షిత్, తదితరులు పాల్గొన్నారు.

## జలమయమైన ప్రాంతాల్లో అప్రమత్తం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** భారీ వర్షాల కారణంగా ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లోని షిరిడినగర్ ప్రాంతంలో జలమయమైన ప్రాంతాల్లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, స్థానిక కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్‌లు శుక్రవారం పర్యటించారు. రోడ్లపై ఏర్పడ్డ గుంతలను పూడ్చటం, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలువకుండా జిహెచ్ఎంసి అధికారులతో కల్సి తగు ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. దీంతో పాటు అంటువ్యాధులు సోకకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంల లక్ష్మి కాంతరెడ్డి, వెంకటేష్‌యాదవ్, నిరంజన్, సత్యమూర్తి,బ్రహ్మయ్య, రామకృష్ణ, వహీం, తదితరులు పాల్గొన్నారు. గౌతంనగర్ డివజన్ పరిధిలోని మిర్జాలగూడ, చిన్మయిమార్గ్ తదితర ప్రాంతాల్లో జలమయమైన లోతట్టు ప్రాంతాలను బిఆర్ఎస్ శ్రేణులు మేకల రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేస్తే జరిమానా

### తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానాలు విధిస్తామని తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి హెచ్చరించారు. శుక్రవారం తూంకుంట మున్సిపాలిటి దేవరయాంజాల్‌లో బహిరంగ ప్రదేశంలో చెత్తవేసిన వారికి రూ.5వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ జ్యోతి మాట్లాడుతూ చెత్తను చెత్త తరలించే స్వచ్ఛ ఆటోల్లోనే వేయాలని సూచించారు. చెరువులు, కుంటలు, నిర్మానుష్య ప్రదేశాల్లో చెత్తను వేస్తే జరిమానాలు విధిస్తామని చెప్పారు. స్వచ్ఛ తూంకుంటగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. షాపింగ్ మాల్స్, వైన్ షాపులు, కిరాణ షాపుల చుట్టు పక్కల ప్రాంతాల్లో చెత్త కనిపించకూడదని అన్నారు. గతంలో ఎక్కడ పడితే అక్కడ చెత్తవేస్తే జరిమానాలు విధించామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్ రాంరెడ్డి, మహేందర్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.



## త్రివేణి టాలెంట్ పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** చింతల్‌లోని త్రివేణి టాలెంట్ పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కచెల్లెలు, అన్నదమ్ముల అనుబంధానికి ప్రతీకగా జరుపుకునే ఈ పండుగ స్ఫూర్తిని చాటుతూ విద్యార్థులు రక్షాబంధన్‌ను ప్రత్యేకంగా జరుపుకున్నారు. పాఠశాల విద్యార్థులు సమీపంలోని జీడిమెట్ల పోలీస్ స్టేషన్ సి ఐ. జి. మల్లేష్, బాలానగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సి.ఐ.పి. శ్రీనివాస్ రావుకు రాఖీలు కట్టి తమ సోదరభావాన్ని, గౌరవాన్ని చాటారు. సమాజానికి రక్షణ కల్పించే పోలీసులకు రాఖీ కట్టడం ద్వారా కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ వేడుకల్లో సిఆర్ఓ వెంకట రావు, సిఎస్ఓ సుబ్బారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కీర్తన, వైస్ ప్రిన్సిపాల్ నళిని, క్యాంపస్ ఇంచార్జ్ క్రాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

### హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాబోయే ఉప ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని హెచ్‌ఎఫ్ నగర్ కమిటీ హాల్‌లో జరిగిన రహమత్ నగర్ డివిజన్ బూత్ స్థాయి కమిటీ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకట్ స్వామి పాల్గొన్నారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో హైదరాబాద్ నగరంలో ఎన్నో సమస్యలు పరిష్కారం కాకుండా మిగిలిపోయాయని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని పరిష్కరిస్తున్నామని తెలిపారు. కేవలం హైదరాబాద్‌లోని 15 నియోజకవర్గాల్లో 55 వేల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని, జూబ్లీహిల్స్‌లో అయితే ఏకంగా 6 వేల కొత్త రేషన్ కార్డులు ఇచ్చామని, మరో 15వేల మంది పేర్లను రేషన్ కార్డుల్లో చేర్చామని వివరించారు. గతంలో దొడ్డు బియ్యం పంపిణీ చేసి ప్రజలను ఇబ్బంది పెట్టారని, ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గతంలో హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేసి, బ్రాండ్ ఇమేజ్ తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. హైదరాబాద్‌కు కృష్ణా, గోదావరి జలాలను కూడా కాంగ్రెస్ పార్టీ హయాంలోనే తీసుకొచ్చామన్నారు. జూబ్లీహిల్స్‌లో ఉన్న వీధి దీపాలు, పారిశుద్ధ్యం, తాగునీరు వంటి సమస్యలను పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని హామీ ఇచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కష్టపడాలని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో కార్పొరేషన్ చైర్మన్లు మల్‌రెడ్డి రాంరెడ్డి, ఈరవర్తి అనిల్, రాయల్ నాగేశ్వర రావు నాయకులు పాల్గొన్నారు.



## విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వీడాలి

### సిపిఐ కార్యదర్శి ఉమా మహేష్

**ప్రజాపక్షం/దుండిగల్ :** నిన్న కురిసిన వర్షానికి రింగ్ బస్తి, సిసల బస్తిలో అనేక గృహాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని, సమాచారం ఇచ్చినప్పటికి ఇంతవరకు పట్టించుకోకపోవడం, ప్రజలు స్టేషన్‌కు వస్తే వాళ్ళతో అమర్యాదగా మాట్లాడటం, ఇదే విషయాన్ని ఎఇ కు తెలియచేస్తే వారితో కూడా సిబ్బంది, ప్రసాద్ దురుసుగా మాట్లాడటం వారికి ప్రజల పట్ల ఉన్న నిర్లక్ష్యం తెలియచేస్తుందని అలాంటి సిబ్బందిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేసారు. మధ్యాహ్నం 12:30 కావస్తున్నా ఎఇ కార్యాలయానికి రాకపోవడం, సిబ్బంది ఎవరు ఉన్నారు, ఎవరు లేరు అనేది తెలియకపోవడం గమనార్హం అని, యథారాజా తథా ప్రజాగా, అధికారి, సిబ్బంది పనిచేస్తున్నారని, ఇప్పటికైనా పనులు సకాలంలో పూర్తి చెయ్యాలని, లేనిపక్షంలో ఇక్కడి నుండి వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి హరినాథ్‌రావ్, మండల కౌన్సిల్ సభ్యులు బాబు, ఇమామ్, జంబూ రాంరెడ్డిలు పాల్గొన్నారు.

## గర్భిణీలు క్రమం తప్పకుండా యాంటినాటల్ కేర్ పరీక్షలు చేయించుకోవాలి




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** గర్భిణీలు క్రమం తప్పకుండా యాంటినాటల్ కేర్ (గర్భ ధారణ పూర్వ సంరక్షణ పరీక్షలు) చేయించుకోని వారిని గుర్తించి ఆశావర్కర్లు, ఎఎంసిల ద్వారా కౌన్సిలింగ్ నిర్వహించి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి సూచించారు. యాంటినెంటల్ పరీక్షల ద్వారా గర్భిణీ స్త్రీలతో పాటు పుట్టబోయే బిడ్డ ఆరోగ్యాన్ని సంరక్షించేందుకు ఉపయోగపడుతుందని, ఈ విషయంలో గర్భిణీలు ఏ మాత్రం నిర్లక్ష్యం చేయవద్దని, తమ సమీప బస్తీ దవఖానాలు, పిహెచ్‌సి సెంటర్లకు వెళ్లి వైద్యులను క్రమం తప్పకుండా సంప్రదించాలని ఆయన కోరారు. శుక్రవారం ఆయన డిఎంహెచ్ఓ డాక్టర్ ఉమాగౌరితో కల్సి జవహర్‌నగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడ జరగుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పరిధి ప్రాంతాల్లో గర్భిణీ స్త్రీలను గుర్తించి యాంటినెంటల్ పరీక్షలు క్రమం తప్పకుండా చేయించటం ద్వారా సి సెక్షన్ (సిజేరియన్) వరకు వెళ్లకుండా ముందస్తు జాగ్రత్తల విషయంలో తగు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. పిహెచ్‌సెంటర్‌లో ఓపి, ఇన్‌పేషంట్లు, ల్యాబ్‌లు, ఫార్మసీ, విభాగాలను పరిశీలించి ప్రతి నెలా ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయన్న విషయాలను రిజిస్టర్ల ద్వారా చూసి తగు సూచనలు జారీ చేసారు. పిహెచ్‌సి సెంటర్ డా.సుష్మ ఆస్పత్రిలో కొనసాగుతున్న వైద్య సేవలను కలెక్టర్‌కు వివరించారు.



## ముఖ్యమంత్రి సహాయనిధి అందజేత

**ప్రజాపక్షం/దోమ:** పరిగి నియోజకవర్గంలోని దోమ మండల పరిధిలోని గుండాల్ గ్రామానికి చెందిన సువర్ణ కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకలు రామచంద్రరెడ్డి అందజేవారు. ఈ సందర్భంగాఅయన మాట్లాడుతూ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సహకరంతో ముఖ్యమంత్రి సహయనిధి నిరుపేదల వరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దస్తాయ్య, శ్రీను ,అంజయ్య, ,మల్లేష్ గౌడ్ , కాశప్ప తదితరులు పాల్గోన్నారు.



## మర్రి లక్ష్మారెడ్డి కళాశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

**ప్రజాపక్షం/దుండిగల్ :** మర్రి లక్ష్మారెడ్డి కళాశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మల్లాది నాగార్జున మిస్టర్ మారియో డేవిడ్ మనీష్ దుబే పాల్గొని ఉత్తీర్ణులైనటువంటి విద్యార్థులకు పట్టాలను అందజేశారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.శ్రీధర్ మాట్లాడుతూ, దేశంలోని బాధ్యతాయుతమైన పౌరులుగా గ్రాడ్యు యేట్లను రూపొందించడంలో ఉపాధ్యాయుల యొక్క కృషి చాలా గొప్పదని అంకిత భావం ద్వారా నేర్చుకోవడం అనేది ఒక నిరంతర ప్రక్రియ అని నేటి సమాజంలో ఆధునికత అగ్రస్థానం లభిస్తున్న విషయాన్ని దష్టిలో పెట్టుకుని నూతనా అవిష్కరణలతో అభివృద్ధి వైపు పయనించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మురళి ప్రసాద్, కళాశాల బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ అనుశ్రేయ రెడ్డి, చైర్మన్ మర్రిలక్ష్మణ్ రెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అర్ణబ్ మాలిక్, కళాశాల డీన్ ఆఫ్ అకాడమిక్స్ మరియు వివిధ విభాగ అధిపతులు, అధ్యాపకులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ వేడుకలో కంప్యూటర్ సైన్స్ , ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్, బి ఫార్మసీ మాస్టర్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ వంటి వివిధ శాఖలకు చెందిన విద్యార్థులు తమ డిగ్రీలను పొందారు. కాలేజ్ ప్లేస్మెంట్ సెల్ ద్వా రా అర్హత కలిగిన గ్రాడ్యు యేట్లలో 86 మంది43 ప్రసిద్ధ సంస్థలలో ఉపాధి అవకాశాలు వస్తాయని అన్నారు.

## విద్యుత్ షాక్‌తో యువ రైతు మృతి



**ప్రజాపక్షం/తాండూర్ :** తాండూర్ నియోజకవర్గంలోని యాలాల్ మండల పరిధిలోని ముద్దాయిపేట్ గ్రామంలో విద్యుత్ షాక్‌తో యువరైతు పి.రమేష్ మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పి.రమేష్ తనకున్న వ్యవసాయ పొలంలో వరి పంటను సాగుచేస్తున్నారు. వరి పంటకు నీరు అందించడానికి పొలానికి వెళ్లాడు. అదే సమబోరుకున్న విద్యుత్ వైర్లు తెగిపోవడంతో వాటిని సరిచేసే క్రమంలో విద్యుత్ షాక్ తగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. అందరితో కలివిడిగా ఉండే రమేష్ మృతి చెందడంతో గ్రామస్తులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

## భూభారతి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

### అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** భూభారతి, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ధరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, ఏవైనా సాంకేతిక సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొని రావాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. అపరిష్కృతంగా ఇంకా ఎన్ని దరఖాస్తులున్నాయని ప్రశ్నిస్తూ జాప్యానికి కారణాలేమిటని శుక్రవారం మూడుచింతలపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి అధికారులను ప్రశ్నించారు.

ఏవైనా సాంకేతికపరమైన ఇబ్బందులు ఉంటే వెంటనే సరిదిద్దుకొని దరఖాస్తులను మాత్రం సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తుల్లో ఎన్ని పరిష్కారమయ్యాయంటూ వాటిని పరిశీలించారు.

## వికారాబాద్ జిల్లా ప్రజలకు స్పీకర్ రాఖీ పండుగ శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/వికారాబాద్ :** వికారాబాద్ నియోజకవర్గం ,వికారాబాద్ జిల్లా ప్రజలకు రాఖీ పండుగా శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ , అన్నా చెల్లెలు ,అక్కా తమ్ముళ్ళు అనుబంధానికి ప్రతీక రక్షా బంధన్,తన సోదరుడు గొప్పగా ఉండాలని ,తనకు కొండంత అండగా నిలవాలని ఆకాంక్షిస్తూ సోదరి కట్టే రక్ష రాఖీ ,కష్టాలు ,ఆపదలలో తనకు రక్షణగా ఉండాలని గుర్తు చేస్తు సోదరీమణులు తమ సోదరులకు రాఖీని కడతారు అని అన్నారు.

అప్యాయతలు ,అనురాగాలు ,ఆనందోత్సహలతో అన్నా చెల్లెల్లు అక్కా తమ్ముళ్లు రాఖీ పండగాను జరుపుకోవాలని కోరుకుటంన్నాని స్పీకర్ ప్రసాద్‌కుమార్ తెలిపారు.



## స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

**ప్రజాపక్షం/కాప్రా:** స్వయం ఉపాధి ఎంచుకొని ఆర్థికంగా ఎదగాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఎస్‌రావు నగర్ డివిజన్‌లోని కుషాయిగూడలో సుజాత దంపతులు ఏర్పాటు చేసుకొన్న బాలాజి మెడికల్ దుకాణాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. వినియోగదారులకు మందులివ్వటంలో ఎప్పటికప్పుడు ఎక్స్పైరీ డేట్‌లు పరిశీలించుకోవాలని సూచించారు. నాచారం కార్పొరేటర్ సైజన్ శేఖర్, బిఆర్ఎస్ శ్రేణులు మహిపాల్‌రెడ్డి, కుమారస్వామి, రహీం, మురళి, బద్రుద్దీన్, మహేష్‌గౌడ్, సతీష్ రెడ్డి, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగకరం

**ప్రజాపక్షం/కాప్రా :** అత్యవసర పరిస్థితుల్లో చికిత్సలు పొందేందుకు పేద కుటుంబీకులకు సిఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని హెచ్‌బి కాలనీ కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ అన్నారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో ఫేజ్1 ప్రాంతంలో నివసించే మన్యం నరేష్‌కు మంజూరైన రూ.24 వేలు, రాజీవ్‌నగర్ నివాసి గొర్ల శ్రీలతకు రూ. 19,500 చెక్కులను శుక్రవారం శివప్రసాద్, రాంమోహన్రావ్, గోవిందరెడ్డి, నిసార్, అహ్మద్ గోరి, నరేందర్‌లతో కల్సి అందించారు.

# పోలింగ్ కేంద్రాలకు బూత్ స్థాయి ఏజెంట్లు తప్పనిసరి

### కలెక్టర్ ప్రతీక్‌జైన్



**ప్రజాపక్షం/వికారాబాద్:** ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు పోలింగ్ కేంద్రాలకు బూత్‌స్థాయి ఏజెంట్లను తప్పని సరిగా నియమించుకోవాలని శుక్రవారం కలెక్టర్ కార్యాలయం లో పోలింగ్ స్టేషన్‌ల హేతుబద్ధీకరణ సన్నాహాలు, కొత్త పోలింగ్ స్టేషన్‌ల ఏర్పాటుతో పాటు భవనాల గుర్తింపు , తదితర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో బూతు స్థాయి ఏజెంట్ల ప్రాధాన్యత ఎంతో అవసరమని వంద శాతం ఏజెంట్ల నియామకానికి ప్రత్యేక చొరవ చూపాలన్నారు.

ఏజెంట్ల నియామకం ఆగస్టు 14లోపు పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో 1200 మంది కంటే ఎక్కువ మంది ఓట ర్లు ఉండకూడదని నిబంధనల మేరకు ఎన్నికల కమిషన్ అనుమతి మేరకు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయవలసి ఉంటుందని ఆయన తెలిపారు. జిల్లాలో 118 పోలింగ్ కేంద్రాలలో 1200కు పైగా ఓటర్లు ఉన్నట్లుగా గుర్తించి సిద్ధంగా ఉంచినట్లు కలెక్టర్ తెలిపారు.

ఓటరు జాబి తాలో మార్పులు చేర్పులు చేసుకునే విధంగా ప్రజలకు చేరే విధంగా చూడాలని కలెక్టర్ సూచించారు. 100 సంవత్సరాలు పూర్తియిన ఓటర్లను గుర్తించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కుటుబంలోని ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రాంలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని రాజకీ య పార్టీల ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు ఏవైనా సందేహాలు , డూప్లికేట్ ఓటర్ల వివరాలతో పాటు 4 నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం సుపరింటెండెంట్ నేపత్ అలీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి రామిరెడ్డి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

**స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకులను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలన్నారు. వేడుకలకు వచ్చే అతిథిలకు గౌరవ వందనం తో పాటు బందోబస్త్ ఏర్పాట్లు చేయాల ని కలెక్టర్ తెలిపారు. వేడుకలకు విద్యుత్ అంతరాయం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పాఠశాలల విద్యార్థినీ విద్యార్థు లు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, జిల్లా రెవెన్యూ అధికారి మంగీలాల్, అడిషనల్ ఎస్పీ మురళీధర్, ఆర్‌డిఓ వాసు చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ ఒక శక్తిగా పనిచేస్తుంది

### వైద్య ఆరోగ్యశాఖ డాక్టర్ లలితాదేవి

**ప్రజాపక్షం/వికారాబాద్ :** ఆగస్టు 11వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం ను నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యఅధికారి డాక్టర్ లలితా దేవి తెలిపారు. వికారాబాద్ జిల్లాలోని 1నుండి 19 సంవత్సరాల వయస్సు గల 2,34,632 మంది బాలబాలికల అందరికీ పాఠశాలలు ,కళాశాలలు ,అంగన్వాడి కేంద్రాలలో చదువుతున్నటువంటి విద్యార్థులకు, బడికి వెళ్లని పిల్లలకు కూడా 1నుండి 19సంవత్సరాల వయస్సు గల వారందరికి నులిపురుగు నిర్మూలన టాబ్లెట్ అల్బెండజోల్ మాత్రమే వేయడం జరుగుతుందని తెలిపారు. 19 సం.ల వయస్సులోపు వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేసే విధంగా పాఠశాల ఉపాధ్యాయులు లేదా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని కోరారు. నులి పురుగులు కలిగిన పిల్లలలో రక్తహీనత అలసట, బుద్ధి మాంద్యం, శారీరక, మానసిక ఎదుగుద లోపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి కాబట్టి పిల్లలు చదవులలో వెనుకబడే అవకాశం ఉంటుంది.

పిల్లల్లో ఎదుగుదల లేకుండా ఇబ్బంది పడే పిల్లలకు నులిపురుగు నివారణ మాత్ర ఆల్బెండజోల్ అనేది ఒక శక్తి మాదిరిగా పనిచేసి నులి పురుగులను నివారించి వాళ్లు తీసుకున్న ఆహార మొత్తం శరీరానికి పట్టేలా సహాయ పడుతుంది.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్
GREATER HYDERABAD

## న్యాయవాది ఆత్మహత్య



ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం : న్యాయవాది ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబందించిన వివరాలు పోలీసులు తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం చర్లపటేల్ గూడ గ్రామానికి చెందిన న్యాయవాది పండాల నరేందర్‌గౌడ్ (34) గురువారం అర్ధరాత్రి సమయంలో జెబి వెంచర్‌లో ఉన్న తన వ్యవసాయ క్షేత్రం వద్ద ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. అదే రాత్రి పోలీసులకు గ్రామస్తులు ఇచ్చిన సమచారం మేరకు హుటహుటిన సంఘటన స్థలానికి చేరుకొని ఆత్మహత్యకు గల కారణాలు పరిశీలించి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు సిఐ తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలకు సిద్ధం కావాలి

సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



ప్రజాపక్షం/సరూర్‌నగర్ : ప్రజాసమస్యల పరిష్కారానికి ఉద్యమాలకు సిద్ధం కావాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యధర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లాలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా ఉంటూ రాబోయే కాలంలో చేపట్టబోయే ప్రజా ఉద్యమాలలో పాల్గొనాలని ఆయన కోరారు. శుక్రవారం సరూర్‌నగర్ డివిజన్ శంకర్‌నగర్‌లో భారత కమ్యూనిస్ట్ పార్టీ సిపిఐ భగత్‌సింగ్‌నగర్ ఫేస్1 శాఖ కార్యధర్శులు జిల్లెల కృష్ణ, ఎం.డి మహబూబ్ ఆధ్వర్యంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యధర్శిగా మూడవ సారి ఎన్నికైన సందర్భంగా పాలమాకుల జంగయ్యకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని తెలిపారు. బస్తీలలో మురికివాడల్లో డ్రైనేజీ, మంచినీటి, రోడ్లు వంటి అనేక సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నారని వారి సమస్యలపైన ఎప్పటికప్పుడు స్పందించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం సిపిఐ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైన జిల్లెల కృష్ణ, మహబూబ్‌లను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు పానుగంటి పర్వతాలు, ఎండి ఫైమీద, సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు, సరూర్‌నగర్ మండల కార్యధర్శి బాతరాజు నర్సింహ, నాయకులు ఇదిబాయ్, శ్యామలమ్మ, భాగ్య, సాహెబ్, ప్రసాద్ పాల్గొన్నారు.

## సిపిఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి : రామకృష్ణ



ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : సిపిఐ రాష్ట్ర నాల్గవ మహాసభలు ఆగస్టు 19నుంచి 22వరకు మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్‌లోని గాజులరామారంలో జరుగనున్నాయని, మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గసభ్యులు రామకృష్ణ, రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు చందుయాదవ్ కోరారు. శుక్రవారం మహాసభల పోస్టర్ విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సిపిఐ ఆధ్వర్యంలో బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారినికి నిరంతరం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఐ శేరిలింగంపల్లి సహాయకార్యదర్శి సుధాకర్, మండల నాయకులు తుపాకుల రాములు, నారయణ, సురేష్ ముదిరాజ్, రఘు భాస్కర్, కాసిం,వెంకట్, సురేఖ, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు నితీష్, తేజ, దేవేందర్ యాదవ్, సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అవినితి నిర్మూలనే లక్ష్యం



ప్రజాపక్షం /ఖైరతాబాద్ : సమాచార హక్కు చట్టంతో అవినీతిని నిర్మూలించడమే తమ లక్ష్యమని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డా. చంటి ముదిరాజ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటుచేసిన కమిటీ రంగారెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ జిల్లా ల సభ్యుల సదస్సుకు చంటి ముదిరాజ్ ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. ప్రజలు సమాచారాన్ని పొందే హక్కు పొందటంలో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ సహాయపడుతుందన్నారు. సమాచార హక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలుకు, పర్యవేక్షణకు ప్రభుత్వంతో కలిసి కమిటీ పనిచేస్తుందన్నారు. కమిటీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ముచ్చర్ల మల్లేశ్ అధ్యక్షత వహించిన ఈ సదస్సులో కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సూర స్రవంతి, ప్రధానకార్యదర్శి వెంకటేశం, వర్కింగ్ ప్రెసిడెంట్ చింతల రాఘవేందర్ ముదిరాజ్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.దిలీప్‌రావు, ఉపాధ్యక్షులు గోపినాథ్ కట్టెకోల తదితరులు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలతో ఆత్మ సంతృప్తి

ప్రజాపక్షం/ఖైరతాబాద్ : సేవా కార్యక్రమాలతో ఆత్మ సంతృప్తి కలుగుతుందని అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా అన్నారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో రాధే రాధే గ్రూప్ హైదరాబాద్ ప్రథమ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డబ్బుకు ప్రాధాన్యం లేదని, మనత ఉండేవి మన సంకల్పం, సంస్కారాలు మాత్రమేనన్నారు. కార్యక్రమంలో సతీశ్ గుప్తా, రామ్ ప్రకాశ్ అగర్వాల్, సునీతా అగర్వాల్, జగత్ నారాయణ్ అగర్వాల్, రాజ్‌కుమారి అగర్వాల్, ఇ–జగన్ చంపాపేట్ , శ్యామ్ సుందర్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాలలో విద్యుత్ భద్రత చేపట్టాలి

విద్యుత్ డిఇకి కార్పొరేటర్ బద్దం ప్రేమ్ వినతి



ప్రజాపక్షం/సరూర్‌నగర్ : గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విద్యుత్ భద్రత చర్యలు చేపట్టాలని గడ్డిఅన్నారం డివిజన్ కార్పోరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి ఆధికారులను కోరారు. శుక్రవారం ప్రగతినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి అస్మాన్‌ఘాట్ లోని డిఈ విష్ణువర్ధన్‌రెడ్డి కి కార్పోరేటర్ ప్రేమ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పోరేటర్ మాట్లాడుతూ ప్రగతినగర్ కమ్యూనిఘాట్ వద్ద ప్రమాదకరంగా ఉన్న కరెంట్ వైర్లు ఎల్‌టాబ్ వైర్లుగా మార్చాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ వాసులు అనికేత్, కాజేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ‘హిమాయత్‌సాగర్’ను సందర్శించిన అధికారులు

ప్రజాపక్షం/రంగారెడ్డి : రాజేంద్రనగర్ మండలంలోని హిమాయత్ సాగర్ చెరువు నాలుగు గేట్లను ఎత్తిన సందర్భంగా రంగారెడ్డి కలెక్టర్ సి. నారాయణరెడ్డి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి గేట్లను, చెరువులోని నీటి సామర్థ్యాని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదిలినందున పరివాహక ప్రాంతాల్లో వాస్తవ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ వాస్తవ పరిస్థితిలను ఎప్పటికప్పుడు పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని తెలిపారు. రానున్న రెండు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సామాజిక మాధ్యమాలలో అవగాహన కల్పించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని, అక్కడ అన్ని సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ సూచించారు. అన్ని





శాఖల అధికారులు సమన్వయంతో ప్రతి సమస్యకు తక్షణ పరిష్కారం చూపించాలని, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురి కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. గురువారం రాత్రి శేరిలింగంపల్లి, షాద్‌నగర్, మరికొన్ని ప్రాంతాల్లో 7 నుంచి 10 సెంటి మీటర్ల వర్ష పాతం నమోదు అయినందున, దీనిపై ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, జిల్లా మంత్రి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నందున జిల్లా యంత్రాంగం కూడా ఎలాంటి సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉన్నదని ప్రజలు అధికారులకు సహకరించాలని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శాఖలకు చెందిన జిహెచ్‌ఎంసి అధికారులతో పాటు ఇరిగేషన్ ఇఇ సురేష్ బాబు, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## కాలనీవాసుల ఐక్యతతో అభివృద్ధి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

హైకోర్టు కాలనీ ఆర్చ్ నిర్మాణానికి శంకుస్థాపన



ప్రజాపక్షం/హయత్ నగర్ : కాలనీవాసుల ఐక్యతతో అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. శుక్రవారం హయత్ నగర్ డివిజన్ పరిధిలోని హైకోర్టు కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న ఆర్చి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీల అభివృద్ధికి తన సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీకార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, కటిక అరవింద్ రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘము ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు,పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్య రాకుండా చర్యలు

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ప్రజాపక్షం/షాద్‌నగర్ : విద్యుత్ సమస్య రాకుండా అధికారులు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ షాద్‌నగర్ డివిజన్‌లో విద్యుత్ స్థంబాలు, ట్రాన్స్ ఫార్మర్ల కోసం అన్నదాతలు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని వివరించారు. రైతులు పడుతున్న విద్యుత్ సమస్యలను నియంత్రించేందుకే ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి షాద్‌నగర్ నియోజకవర్గానికి పెద్ద ఎత్తున విద్యుత్ స్థంబాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు తీసుకువచ్చినట్లు తెలిపారు. ఎక్కడ విద్యుత్ సమస్య ఉన్నా తక్షణమే అక్కడ నూతన ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు విద్యుత్ సామాగ్రిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మరమ్మత్తులను నోచుకొని ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తవాటిని బిగించి రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అంధించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యుత్ సబ్ స్టేషన్‌లో ప్రత్యామ్నయంగా కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులో పెట్టుకునేందుకు కృషి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఎక్కడ కూడా లోవోల్టేజీ



సమస్య అనేది లేకుండా ఉండాల్సిన బాధ్యత అధికారులపై ఎంతైనా ఉందని అన్నారు. విద్యుత్ పరికరాల్లో ఎమైన ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకువెళ్ళి అవసరం ఉన్న మేరకు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటానని వివరించారు. పట్టణ ప్రాంతాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యను నియంత్రించేందుకు తగిన సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. వర్షాకాలంలో అధికారులు జాగ్రత్త గా వ్యవహరించాలన్నారు. సమావేశంలో హరినాథ్‌రెడ్డి, జంగ నర్సింహ్మా, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, వీరేష్, కృష్ణారెడ్డి, రాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, రఘునాయక్, చెంది తిరుపతిరెడ్డి, విద్యుత్ శాఖ డిఇ, ఎడి, ఎఇలు పాల్గొన్నారు.

## ప్రజాపాలనకు పునాదులు వేసిన బహుజన యోధుడు సాయన్న

ఘనంగా సాయన్న జయంతి

ప్రజాపక్షం/శంషాబాద్ : నిజాం పాలనలో తెలుగు భూములపై చిగురించిన ప్రజా తిరుగుబాట్లకు ప్రతీకగా నిలిచిన మహానాయకుడు పండుగ సాయన్న జయంతి వేడుకలు శుక్రవారం శంషాబాద్ బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పండుగ సాయన్న జీవిత చరిత్రపై ప్రసంగించిన నాయకులు, సాయన్నను కేవలం ధనవంతుల నుంచి దోచుకుని పేదలకు పంచే రాబిన్‌హుడ్‌గానే కాక, స్వతంత్ర పాలన కలల వీరుడిగా గుర్తించాలన్నారు. సాయన్న జీవిత కాలం (1860–1900) నాటి తెలంగాణ భూస్వామ్య, అధికారి ఆధిపత్యానికి వ్యతిరేకంగా సాగిన ప్రజా శాసన యుద్ధానికి నిదర్శనం అన్నారు. దేశముక్‌లు, పటేలు, కరణాలు వంటి ఆధిపత్య వర్గాలను ఎదిరించి, ప్రజల మద్దతుతో తనకు తానే పాలనా వ్యవస్థను నెలకొల్పే ప్రయత్నం చేసిన నాయకుడు పండుగ సాయన్న అన్నారు. ఆధిపత్య వర్గాల కుట్ర వల్ల, నిజాం అధికారుల చేతిలో సాయన్న మరణించాడన్నారు. నేటికీ దర్శనం మొగులయ్య వంటి బిక్షుక గాయకులు 12 మెట్ల కిన్నెరపై పండుగ సాయన్న వీరగాథను పాడుతూ, ప్రజల హృదయాల్లో ఆయన్ని అజరామరంగా నిలుపుతున్నారని



తెలిపారు. కార్యక్రమానికి శంషాబాద్ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మెరుగు సురేష్ ముదిరాజ్, మున్సిపాలిటీ అధ్యక్షుడు బొబ్బిలి మనోజ్ ముదిరాజ్ నేతృత్వం వహించారు.ప్రధాన అతిథిగా రంగారెడ్డి జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు బైరమణి మల్లేష్ ముదిరాజ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ యాటకరి సిద్దేశ్వర్ ముదిరాజ్, సిద్ధాంతి సంఘం అధ్యక్షుడు బొబ్బిలి కృష్ణయ్య ముదిరాజ్, 17వ వార్డు కౌన్సిలర్ మేకల వెంకటేష్ ముదిరాజ్, మహేందర్, కుందేళ్ల బిక్షపతి, ఆనంద్, మురళి, రాము, బాబి, బండి రమేష్, జరుకుంది శంకర్, మాలి, రాజు సిద్ధులు, కన్నా, ఎయిర్‌పోర్ట్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## శిల్పాకళావేదికలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఫైనాన్స్ సమ్మిట్ ఏర్పాటు

ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : మాదాపూర్‌లోని శిల్పాకళావేదికలో దిఇన్‌స్ట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శిల్పాకళావేదికలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ (డిఎక్స్) ఫైనాన్స్ సమ్మిట్ 2025ను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసిఎఐ అధ్యక్షుడు సిఎ చరణ్‌జోత్ సింగ్ నందా, ఉపాధ్యక్షుడు సిఎ ప్రసన్నకుమార్ డి, డిఎఎబి చైర్మన్ సిఎ దయానివాస్ శర్మ, ఉప చైర్మన్ సిఎ అర్పిత్ జగదీష్ కాబ్రాలు హాజరై ప్రారంభించారు. ఐసిఎఐ అధ్యక్షుడు సిఎ చరణ్‌జోత్ సింగ్ నందా మాట్లాడుతూ అన్నిరంగాలలో సైబర్ భద్రత పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.




## అధికారుల తీరుపై కార్పొరేటర్ ఆగ్రహం



ప్రజాపక్షం/హయత్ నగర్ : గురువారం రాత్రి కురిసిన భారీవర్షాలతో మన్సూరాబాద్‌లోని లోతట్టు ప్రాంతాలైన గణేష్ నగర్, మన్సూరాబాద్ వికర్ సెక్షన్ కాలనీ లు జలమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అక్కడికి చేరుకొని అర్ధరాత్రి వరకు కార్పొరేటర్ జిహెచ్‌ఎంసి అధికారులతో కల్సి ప్రజలకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకున్నారు. చెరువులోకి నీరు వచ్చేవిధంగా చెర్యలు తీసుకోవాలని ఎన్ని సార్లు వినతిపత్రాలు ఇచ్చిన ఇరిగేషన్ అధికారులు పాటించుకోవటంలేదన్నారు. కాలనీ వాసుల కొరకు కెబిఆర్ ఫంక్షన్ హాల్ నుండి ప్రెస్ కాలనీ వరకు నిర్మించే ఓపెన్ వాటర్ డ్రైన్ పనులు త్వరలో మొదలు అవుతాయి అని కాలనీ వాసులకు భరోసా ఇచ్చారు.

## బిసిలకు ద్రోహం చేస్తున్న బిజెపికి గుణపాఠం చెప్పాలి

మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్

ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: బిసిలకు ద్రోహం చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలందరు సిద్ధం కావాలని షాద్‌నగర్ మార్కెట్ కమిటి డైరెక్టర్ కరుణాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం షాద్‌నగర్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ బీసిలకు స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు విద్య, ఉద్యోగ రంగాల్లో మేలు జరగాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 42శాతం రిజర్వేషన్ తీసుకువస్తే కేంద్రంలో ఉన్న బిజెపి మాత్రం అడ్డుకునేందుకు కుట్రలు చేస్తుందని ఆరోపించారు. సమాజంలో 56శాతంపైగా ఉన్న బీసిలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా వెనుకడి ఉన్నారని, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78ఏళ్లు అవుతున్న బీజిలకు ఏనాడు తగిన వాట దక్కలేదని మండిపడ్డారు. కాంగ్రెస్



పార్టీ ఎన్నికల్లో బీసిలకు 42శాతం వాటా ఇస్తామని చెప్పిందని, అందుకు అనుగుణంగానే ఇచ్చేందుకు యత్నిస్తుంటే కేంద్ర ప్రభుత్వం అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో జెఏసి నేతలు టిజి శ్రీనివాస్, కర్ణకోట రవీంధ్రనాథ్, కరుణాకర్, నక్క బాల్‌రాజ్, నర్సింలు గౌడ్, యాదగిరి, శ్రీధర్, ఎల్లోజీ, బిజిలి సత్యం, తిరుమలయ్యలు పాల్గొన్నారు.

## అధికారులు అప్రమత్తతతో చర్యలు చేపట్టాలి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి

ప్రజాపక్షం/రంగారెడ్డి: జిల్లాలో గత రాత్రి నుంచి కురుస్తున్న భారీవర్షాల నేపథ్యంలో ఏ విధమైన ఆస్తి,ప్రాణనష్టం వాటిల్లకుండా అన్ని శాఖల అధికారులు అప్రమత్తతతో ఉండి పటిష్టమైన చర్యలు చేపట్టాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా అధికారులు,ఆర్‌డిఒలు, తహసీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లతో గత రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలు, రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గురువారం రాత్రి కురిసిన అకాల వర్షంతో, ఇంకా రెండు రోజులు వర్షాలు ఉన్నందున ప్రజలకు అసౌకర్యం కలగకుండా మున్సిపాల్టీలు, గ్రామ పంచాయతీల పరిధిలో అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు.అదే విధంగా వర్షం పడే సమయంలో విద్యుత్ స్తంబాల సమీపంలో ఉండకూడదని, కాలువల ప్రవాహం అధికంగా ఉన్నప్పుడు రాకపోకలు జరగకుండా చూడాలని, క్షేత్ర స్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండి, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో ఆర్డీఓలు, తహసీల్దార్లు తమ పరిధిలో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేసుకోవాలని, ఎక్కడైనా వరదలు వచ్చి, పాత భవనాలు కూలినట్లయితే వారిని సమీపంలోని గ్రామ పంచాయితీ భవనాలు, కమ్యూనిటీహాళ్లలో ఆశ్రయం కల్పించాలని ఆయన సూచించారు. జిహెచ్‌ఎంసి పరిధిలో విపత్తు సంభవించినప్పుడు హైడ్రా, డిఆర్‌ఎఫ్, ఆర్‌అండ్ బి, బృందాలకు సమాచారం అందించాలని, వారి కంట్రోల్ రూం నెంబర్లకు కూడా తెలియజేసినట్లయితే, వారు వెంటనే స్పందించి ఆప్రాంతానికి చేరుకుంటారని మున్సిపల్ కమిషనర్లకు ఆయన సూచించారు. నెక్నాపూర్‌లో వర్షపునీరు కొన్ని కాలనీలో ఉన్నట్లు, మాదాపూర్ లో ఇళ్లు, కాంపౌడ్ వాల్ వరదల్లో చిక్కుకున్నట్లు సమాచారం ఉందని, దానికి అన్ని సహాయ సహకారాలను అక్కడి అధికారులు అందించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ రెండు రోజులు ప్రతి అధికారి,వారి శాఖల సిబ్బంది హెడ్‌క్వార్టర్లోనే అందుబాటులో ఉండాలని, ఎలాంటి సెలవులు కాని పెట్టకూడదని, ఎక్కడైనా విపత్తు సంభవిస్తే వెంటనే స్పందించాలని ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు కలుగకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ వర్షాలు, వరదల వల్ల ఏ విధమైన ఆందోళనలు చెందకూడదని, వరదలు, ప్రమాదాలు సంభవిస్తే అత్యవసర పరిస్థితుల్లో కలెక్టరేట్ కంట్రోల్ రూం నెం 7993103347, 040 23237416కు సమాచారం అందించాలని, ఈ కంట్రోల్ రూం 24 గంటలు పనిచేస్తుందన్నారు. కంట్రోల్ రూంకు సమాచారం అందించిన వెంటనే ఆయా శాఖల బృందాలను అప్రమత్తం చేస్తే ఆ ప్రాంతానికి వెళ్లి సహాయక చర్యలు చేపడతారని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

## బిసిలకు 42శాతం రిజర్వేషన్లు సాధించేవరకూ ఉద్యమం

మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/గండిపేట : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బిసి సెల్ కార్యాలయంలో వ్యవసాయ కళాశాల అనుబంద సెమినార్ హాల్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్, బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, విసి అల్దాస్ జానయ్య, బిసి సెల్ ఇంచార్జి డాక్టర్ దామోదర్ రాజులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బి సి విభాగం ఏర్పాటు చేసుకున్నందుకు చాలా సంతోషకరమైన విషయమన్నారు. 60 సంవత్సరాలుగా యూనివర్సిటీలో బిసి విభాగం లేదు. బిసి ఉద్యోగస్తులను, విద్యార్థులను అందరు కలిసే విధంగా బిసి విభాగం ఏర్పాటు చేసుకున్నాన్నారు. బలహీనవర్గాల ప్రతినిత్యం జరుగుతున్న పోరాటంలో రాజకీయ పార్టీలు మాత్రమే పాల్గొంటున్నాయన్నారు. కుల గణన జరిపిన తరువాత బిసి లకు 42శాతం రిజర్వేషన్లు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థలు రిజర్వేషన్లు సాధించుకోవడానికి తెలంగాణ ఉద్యమం మాదిరి అన్ని వర్గాలు భాగస్వామ్యం కావాలి అని ఆయన తెలిపారు. ప్రొఫెసర్ ఆచార్య జయశంకర్ యూనివర్సిటీలో బిసి విభాగం ఏర్పాటు చేసుకున్నామో.. అలాగే ప్రతి సంస్థ, ప్రతి ఉద్యోగుల సంస్థల్లో, కార్యాలయాల్లో బిసి విభాగం ప్రారంభించాలని ఆయన పేర్కొన్నారు. జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో బిసి విభాగానికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించడానికి స్థానిక శాసన సభ్యులు 10 లక్షలు రూపాయలు సహకరిస్తామన్నారు. విద్యార్థి నాయకుడిగా అనేక సార్లు ఈ యూనివర్సిటీకి వచ్చా.. ఇప్పుడు మంత్రిగా ఇక్కడ పాల్గొన్న. విసి జానయ్య ప్రభుత్వం మొత్తాన్ని ముఖ్యమంత్రి, మంత్రులను ఇక్కడికి మా ప్రభుత్వం వ్యవసాయ యూనివర్సిటీకి, వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్రవేత్తల సలహాలు, ఆధునిక యాంత్రీకరణపై అన్నిరకాల సలహాలతో వ్యవసాయం పండగలా జరగాలన్నారు. కార్యక్రమంలోప్రొఫెసర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

# రీల్

## 'అరణ్య ధార' ట్రైలర్ విడుదల




బాలు నాయుడు, ఆశా సుదర్శన్ జంటగా నటించిన సస్పెన్స్ అండ్ మైథలాజికల్ థ్రిల్లర్ మూవీ 'అరణ్య ధార'. ఈ చిత్రాన్ని 'సిల్వర్ స్క్రీన్ షాట్స్' బ్యానర్‌పై నిర్మాత బాలు నాయుడు అండ్ టీం నిర్మించారు. దర్శక ద్వయం శివ పచ్చ, బాలు నాయుడు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇటీవల 'అరణ్య ధార' నుండి ఫస్ట్ సింగిల్‌గా 'యుగానికే ప్రయాణమే' అనే పాట రిలీజ్ అయ్యింది. ప్రముఖ సంగీత దర్శకులు, సింగర్ అయినటువంటి రఘు కుంచె ఆ పాటను లాంచ్ చేయగా దానికి విశేషాదరణ లభించింది. తాజాగా ట్రైలర్ ను 'ది 100' మూవీ దర్శకులు రాఘవ్ ఓంకార్ శశిధర్ లాంచ్ చేశారు. 'అరణ్య ధార' ట్రైలర్ 1: 52 నిమిషాల నిడివి కలిగి ఉంది. సస్పెన్స్, హారర్ నేపథ్యంలో ట్రైలర్ ను కట్ చేసినట్టు. హీరోయిన్ మిస్ అవ్వడంతో.. పోలీస్ అయినటువంటి ఆమె తండ్రి హీరోని అరెస్ట్ చేసి విచారించడం. ఆ తర్వాత ఊహించని విధంగా అతను కూడా మిస్ అవ్వడం. ఆ తర్వాత హీరో వెళ్లి అడవిలో పడటం.. వంటి అంశాలతో ట్రైలర్ గ్రిప్పింగ్‌గా ఉంది.



## 'పెళ్లిలో పెళ్లి' బ్యానర్ లాంచ్


గౌరి ఫిలింస్‌తో కలిసి సుఖకర్త ఫిలింస్ ప్రొడక్షన్ నెం.1గా 'పెళ్లిలో పెళ్లి' చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ చిత్రంలో శివ సాయిరిషి, సంస్కృతి గోరే, విష్ణు ప్రియ, ఉమా మహేశ్వర రావు, తనికెళ్ల భరణి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. గణేష్ కోలి నిర్మిస్తున్న 'పెళ్లిలో పెళ్లి' సినిమాకు శ్రీకాంత్ సంబరం దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ లాంచ్‌తో పాటు బ్యానర్ లాంచ్ కార్యక్రమాన్ని హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి, యంగ్ హీరో ఆకాష్ జగన్నాథ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నటుడు తనికెళ్ల భరణి మాట్లాడుతూ ఈ సినిమా బ్యానర్ పేరు సుఖకర్త..అంటే సుఖాన్ని అందించేవాడు అని అర్థం. దర్శకుడు శ్రీకాంత్ కొద్దిరోజుల క్రితం ఈ సినిమా కోసం అప్రోచ్ అయ్యాడు. షోలాపూర్‌లో సినిమా చేస్తున్నామని చెప్పాడు. అక్కడ తెలుగు వాళ్లు చాలా మంది ఉంటారు. నన్ను ఈ టీమ్ ఎంతో గౌరవంగా చూసుకున్నారు. పెద్దలను గౌరవించడం అనే గొప్ప గుణం వీళ్లందరిలో కనిపించింది. గణేష్ కోలి లాంటి ప్యాషనేట్ ప్రొడ్యూసర్స్‌కు సక్సెస్ వస్తే మరిన్ని మంచి చిత్రాలు యంగ్ స్టర్స్‌తో నిర్మిస్తారు. ఆయన 'పెళ్లిలో పెళ్లి' సినిమాతో హిట్ అందుకుని బాలీవుడ్‌లో సినిమాలు చేసేంతగా ఎదగాలని కోరుకుంటున్నా. డైరెక్టర్ శ్రీకాంత్ సంబరం ప్రతిభావంతుడు. హైదరాబాద్‌లో సినిమా చేయడం సులువే కానీ షోలాపూర్‌కు 24 క్రాఫ్టుల వాళ్లను తీసుకెళ్లి చాలా స్పీడ్‌గా సినిమా రూపొందించాడు. అతనికి కూడా మంచి ఫ్యూచర్ ఉండాలని కోరుకుంటున్నా. అన్నారు.

## 'బుల్లెట్టు బండి' థ్రిల్లింగ్ టీజర్



డైరీ సినిమాతో సక్సెస్ సాధించిన నిర్మాత ఫైవ్ స్టార్ క్రియేషన్స్ కతిరేసన్ మళ్లీ దర్శకుడు ఇన్నాసి పాండియన్ తో జట్టుకట్టారు. రాఘవ లారెన్స్ హీరోగా సూపర్‌నేచురల్ యాక్షన్ థ్రిల్లర్ 'బుల్లెట్టు బండి' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకోస్తున్నారు. రాఘవ లారెన్స్‌తో పాటు ఆయన తమ్ముడు ఎల్విన్ కూడా లీడ్ రోల్ చేస్తున్నారు. ఫాస్ట్ పేస్‌తో సాగే ఈ సినిమా తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ఒకేసారి తెరకెక్కుతోంది. నాగచైతన్య చేతుల మీదుగా బుల్లెట్టు బండి టీజర్‌ను లాంచ్ చేశారు. 80, 90ల్లో అభిమానుల డ్రీమ్ గర్ల్‌గా వెలుగొందిన డిస్కో శాంతి శ్రీహరి ఈ సినిమా ద్వారా 28 ఏళ్ల తర్వాత సినీ రంగంలోకి తిరిగి అడుగుపెడుతున్నారు. 1997 తర్వాత ఆమె సినిమాల్లో నటించలేదు. ఈ సినిమాలో ఆమె ఒక ముఖ్యమైన పాత్ర పోషించారు.

## 'ది ప్యారడైజ్' ఫస్ట్ లుక్ విడుదల



నేచురల్ స్టార్ నాని యాక్షన్ సినిమా 'ది ప్యారడైజ్'లో ఇంతకు ముందు ఎన్నడూ చేయని క్యారెక్టర్ చేస్తున్నారు. దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత సుధాకర్ చెరుకూరి ఈ సినిమా నిర్మిస్తున్నారు. ది ప్యారడైజ్ నుండి రగ్గడ మీసం, గెడ్డం, రెండు జడలతో కనిపించిన నాని అదిరిపోయే ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. ఆ రెండు జడలే ఆయనకు పేరుగా మారాయి. ఇందులో ఆయన పాత్ర పేరు 'జడల్'. పేరు చాలా యూనిక్‌గా వుంది. పోస్టర్ కంపోజిషన్ మరింత ఫైర్ పెంచింది. ఆయన వెనక, కత్తులుబుల్లెట్లతో తయారైన ఒక భారీ రౌండ్ వీల్ ఒక రకమైన డేంజర్‌ని చూస్తోంది. పొగమంచులో ఎగిరే కాకులు ప్రతి ఎలిమెంట్‌లోనూ సింబాలిజం కట్టిపడేస్తోంది. ప్రస్తుతం ఈ ఫస్ట్ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. దసరా తర్వాత నానిశ్రీకాంత్ ఓదెల మరోసారి కలిసి చేస్తున్న ఈ సినిమా, హైదరాబాద్‌సికింద్రాబాద్ నేపథ్యంలో సాగే ఇంటెన్స్ పీరియడ్ యాక్షన్ డ్రామా ఇది. ఈ చిత్రంలో రాఘవ జూయాల్ ఒక కీలక పాత్రలో కనిపించనుండగా, రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీని సి.సాయి, ఎడిటింగ్ నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైన్ అవినాష్ కొల్లా చేస్తున్నారు. ఈ సినిమా 2026 మార్చి 26న థియేటర్లలోకి రానుంది. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్ మొత్తం ఎనిమిది భాషల్లో రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## 'అఖండ-2' డబ్బింగ్ పూర్తి



నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న అఖండ సీక్వెల్ అఖండ 2: తాండవం' విడుదలకు సిద్ధమవుతుంది. ఈ చిత్రం డబ్బింగ్ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రం హై బడ్జెట్ చిత్రాన్ని 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను ఎం తేజస్విని నందమూరి సమర్పిస్తున్నారు. తాజాగా అఖండ 2: తాండవం కోసం బాలకృష్ణ డబ్బింగ్ పూర్తిచేశారు. ఇది సినిమా పనుల్లో ఒక ముఖ్యమైన మైల్ స్టోన్. మిగతా పోస్ట్‌ప్రొడక్షన్ పనులు కూడా ఫుల్ స్పీడ్‌లో జరుగుతున్నాయి. సీజీ వర్క్, రీరికార్డింగ్, ఇంకా మిగతా టెక్నికల్ పనులన్నీ ఒకేసారి చేస్తున్నారు. ఈ నెలాఖరుకల్లా పెండింగ్ పనులు మొత్తం పూర్తవుతాయి. మరో మూడు వారాల్లో ఫస్ట్ కాపీ రెడీ అవుతుంది. ఈ దసరాకు, అంటే సెప్టెంబర్ 25న సినిమా థియేటర్లలోకి వస్తుందని నిర్మాతలు తెలిపారు. బాలకృష్ణ సరసన సంయుక్త ముఖ్యపాత్రలో నటిస్తున్నారు. హర్షాలి మల్హోత్రా ఈ సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. ఆమె కూడా స్టోరీలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమాకు ఎస్. థమన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించగా, సి.రాంప్రసాద్ డీవోపీగా వర్క్ చేస్తున్నారు. ఎడిటింగ్‌ను తమ్మిరాజు నిర్వహిస్తుండగా, ఏఎస్. ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు.

## లేడీ ఓరియెంటెడ్‌లో అంజలి



బ్యూటిఫుల్, టాలెంటెడ్ హీరోయిన్ అంజలి లీడ్ రోల్‌లో 9 క్రియేషన్స్ నిర్మాణంలో డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి పులిచెర్ల రూపొందిస్తున్న కొత్త చిత్రం హైదరాబాద్‌లోని మూవీ ఆఫీస్‌లో పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ చిత్రానికి రాజచంద్రశేఖర్ రెడ్డి కందుల నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి పులిచర్ల గతంలో సుడిగాలి సుధీర్‌తో 'సాఫ్ట్ వేర్ సుధీర్', 'గాలోడు' అనే కమర్షియల్‌గా సక్సెస్ ఫుల్ చిత్రాలు రూపొందించి దర్శకుడిగా తన ప్రతిభ నిరూపించుకున్నారు. అంజలితో ఇప్పుడు లేడీ ఓరియెంటెడ్ సినిమా చేస్తున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభించనున్నారు. ఈ సినిమాకు ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సి.రాంప్రసాద్ పని చేస్తున్నారు. ఈ చిత్రానికి పనిచేసే ఇతర నటీనటుల, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

## ఉండిపోవే నాతోనే పాట విడుదల



బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ప్రస్తుతం 'కిష్కిందపురి'లో నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై డైనమిక్ ప్రొడ్యూసర్ సాహు గారపాటి నిర్మించి చిత్రానికి కౌశిక్ పెగల్లపాటి రచన దర్శకత్వం వహించారు. అర్చన ప్రజెంట్ చేస్తున్నారు. హార్రర్‌మిస్టరీ థ్రిల్లర్‌లో అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటించింది. ఫస్ట్ గ్లింప్స్‌తో బజ్ క్రియేట్ చేసిన తర్వాత ఇప్పుడు మేకర్స్ ఫస్ట్ సింగిల్ 'ఉండిపోవే నాతోనే' పాటను ఆవిష్కరించారు. ఈ పాట మ్యూజిక్ ప్రమోషన్స్‌కి శ్రీకారం చుట్టి ఆడియన్స్‌లో మంచి ఇంపాక్ట్ క్రియేట్ చేసింది. చైతన్ భరద్వాజ్ స్వరపరిచిన ఈ అందమైన పాటలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ అద్భుతమైన కెమిస్ట్రీతో ఆకట్టుకున్నారు. వైబ్రెంట్ బీట్స్‌తో ఈ పాట కట్టిపడేసింది. జావేద్ అలీ వోకల్స్ మెస్మరైజ్ చేశాయి. ప్రేమలో ఉన్న భావోద్వేగాలను పూర్ణా చారి సాహిత్యం ద్వారా మరింత అందంగా ప్రజెంట్ చేశారు. బ్యూటీఫుల్ బీచ్ సైడ్ విజువల్స్ చాలా ప్లెజెంట్‌గా వున్నాయి. టీజర్‌లో ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్ళిన దర్శకుడు కౌశిక్. ఈ సాంగ్‌తో ఒక రొమాంటిక్ టచ్ ఇచ్చాడు. దీనికి రాజు సుందరం కొరియోగ్రఫీ చేశారు. పాట ఆవిష్కరణ ఈవెంట్ లో హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ మీరందరూ ఇక్కడికి విచ్చేసినందుకు చాలా ఆనందంగా ఉంది. ఇక్కడ మీ సమక్షంలో సాంగ్‌ని లాంచ్ చేయడం చాలా హ్యాపీగా ఉంది. చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు అందరికీ నచ్చే సినిమా ఇది. మంచి హారర్ మిస్టరీ. మీరందరు సినిమా చూసి మా టీమ్ అందరిని బ్లెస్ చేయాలని కోరుకుంటున్నాను అని అన్నారు. హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ ఇది చాలా స్పెషల్ సినిమా. ఇందులో చాలా స్పెషల్ మూమెంట్స్ ఉంటాయి. త్వరలోనే సినిమా రిలీజ్ అవుతుంది.

# సినీ కార్మికుల వేతనాలను పెంచాలి

### ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సినీ కార్మికుల వేతనాలను పెంచాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. సినీ పరిశ్రమలో పనిగంటలతో సంబంధం లేకుండా పని చేస్తున్న కార్మికునికి రోజుకు రూ.280లు మాత్రమే చెల్లిస్తున్నారని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్మికులు తమ వేతనాలు పెంచాలని చేస్తున్న సమ్మె 5వ రోజుకు చేరుకున్నప్పటికీ, సినీ నిర్మాతల మండలి వేతనాలు పెంచేది లేదని ఖరాకండిగా చెబుతుందని, ఈ మొండి వైఖరిని విడనాడి, కార్మికులతో వెంటనే చర్చలు జరిపి, 30 శాతం వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. సినిమా నటీనటులకు సినీ నిర్మాతలు వందల కోట్ల రూపాయలు చెల్లిస్తున్నారని, కానీ కార్మికుల విషయం వచ్చే సరికే శ్రమ దోపిడికి పాల్పడుతున్నారని ఆరోపించారు. సినీ కార్మికులు 8 గంటల పనిదినం చేసినందుకు రూ.1280లను, అలాగే అదనంగా పని చేస్తే అదనపు పని గంటలకు వేతానాలు చెల్లించకుండ సినీ నిర్మాతలు శ్రమ దోపిడికి పాల్పడుతున్నారని ఆరోపించారు. సినీ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించకపోతే సినీ కార్మికులతో కలిసి ఎఐటియుసి పోరాటాలను, ఉద్యమాలను చేపడుతుందని ఆయన హెచ్చరించారు. కార్మికశాఖ, ప్రభుత్వం వెలంటనే జోక్యం చేసుకుని కార్మికులకు తక్షణమే 30శాతం వేతనాలను పెంచి, సినీ కార్మికులకు అండగ ఉండాలని ఆయన కోరారు.

**ఫెడరేషన్ నేతలకు నిర్మాత టీజీ లీగల్ నోటీసు**

తెలుగు సినిమా కార్మికుల సమ్మె ఐదోరోజుకు చేరింది. ఫిలిం ఛాంబర్‌తో పాటు ఎఫ్‌డిసి చైర్మన్‌తో కో ఆర్డినేషన్ కమిటీ ఒక దఫా చర్చలు కూడా జరిగాయి. వ్యవహారం కొంత దాలిరోకి వస్తున్న నేపథ్యంలో పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వ ప్రసాద్ వ్యక్తిగతంగా ఫెడరేషన్ అధ్యక్ష కార్యదర్శులకు నోటీసు పంపారు. దీంతో కథ మళ్ళీ మొదటికి వచ్చింది. టీజీ విశ్వప్రసాద్ నోటీసు పంపడంతో ఫెడరేషన్ నేతలు ఆయన మీద ఆగ్రహంతో ఊగిపోతున్నారు. సినీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యదర్శి అమ్మిరాజు మాట్లాడుతూ మా కార్యాచరణ ఆదివారం ప్రకటిస్తామని చెప్పారు. వ్యక్తిగతంగా నోటిస్ పంపడం బాధాకరమని చెప్పారు. ఒకటి రెండు రోజుల్లో శుభం కార్డు పడుతున్న క్రమంలో ఇలా నోటిస్ పంపించి కార్మికులను ఆగ్రహానికి గురి చేయడం సరైన పద్ధతి కాదని చెప్పారు. ఇది చాలా బాధాకరమైన విషయం అని ఆయన అన్నారు. ఏదైనా ఉంటె ఫిలిం ఛాంబర్ చూసుకుంటుంది. అందరికి అపెక్స్‌బాడీ ఫిలిం ఛాంబర్ మాత్రమే. సమ్మె జరిగితే నిర్మాతలకు ఎంత నష్టమో కార్మికులకు కూడా నష్టం జరుగుతుందన్నారు. తాము కొట్లాటకు పోవాలనుకోవడం లేదని చెప్పారు. ఇచ్చిన నోటిస్ వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# 'మన్ కీ బాత్' ఆరంభం నుంచి రూ.34.13 కోట్ల ఆదాయం

### రాజ్యసభకు ప్రభుత్వం వెల్లడి

### ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు ఆస్వాదిస్తున్నారని మంత్రి కితాబు

**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమం ప్రారంభం నుంచి రూ.34.13కోట్ల ఆదాయాన్ని ఆర్జించిందని శుక్రవారం ప్రభుత్వం రాజ్యసభకు వెల్లడించింది. 'మన్ కీ బాత్' కార్యక్రమం బహుళ సాంప్రదాయ, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ప్రేక్షకులకు సన్నిహితమైందని సభ్యుడు అడిగిన ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా కేంద్ర సమాచార ప్రసారాల శాఖ మంత్రి ఎల్.మురుగన్ ఈ విషయాన్ని వెల్లడించారు. 'మన్ కీ బాత్' కార్యక్రమం మొట్టమొదటిసారిగా 2014 సంవత్సరం అక్టోబరు 3న ప్రసారం అయ్యింది. మంత్రి మురుగన్ మాట్లాడుతూ ఆకాశవాణిలో (ఆల్ ఇండియా రేడియో) ఈ కార్యక్రమాన్ని వినడం ద్వారా ప్రేక్షకులు ఎక్కువమంది పాల్గొంటారని మురుగన్ చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఆకాశవాణి తన జాతీయ, ప్రాంతీయ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నదని, స్థానిక ప్రేక్షకులను చేరుకోవడానికి దాని ప్రాంతీయ వెర్షన్‌లను కూడా ప్రసారం చేస్తున్నదని తెలియజేశారు. అదే సమయంలో ఈ కార్యక్రమం దూరదర్శన్, వివిధ జాతీయ, ప్రాంతీయ భాషా ఛానెళ్లలో కూడా ప్రసారం అవుతున్నదని, దూరదర్శన్ ఛానెళ్లతో పాటు డిడి ఫ్రీ డిష్ 48 ఆకాశవాణి రేడియో ఛానెళ్లు, 92 ప్రైవేట్ టెలివిజన్ ఛానెళ్లు దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని గ్రామీణ, మారుమూల ప్రాంతాల వీక్షకులకు కూడా అందుబాటులోకి తెచ్చిందని మంత్రి మురుగన్ వివరించారు. ఈ కార్యక్రమాన్ని పిఎంఓ ఇండియా, ఆల్ ఇండియా రేడియో, ప్రసార్ భారతి ఓటిటి ప్లాట్‌ఫారమ్ వేవ్స్, అలాగే 260కి పైగా ఆకాశవాణి ఛానెళ్లకు అందించే 'న్యూస్ ఆన్ ఎయిర్' మొబైల్ యాప్ ద్వారా ప్రత్యక్షప్రసారం చేసి ఆర్కైవ్ చేసినట్లు ఆయన వివరించారు. ఇదిఅనుబంధ ప్లాట్‌ఫారమ్‌లు, ఛానెళ్లలో విస్తృత వ్యాప్తిని సులభతరం చేయడానికి ప్రసారభారతి, పిబి ఎస్‌హెచ్‌ఏబిడి న్యూస్ ఫీడ్ సర్వీస్‌లో కూడా అందుబాటులో ఉంచబడిందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగానే కాకుండా ప్రపంచవ్యాప్తంగా సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు, ఫేస్‌బుక్ సహా ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ప్రేక్షకుల ఆదరణ పొంది ఆస్వాదిస్తున్నారని చెప్పారు.

# పండుగ రోజు కూడా పస్తులేనా?

### వేతనాల కోసం ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ఎదురుచూపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు జీతాలు సకాలంలో అందక తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండుగ రోజుల్లో కూడా పస్తులుండాల్సిన దుస్థితి తమకు ఎదురవుతోంది. జూలై నెల వేతనాలు ఇంకా అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఉద్యోగులు వాపోతున్నారు. ప్రభుత్వం తమపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ప్రతిసారీ జీతాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి వస్తోందని ఉద్యోగులు తెలిపారు. రాష్ట్రంలో సుమారు 17,541 మంది ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 33 జిల్లాల్లో పనిచేస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు అందుతున్నప్పటికీ, తమ విషయంలో మాత్రం జాప్యం జరుగుతోందని వారు అంటున్నారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి కూడా ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని విజ్ఞప్తులు సమర్పించినా ఫలితం లేదని ఉద్యోగులు పేర్కొన్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నప్పటికీ, తమకు తక్కువ జీతం వస్తుందని, అది కూడా సకాలంలో రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

**ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌లు..**

- ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు తమ డిమాండ్‌లను ప్రభుత్వం ముందు ఉంచుతున్నారు.
- కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి, డైరెక్ట్ కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి.
- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కార్పొరేషన్ ద్వారా ఏర్పాటు చేసి వేతనాలు చెల్లించాలి.
- జి.ఓ నెంబర్ 60 ప్రకారం నాలుగో తరగతి ఉద్యోగులకు నెలకు రూ.15,600 వేతనం చెల్లించాలి.
- సపోర్టింగ్ స్టాఫ్, ఎంఎన్ఓ, వాచ్‌మెన్, స్వీపర్ వంటి నాలుగో తరగతి ఉద్యోగులకు ప్రత్యేక నిధులు విడుదల చేసి ఉద్యోగ భద్రత కల్పించాలి.
- వారికి హెల్త్ కార్డులు, హెల్త్ ఇన్సూరెన్స్ వర్తింపజేయాలి.

**వేతనాలు ఇవ్వకపోతే సమ్మెకు పిలుపునిస్తాం : రామ రాజేష్ ఖన్నా**

మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ సెప్టెంబర్ మొదటి వారంలో కొత్త వేతనాలు ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నాలుగో తరగతి ఉద్యోగులందరూ కలిసి నిరసనలు చేపడతామని హెచ్చరించారు. జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ, సెప్టెంబర్ 3వ తేదీ నుంచి తమ డిమాండ్లు నెరవేరేంతవరకు నిరవధిక సమ్మెకు పిలుపునిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

# సన్నాహాలు! (మొదటి పేజీ తరువాయి)

ఆమోద ముద్ర వేసింది. ఈ విషయాన్ని సిఎన్ఎస్ వార్తా సంస్థ శుక్రవారం వెల్లడించింది. ఇలావుంటే, గాజా నగరంపై నియంత్రణ సాధించేందుకు తాను చేసిన ప్రతిపాదనను అంగీకరించిన తర్వాత, నెతన్యాహు మీడియాతో మాట్లాడుతూ యుద్ధం ముగిసిన తర్వాత గాజా భద్రత తమ పరిధిలోనే ఉండాలని తాము కోరుకుంటున్నట్టు చెప్పారు. గాజాను శాశ్వతంగా ఆక్రమించుకోవాలిన అనుకోవడం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితులు చక్కబడి, అక్కడ శాంతి నెలకొన్న అనంతరం, పరిస్థితిని మరోసారి సమీక్షిస్తామని అన్నారు. ఇలా వుంటే, గాజా ఆక్రమణకు సెక్యూరిటీ కేబినెట్ ఆమోదించిన వెంటనే, ఈ బాధ్యతను పూర్తి చేయడానికి ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడిఎఫ్) సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఒకవైపు పూర్తిస్థాయి యుద్ధ పరిస్థితులు కనిపిస్తుండగా, మరోవైపు నెతన్యాహు మానవతా సాయాన్ని గురించి ప్రస్తావించడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. తాము రెండు మిలియన్ టన్నులకు పైగా ఆహారాన్ని గాజాకు పంపామని ఆయన అన్నారు. తమ సహాయక సరఫరాలను అడ్డుకుంటున్నారని పాలస్తీనియన్లపై ఆయన ఆరోపణలు చేశారు. యుద్ధం వెంటనే ముగియాలంటే, హమాస్ ఆయుధాలను విడిచిపెట్టి, వారి వద్ద బందీలుగా ఉన్న ఇజ్రాయెల్ పౌరులను విడుదల చేయాలని నెతన్యాహు అన్నారు. గాజాలో ఎక్కువ మంది ప్రజలు హమాస్ పట్ల వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. గాజాను ఆధీనంలోకి తీసుకున్న అనంతరం, అక్కడ మెరుగైన పాలన కోసం ప్రణాళికను సిద్ధం చేస్తామని ఆయన పేర్కొన్నారు. గాజాలో శాంతి భద్రతల అంశమే కీలకమని, ఆ ప్రాంతాన్ని శాశ్వతంగా స్వాధీనం చేసుకోవాలన్న ఆలోచన తమకు లేదని నెతన్యాహు అంటున్నప్పటికీ, వాస్తవాలు మరోలా కనిపిస్తున్నాయి. ఎక్కడ చూసినా ధ్వంసమైన భవనాలు.. శిథిలాలతో కనిపిస్తున్న గాజాపై ముప్పేట దాడి జరిగితే, అక్కడి ప్రజల పరిస్థితి ఏమిటనేది ప్రశ్న.

# సిపిఐకి గణనీయమైన సీట్లు

(మొదటి పేజీ తరువాయి)

తొందరగా నిర్వహించాలన్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు ఆలస్యమైతే రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. స్థానిక సంస్థలకు ప్రజాప్రతినిధులు లేకపోవడం మూలంగా కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రావడం లేదన్నారు. బిసి రిజర్వేషన్లపై బిజెపి ద్వంద వైఖరి ప్రదర్శిస్తుందని, రాష్ట్రంలో బిల్లుకు మద్దతు తెలిపి కేంద్రంలో బిల్లును అడ్డుకోవడం ఆ పార్టీ ద్వంద వైఖరిని స్పష్టం చేస్తుందన్నారు. అలాగే బిఆర్ఎస్ కూడా 42శాతం బిసి రిజర్వేషన్లపై దోబూచులాడటం సరికాదని, వారి వైఖరి ఏంటో స్పష్టంగా తెలియజేయాలన్నారు. రిజర్వేషన్ల సమస్యను కొలిక్కి తెచ్చి సాధ్యమైనంతా తొందరగా ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఏళ్లుగా గుడిసేలేసుకుని నివాసముంటున్న పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని, సామాజికంగా వెనకబడిన పేదలందరికి ఇండ్లు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న టైంలో హుస్నాబాద్ ప్రాంతంలో ప్రతి ఒక్క పేద కుటుంబానికి పక్కా ఇళ్లు ఇప్పించానని తెలిపారు. కరీంనగర్‌లో ఎల్ఎండి డ్యాం ఆనకట్ట వద్ద గత 30ఏండ్లుగా నివాసముంటున్న పేదల ఇండ్లు బఫర్ జోన్‌లో ఉన్నాయంటూ ఇరిగేషన్ అధికారులు నోటిసులు ఇవ్వాడాన్ని చాడా వెంకట రెడ్డి తప్పుబట్టారు. ఇన్నేండ్లుగా లేని అభ్యంతరం ఇప్పుడు ఎందుకు చెబుతున్నారో తెలియజేయాలన్నారు. ఇండ్లు నిర్మించుకున్నప్పుడు పర్మిషన్లు ఇచ్చి ఇప్పుడు కూలుస్తామంటే ఎలా అని ప్రశ్నించారు. సిపిఐ పేదల పక్షాన నిలబడుతుందని, పోరాడుతుందన్నారు. తక్షణమే నోటీసులు వెనక్కి తీసుకోవాలని డి మాండ్ చేశారు. పార్లమెంటరీ వ్యవస్థలో ఎన్నికలు కీలకమైనవన్నారు. ఎన్నికల సందర్భంగా కోట్లాది గా డబ్బులు పట్టుబడగా వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో? తెలపాలని డిమాండ్ చేశారు. వెంటనే సంబంధిత వ్యక్తులు, ప్రజాప్రతినిధులెవరైనా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, బత్తుల బాబు, నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి, పిట్టల సమ్మయ్య, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు బండ రాజిరెడ్డి, ఉమ్మెంతల రవీందర్ రెడ్డి, మచ్చ రమేష్, బావండ్లపల్లి యుగేందర్, రామారపు వెంకటేష్, నాయకులు గొడిసెల తిరుపతి గౌడ్,కేశబోయిన రాములు పాల్గొన్నారు.

# భ్రష్టు పట్టించారు

(మొదటి పేజీ తరువాయి)

రికార్డింగ్‌ను ఈ సందర్భంగా బండి సంజయ్‌కు వినిపించారు. విచారణ అనంతరం మీడియాతో బండి సంజయ్ మాట్లాడుతూ.. తన ఫోన్లను ప్రతి క్షణం ట్యాప్ చేసినట్లు తేలడంతో షాక్‌కు గురయ్యే విషయాలన్నీ బయటకు వచ్చాయన్నారు. మావోయిస్టుల పేరు చెప్పి ఫోన్లను ట్యాప్ చేశారని తనతో పాటు రేవంత్ రెడ్డి, బిఆర్ఎస్ ఎంఎల్ఎలు, ఎంఎల్సిల ఫోన్లు కూడా ట్యాప్ చేశారన్నారు. కెసిఆర్ ప్రభుత్వం వావి వరసలు కూడా మర్చిపోయి ట్యాప్ చేసింది. తన ఫోన్లతోపాటు స్టాఫ్, ఫ్యామిలీ, పని వాళ్ల ఫోన్లను కూడా ట్యాప్ చేశారు. ఆశ్చర్యమేందంటే... కెసిఆర్‌ఆర్ బిడ్డ, అల్లుడి ఫోన్లను కూడా ట్యాప్ చేశారు. ఇట్లాంటి నీచులను ఏమనాలో అర్థం కావడంలేదన్నారు. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి నా దగ్గరున్న సమాచారం, ఆధారాలన్నీ సిట్ కు అందించానన్నారు. ఎస్ఐబిఅంటే.. మావోయిస్టు, టెర్రరిస్టుల కార్యకలాపాలను తెలుసుకుని నియంత్రించడానికి ఏర్పడ్డ వ్యవస్థ. దానిని అడ్డం పెట్టుకుని కెసిఆర్‌ఆర్, ఆయన కొడుకు కలిసి పోలీసులతో మాలాంటి రాజకీయ నాయకులందరి ఫోన్లను ట్యాప్ చేశారన్నారు. ఇంకా షాక్ గురైన విషయం ఏందంటే... గ్రూప్ 1 పేపర్ లీకేజీకి సంబంధించిన కేసును విచారించిన జడ్జి పోన్‌ను కూడా ట్యాప్ చేశారంటే కెసిఆర్ ఎంతటి నీచానికి పాల్పడ్డారో అర్థం చేసుకోవచ్చునన్నారు. నిందితులైన ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు, ప్రణీత్ రావు, రాధాకిషన్ రావులకు ఉరిశిక్ష సరిపోదు... క్షణ క్షణం చేసిన పాపాలు తలుచుకుని కుల్లి కుల్లి ఏడ్చేలా శిక్ష విధించాల్సిన అవసరం ఉందన్నారు. ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వద్ద గత ఎన్నికల సమయంలో రూ.7 కోట్లు పట్టుకున్నరు. ఆయనతోపాటు గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతల వద్ద రూ.వందల కోట్లు పట్టుకున్నరు. ఆ పైసలన్నీ ఏమైనయో తెలియదు. రూ.20 కోట్లు పట్టుకుంటే అందులో రూ.18 కోట్లు దొబ్బితిని... విచారణలో మాత్రం రూ.2 కోట్లు మాత్రమేనని చూపించేవాళ్లు అని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జడ్జీల ఫోన్‌లు కూడా ట్యాపింగ్ అయ్యాయి. పిలిచి విచారణ చేసే అధికారం, దమ్ము సిట్ కు ఉందా? వీటిని దృష్టిలో ఉంచుకునే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని సిబిఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తున్నానన్నారు.

**ప్రభాకర్‌రావును ఎస్ఐబిలో ఎలా కొనసాగిస్తారు..?**

రిటైర్డ్ అయిన ప్రభాకర్ రావును ఎస్ఐబీలో ఎట్లా కొనసాగిస్తారు? ఎన్నో రహస్యాలుంటాయి కదా అని హోంశాఖ ప్రశ్నిస్తే... ప్రభాకర్ రావును ఐజి అని తప్పుగా చెబుతూ నియమించారు. మావోయిస్టులు, తీవ్రవాదులకు సంబంధించి సేకరించిన ఫోన్ ట్యాపింగ్ ఆధారాలను ప్రతి ఏటా జనవరి, జులై నెలలో డిలీట్ చేయాలని హోంశాఖ ఖచ్చితమైన ఆధారాలు జారీ చేసినా ఏనాడూ కెసిఆర్ పాటించలేదు. టెలికం రెగ్యులేటరీ విధానాలను పాటించకుండా అడ్డగోలుగా వ్యవహరించారు. వేల మంది ఫోన్లను ట్యాప్ చేసినట్లు సిట్ పోలీసుల వద్ద ఆధారాలున్నాయి. కెసిఆర్, ఆయన కొడుకు కెటిఆర్, ఎంపి సంతోష్ ఫోన్లు మాత్రమే బిఆర్ఎస్‌లో ట్యాప్ కాలేదు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com